ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 1 ఏప్రిల్ - 2021 ప్లవ పేజీలు 68 వెల రూ. 20



సంగీత సమ్మేళనం



# సాహిత్య ప్రస్థానం

## సంఘర్షణ వేళ ... సాహిత్యరంగం పాత్ర

**దే**శం స్వాతంత్ర అమృతోత్సవాలు జరుపుకొంటున్న వేళ రైతాంగం భారత్‌బంద్ నిర్వహించింది. ఆసేతు శీతాచలం ఈ నిరసన ప్రతిధ్వనించింది. ప్రతిచోటా సామాజిక, రాజకీయ రంగాల్లో పునస్సమీకరణలూ, కొత్త కదలికలూ కనిపిస్తున్నాయి. క రోనా గుప్పిటినుంచి ఇప్పుడిప్పుడే విడుదలవుతున్నామన్న ఆశతో ప్రజలు మళ్లీ సాధారణ జీవితంలోకి ప్రవేశిస్తున్నారు. 9/11 తర్వాత టెర్రరిజంపై పోరాటం అంటూ అమెరికా నాయకత్వాన సాగిన ఆధిపత్య వ్యూహాల పర్యవసనాలు ఇప్పుడు ప్రపంచం ముందున్నాయి. అంతర్జాతీయంగానూ ఆఫ్ఘనిస్తాన్ పరిణామాల వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి.ఇలాటి తరుణంలోనే కవులు, రచయితల పరిశీలన పదునెక్కాల్సి ఉంటుంది.

ఈ మధ్యనే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తీసుకున్న కవి నిఖిలేశ్వర్ రచయితలను ఎపి, తెలంగాణ పాలకులు కొనేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్య ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. సంఘర్షణాత్మక, సందిగ్ధ దశలో మానవాళికి సంఘీభావంగా నిలిస్తేనే సాహిత్యం సార్ధకమవుతుంది. ఇందుకోసం నడుం కట్టిన కవులూ, కళాకారులూ వివిధ రూపాల్లో పాలకుల వేధింపులకు, నిర్బంధానికి గురవుతూనే ఉన్నారు. వారిని కాపాడుకోవడానికి, ప్రజల పోరాటాలకు అండగా నిలవడానికి సాహితీ స్రవంతి, సాహిత్య ప్రస్థానం ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని మరోసారి ప్రకటిస్తున్నాం. మాలపల్లి నవల శతవార్షికోత్సవాలు నిర్వహించడం, ప్రత్యేక సంచిక ప్రచురించడం ద్వారా నాటి నుంచి నేటివరకూ సాగుతున్న ప్రజాసాహిత్య సంప్రదాయాలను మరోసారి స్మరించుకుందాం.

◆ ◆ ◆

రెండు రాష్ట్రాల్లో తెలుగు భాష పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఒక వేదిక ఏర్పాటు చేసుకున్నారు. ఉప రాష్ట్రపతితో సహా ఆ మాటే అన్నారు. తెలుగు మీడియానికి అసలు ఎసరు పెట్టారన్న నేపథ్యంలో ఎపి ప్రభుత్వం కూడా కొన్ని కార్యక్రమాలు చేసింది. వాస్తవమైన మార్పు దిశలో అడుగులు ఏ మేరకు పడేది చూడవలసివుంది. వెబ్‌లో చర్చ లూ ప్రసంగాలూ కొనసాగుతున్నాయి. ఇదంతా భాషాసాహిత్యాభిమానులు స్వాగతించే విషయం. ఇవి ఇంకా విశాలం, అర్థవంతం కావాలి. దీన్ని ఎలా ముందుకు తీసుకుపోవాలన్నది మన ముందున్న ప్రశ్న.


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్** ◆ **కెంగార మోహన్** ◆ **వొరప్రసాద్** ◆ **చీకటి దివాకర్** ◆ **గనారా** ◆ **శమంతకమణి** ◆ **కుమార స్వామి**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


వాట్సాప్ 2.0 – జి. ఉమామహేశ్వర్ ....... 5
ఏ వెలుగులకీ ప్రస్థానం – జి.నరసింహమూర్తి ....... 19
ఆ నలుగురూ లేనినాడు – వేణు మరీదు ............ 47
ఫేస్‌బుక్ – వాట్స్ ఆప్ – యక్కలూరి శ్రీరాములు .. 57


## కవితలు


ఇప్పుడు నిశ్శబ్దం కాదు – డా. కటుకోర్యుల రమేష్ 13
నీలాంజన వజ్రం – అడిగోపుల వెంకటరత్నం 14
మిమ్మల్ని కాక ఇంకెవర్ని? – ఎన్ విజయ్‌కుమార్ ..... 18
నేల దు:ఖిస్తోంది – మహబూబ్ బాషా చిల్లెం 23
కవితాధార – కొప్పుల ప్రసాద్ ........... 23
తిరిగొచ్చిన గతం – సునీత పేరిచర్ల ........... 25
గాయాల గని – సోంపాక సీత ........... 25
వెలుగు దృశ్యం – పుట్టి గిరిధర్ ........... 28
అన్నంముద్ద ఆకలి – కోడెం పవన్‌కుమార్ ...... 32
యుద్ధం ముగిసింది – ములుగు లక్ష్మీ మైథిలి .... 33
చినుకు ముత్యం – కొమురవెల్లి అంజయ్య .. 33
సూఫీ – ఈతకోట సుబ్బారావు .... 36
అంతకు క్రితమే ... – కె.ఆంజనేయ కుమార్ 37
అదేమీ పెద్ద సోద్యం కాదు – ఉప్పరి తిరుమలేష్ .... 37
చిందే స్వేదం స్వర్గం – చందలూరినారాయణరావు 40
వొంకీ కత్తి ఒకటి – లోలా రవికుమార్ కోసూరి 41
నిఘా – పద్మావతి రాంభక్త ..... 42
పెట్టుబడి – గిరిప్రసాద్ చెలమల్లు .. 56
వర్చువల్ వాగులో ఒంటరిపక్షి – కంచరాన భుజంగరావు 60
మన మధ్యన మనిషి – కుంచె శ్రీ ............... 61


## వ్యాసాలు


మహా'ముద్రణ' ప్రస్థానం
– తెలకపల్లి రవి .................................. 11
ఒక అపురూప వర్ణచిత్రం
– మందరపు హైమవతి .......................... 15
వర్గ వైరుధ్యం సృష్టించిన నెత్తురు నది
– వి. రెడ్డెప్ప రెడ్డి ................................ 26
అనువాదాల వల్ల భాషా సంస్కృతులు బలోపేతం
– రంగనాథ రామచంద్రరావుతో ముఖాముఖి .... 29
సామాజిక కవితా పరిమళం
– పిల్లా తిరుపతిరావు .............................. 34
సతీస్మృతి సత్యారాధేయం
– జోశ్యుల కృష్ణబాబు .............................. 38
సామాజికాంశాల చుట్ట'కుదురు'
– ఎమ్వీ రామిరెడ్డి .................................. 43
అమృతకవికి 'రసగంగాధర తిలకం'
– ప్రొ. తోట వెంకటస్వామి ......................... 45
వర్తమానం : అమ్మకానికి మీడియా.. దుర్భరంగా మనుగడ
– తెలకపల్లి రవి .................................... 52
స్వీయావిష్కరణలో అవిశ్రాంత అక్షరయానం ...
– అయిత అనిత .................................. 54
డైరీ ............................................................ 62
సాహిత్య ప్రస్థానం సెప్టెంబరు2021 పురస్కారాలు .... 24



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::


సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# వాట్సాప్ 2.0

- జి.ఉమామహేశ్వర్

**ఉ**దయం పదకొండవుతోంది. టీకప్పు తీసుకుని హాల్లోకి వచ్చింది శారద. ఎదురుగా మామయ్యగారి కుర్చీ విషాదాన్ని మోస్తోంది. ఇల్లంతా బోసిపోయి శూన్యమై తోస్తోంది. రామకృష్ణ గారు పోయి రెండు వారాలవుతోంది. శారద ఇంకా మామూలు మనిషి కాలేదు. తెలిసీ తెలియని వయసులో తండ్రిని పోగొట్టుకున్నప్పుడు కూడా ఇంత బాధ పడలేదు

ఈటైముకెల్లా ఇద్దరూ కలిసి టీ తాగేవాళ్ళు. టీ తాగుతున్నంతసేపూ ఆయన ఏవో ముచ్చట్లు చెబుతుండేవారు. ఆయన స్నేహితులందరూ శారదకు అలా పరిచయమైనవారే! రామకృష్ణ ఇరిగేషన్ డిపార్ట్మెంట్లో ఎస్ఇగా రిటైర్డ్ అయిన నాలుగేళ్ళకి భార్య క్యాన్సర్ వ్యాధితో చనిపోయింది. అప్పటినుండీ దాదాపు పదహారేళ్లుగా ఆయన కొడుకు దగ్గరే ఉన్నారు. కొడుకు దగ్గర అన్న మాటే కానీ నిజానికి కోడలితోనే ఆయన అనుబంధమంతా! వయసుతో సంబంధం లేకుండా పిల్లాడిలా చిన్న చిన్న పనుల్లో శారదకు సహాయపడేవాడు. సరుకులు తేవడం, ఆకు కూర వలవడం, పాలు తెచ్చివ్వడం, డైనింగ్ టేబిల్ సర్దడం, సోఫా కవర్లు సరిచేయడం, ఇలాంటివి చిన్న చిన్న పనులే అయినా, శారదకు చాలా తృప్తినిచ్చేవి. స్కూటర్లో సూపర్ మార్కెట్టుకో, బయటకో వెళితే చూసిన వాళ్ళు తండ్రీ కూతుళ్ళనుకునేవారు. ఇద్దరూ ఒక్కోసారి తండ్రీ కూతుళ్ళలాగా, ఒక్కోసారి తల్లీ కొడుకుల్లాగా అనిపించేవాళ్ళు.

శారద భారంగా ఒక నిట్టూర్పు విడిచి మళ్ళీ తన పనిలో పడింది. ఆయన స్నేహితులందరికీ ఫోన్ చేయడం, 'నేను రామకృష్ణ గారి కోడల్ని మాట్లాడుతున్నాను. మామయ్య గారు పోయారండి. పదిహేను రోజుల క్రితం ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా ఉందంటే హాస్పిటల్కి తీసుకెళ్ళాము. వెళ్లిన మూడో రోజు కార్డియాక్ అరెస్ట్తో చనిపోయారు. టైం లోపల అందరికీ చెప్పడం కుదరలేదు' పోగొట్టుకున్న దిగులుతో భారంగా చెప్పడం, వాళ్ళు రామకృష్ణ గురించి నాలుగు మంచి మాటలు చెప్పి, తమ సానుభూతిని వ్యక్తం చేయడం – మళ్ళీ తాను మామగారి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోవడం – ఇలానే రెండు గంటలు గడిచిపోయాయి.

ఆయన ఫోన్ ఛార్జింగ్ పెడుతుంటే ఆ ఫోన్ కొన్న ముచ్చట జ్ఞాపకానికొచ్చింది.

ఆయనది తిరిగే కాలు. కూతురి ఇంటికని వైజాగ్, అమ్మవారి దర్శనమని బెజవాడ, ఇంజనీరింగ్ రీ యూనియన్, పెదనాన్న మనవడి పెళ్లి, తన జూనియర్ రిటైర్మెంట్ ఫంక్షన్ – ఏదో వంకతో ఊర్లు తిరిగే మనిషిని ఐదేళ్ళ కిందట జరిగిన బైపాస్ సర్జరీ ఇంటిపట్టునే ఉండేలా చేసింది. ఒక ఏడాది పాటు ఎలాగో నెట్టుకొచ్చినా సహజమైన కలివిడితనం, మనుషులతో మాట్లాడే నైజం ఆయనను అలాగే ఉంచలేకపోయాయి. ఒకరోజు కోడలితో "ఈ ఫోన్లో వాట్సప్ వస్తుందామ్మా" అని తన పాత 2జి ఫోన్ చూపించాడు. అందులో సరిగా రాదని చెప్పి భర్తతో కొత్తఫోన్ తెప్పించింది శారద. వాట్సప్, యూట్యూబ్, ప్లేస్టోర్ గురించి వివరించింది. అంతే.. కొత్త గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం, అప్పటికే ఉన్న గ్రూపులతో కలవడం, కొత్త కొత్తల్లో ఎడతెగని చాట్లు, మెసేజీలు, ఫార్వర్డులు. ఆయన ఇష్టంగా ఫాలో అయ్యే గ్రూపు

– వాళ్ళ ఇంజనీరింగ్ బ్యాచ్ వాళ్ళది. కష్టపడి పదముగ్గురిని పోగుచేసి ఆయనే దాన్ని ఏర్పాటు చేశారు.

మళ్ళీ ఫోన్ల కార్యక్రమాన్ని కొనసాగిద్దామనుకునే లోపల, రఘు నుంచి ఫోన్

"శారదా, చక్రపాణి గారు తెలుసు కదా ... నాన్న బాల్య స్నేహితుడు. నేనాయనకు నాన్నగారు పోయిన విషయం చెప్పడం మర్చిపోయాను. ఇప్పుడాయన ఎందుకో నాకు పదేపదే ఫోన్ చేస్తున్నారు. నేను మీటింగ్‌లో ఉన్నాను. చెప్పినా వినబడదు. ఆయనకు బ్రహ్మచెముడు, తెలుసు కదా, వాళ్ళ మాటలన్నీ వాట్సాప్‌లోనే. ఒకసారి నాన్న ఫోన్ లోనుండి, వాట్సప్ మెసేజి పెట్టి ఆయనకు విషయం చెప్పవా ప్లీజ్ ... జాగ్రత్త, ఆయన బాగా విసిగిస్తాడు. పైగా వీక్ హార్ట్, బై." అంటూ పెట్టేసాడు.

శారద ఆశ్చర్య పోయింది. అదేంటి, చక్రపాణి గారికి మామయ్య పోయిన విషయం చెప్పలేదా?

చక్రపాణి గారు బెంగుళూరులో కూతురి దగ్గరుంటారు. మామయ్యకు ప్రాణస్నేహితులు. అరవయ్యేళ్ళ అరమరికలు లేని స్నేహం వాళ్ళది. ఆయనకి చెప్పకపోవడమేమిటి? వినపడకపోతే, మెసేజి పెట్టొచ్చు కదా, అలా చెప్పకుండా వదిలేస్తారా? రఘుకు, ఆయన చిన్నప్పటినుండి తెలుసు. ఆయనంటే, రఘుకి పెద్ద అభిమానమేమీ లేదని తెలుసు... కానీ ఇలాంటి సందర్భాల్లో అవన్నీ పట్టించుకుంటారా? కుక్కర్ విజిల్స్ శారద ఆలోచనలకు భంగం కలిగించాయి.

వంటింట్లోకి వెళ్ళి స్టవ్ ఆఫ్ చేసింది. నిన్నటి చారు ఫ్రిజ్ నుండి బయటకు తీసి, వేడి చేద్దామని పొయ్యి మీద పెట్టింది. చారు మరుగుతోంది. చక్రపాణి గారి గురించి మామగారు చాలా సందర్భాల్లో చెప్పిన మాటలు గుర్తొచ్చాయి

"అప్పుడప్పుడూ నేను చెబుతుంటానే 'మనం చేసే కొన్ని చిన్న చిన్న పనులు చాలామందికి గొప్ప సంతోషాన్ని కలిగిస్తాయని' ఆ మాట చెప్పింది చక్రపాణే! ఊరికే చెప్పి వదిలేయడం కాదు, దాన్ని ఆచరణలోకూడా పెట్టేవాడు"

"మేమిద్దరం ఎంత ఆత్మీయంగా ఉండేవాళ్ళమంటే మమ్మల్ని ఒక ఆత్మ, రెండు శరీరాలు అనేవారు"

"అదేమి దురదృష్టమో చిన్నప్పటినుండీ ఆప్తుల మరణాలు వాడి వెన్నంటే వున్నట్టు అనిపిస్తుంది. పాపం, చిన్న వయసులోనే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాడు. డెబ్బయ్యేళ్ళ వయసులో భార్యను పోగొట్టుకున్నాడు. కూతురికి పెళ్ళయిన పదేళ్ళకు యాక్సిడెంట్లో అల్లుడు పోవడం తనని బాగా కుంగదీసింది. అప్పటినుండే కూతురితో ఉంటున్నాడు"

"ఉద్యోగరీత్యా ఎక్కడ ఉన్నా, రెండు వారాలకో ఉత్తరమైతే తప్పకుండా రాసేవాడు. అవి కూడా బాగా మాట్లాడుతున్నట్టే రాస్తాడు"

గిన్నెలన్నీ టేబిల్ మీద సర్ది భోజనానికి కూర్చుంది. పక్కన మామగారి కుర్చీ ఖాళీగా కనబడింది. దాదాపు పదహారేళ్ళపాటు కలిసే భోంచేసేవారు. ఆయనకి ఆకలి లేకపోయినా, 'మళ్ళీ నీకు పనెందుకమ్మా.. ఎంతో కొంత తిని బయటపడితే నీకు కాస్త విశ్రాంతి దొరుకుతుంది కదా' అనేవారు.

ఈ ఒంటరితనం తనకు అలవాటు కావడానికి మళ్ళీ ఎంతకాలం పడుతుందో! ఏదో ఇంత తిన్నామనిపించి సామానంతా సర్ది మళ్ళీ హాల్లోకి వచ్చింది శారద.

మిగిలిన స్నేహితులకి ఫోన్లు చేసేముందు చక్రపాణి గారికి చేయాల్సిన వాట్సప్ మెసేజ్ గుర్తొచ్చి వాళ్ళ ఇంజనీరింగ్ గ్రూప్ చాట్ తెరిచింది. చక్రపాణి గారి మెసేజ్ "ఏరా? సమాధానం రాయవేమిటి, మీ వాడి ఫోన్ ఎప్పటిలానే బిజీ?"

ఆసక్తిగా పైన మెసేజ్ చూసింది అదీ, ఆయన నుండే! "రామూ, హాస్పిటల్ వాళ్ళు ఏమన్నారు?" అదొచ్చి ఆరు రోజులైంది.

రామకృష్ణ చనిపోక ముందటి తేదీల్లో మెసేజ్‌లు చదివింది. "నీకు గుర్తుందా రామూ, మన ఐదేళ్ళ ఇంజనీరింగ్ పూర్తయ్యాక అందరికీ సెండాఫ్ ఇచ్చిన తరువాత చివరికి హాస్టల్లో మనిద్దరమే మిగిలాము. అదేమిటో చూడు, జీవితంలో కూడా మళ్ళీ మనిద్దరమే మిగిలాం"

ఆ మెసేజ్ చదివాక శారదకు కళ్ళు చెమ్మగిల్లాయి. ఇదే మాట కొన్నాళ్ల కింద మామయ్య గారు కూడా చెప్పారు.

"ఏం చిత్రమో చూడమ్మా... అంత కష్టపడి వాట్సప్‌లో మా ఇంజనీరింగ్ గ్రూప్ క్రియేట్ చేశామా? ఈ మూడేళ్ళ వ్యవధిలోనే ఒక్కొక్కరుగా పదకొండు మంది నిష్క్రమించారు, గ్రూప్ నుండి కాదు, ఈ లోకం నుంచి! చివరికి మళ్ళీ చక్రి, నేనే మిగిలాము. మా కాలేజీ రోజుల్లో గూడా చివరికి మేమిద్దరమే మిగిలాము. నన్ను కూడా రైలెక్కించి ఆ తరువాత వాడు వెళ్లాడు. అది గుర్తు చేస్తూ వాడు ఏం రాసాడో తెలుసా? 'ఒరేయ్, ఇక్కడ మాత్రం అలా జరిగితే నేనొప్పుకోను, నన్ను పంపాకే నువ్వు వెళ్ళాలి, తెలిసిందా?" అని వార్నింగ్ ఇస్తున్నాడు. మన చేతుల్లో ఏముంటుందమ్మా ?"

మళ్ళీ ఫోన్‌లో మెసేజ్‌లు చూసింది శారద.. ముందు ఆపేసిన మెసేజ్ మళ్ళీ కొనసాగించింది "నా దురదృష్టమేమిటో గానీ, చిన్నప్పటి నుండీ మరణాలు చూసీ చూసీ గుండె నీరు కారిపోయిందిరా. అందుకే మళ్ళీ మళ్ళీ చెబుతున్నా, నన్ను వైకుంఠ రథం ఎక్కించాకే నువ్వు సెలవు తీసుకోవాలి."

శారదకు ఒక్కసారిగా శరీరం కంపించింది. ఫోన్ పట్టుకున్న చేయి సన్నగా వణకడం స్పష్టంగా కనబడుతోంది. వాట్సప్‌లో ఇలాంటి మెసేజిలు చదవడం ఆమెకు కొత్తగా వుంది. అలా పైపైకి స్క్రోల్ చేసి చూసింది. ఎక్కడో ఒకటీ ఆరా ఫోటోలు, వీడియోలు తప్ప మిగతా అంతా పుంఖాను పుంఖాలుగా సంభాషణలు... అన్నీ మాట్లాడుకుంటున్నట్లే .

మామయ్య గారి నుండి చివరి మెసేజి "పాణీ, నిన్నటి నుండీ కొంచెం ఆయాసంగా ఉంటోంది. ఊపిరి పట్టేసినట్టయి, శ్వాస ఆడడం ఇబ్బందిగా ఉంది. శారదకు చెప్పాను. బహుశా రేపు హాస్పిటల్‌కి వెళతాను. వచ్చాక విషయం చెబుతా."

దానికి చక్రపాణి గారు "అవునా, జాగ్రత్త. చలికాలం కదా, అందుకే అయుంటుంది, నీవేమీ కంగారు పడకు. తొందరగా వచ్చేయి, నీ కోసం ఎదురు చూస్తుంటాను"

ఫోన్ చేతిలో పట్టుకుని అలానే కుర్చీలో కూలబడింది శారద. ఆయనకు విషయం తెలియదన్న విషయం తెలుస్తూనే ఉంది. ఇప్పుడేమిటి చేయడం? చక్రపాణి గారికి మామయ్యగారి మరణ వార్త చెప్పేయాలా? ఇంతవరకూ చెప్పకపోవడమే తప్పు. పాపం, ఆయన ఎంత ఆత్రంగా ఎదురుచూస్తున్నారో? పోనీ ఇప్పుడే వాట్సప్‌లో మెసేజ్ పెట్టేస్తే? ఏమని పెట్టాలి? ఆయన రాసిన మాట పదేపదే గుర్తుకు వస్తూంది : "చిన్నప్పటి నుండి మరణాలను చూసి చూసి" .. ఆ అలసిన గుండె మరొక ప్రాణ మిత్రుడి మరణాన్ని తట్టుకోగలదా? ఇది చదివి ఆయన షాక్‌కి గురయితే? అప్పుడప్పుడూ మామయ్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. 'ఈ మధ్య మరీ సున్నితమైపోయాడమ్మా.. అందుకే, మా మిత్రులెవరైనా చనిపోతే వాడికి చెప్పటమే మానేసాను'

శారదకి ఏంచేయాలో పాలుపోలేదు.

పోనీ,వాళ్ళ కూతురికో, మనవరాలికో ఫోన్ చేసి చెబితే? వాళ్ల ఫోన్ నంబర్ తెలీదు. ఆయననే అడిగితే? ఇక్కడ నుండి ఫోనో, మెసేజో వెళ్ళిన మరుక్షణం ఆయన ఆత్రం ఎక్కువౌతుంది. ఎందుకు నంబర్ అని అడుగుతారేమో, అప్పుడేం సమాధానం చెప్పాలి?

మామయ్యగారినే అడిగితే?

అవును.. అని ఒక క్షణం ఆగి తన ఆలోచనకు తనే నవ్వుకుంది. ఏ సమస్యనయినా ఆయనతో చర్చిస్తేనే తనకు మనశ్శాంతిగా ఉండేది.

అవును, ఆయనయితే ఏమని చెప్పుండేవారు? "మనం చేసే చిన్న చిన్న పనులే అవతలి వాళ్ళకు బోలెడంత సంతోషాన్ని కలిగిస్తాయమ్మా" ఈ మాటలు గుర్తొచ్చాక శారద మనసులో ఒక కొత్త ఆలోచన మెదిలింది. అలా చేస్తే?

అమ్మో , చాలా కష్టం.

ఒక రోజా, రెండురోజులా, అలా ఎంత కాలం? ఏమో, చేసి చూద్దాం, ఎంత కాలం నడిస్తే అంతకాలం!

ఒక గంట సేపు తర్జన భర్జన పడింది. దానివల్ల జరిగే లాభనష్టాలను బేరీజు వేసుకుంది. సాధ్యాసాధ్యాలను విశ్లేషించుకుంది. మంచి చెడులను ఆలోచించుకుంది. మామయ్య గారి మాటలను మననం చేసుకుంటూ ఒక అడుగు ముందుకే వేసింది.

మామయ్యగారి ఫోన్ తీసి, వాళ్ళ గ్రూపు చాట్ ఓపెన్ చేసింది.

అక్షరాలు టైప్ చేస్తుంటే, వేళ్ళు వణుకుతున్నాయి. గుండె వేగంగా కొట్టుకుంటూంది. కొంచెం భయం, కొంచెం కుతూహలం, కొంచెం సాహసం, కొంత అపరాధ భావన–

ఏమి రాయాలో కూడబలుక్కుని మెల్లగా "పాణీ , ఎలావున్నావ్? దేవుడి దయతో నేను కులాసాగున్నాను" అని రాసింది.

మెసేజ్ చేరింది. కొద్ది సేపు చూసింది – సమాధానం ఏమైనా వస్తుందేమోనని.

విషయం గుర్తొచ్చినప్పుడెల్లా కొత్త మెసేజ్ వచ్చిందా అని చూడటం, ఏమీ రాకపోవడం .. ఇలా చాలాసార్లు జరిగాక, తన రొటీన్ వ్యవహారాల్లో మునిగిపోయింది.

మరుసటి రోజు మళ్ళీ టీ టైముకు మామ గారి ఫోన్ తీసింది. ఉద్విగ్నతతో గబగబా వాట్సప్ తెరచింది. ఉదయమే చక్రపాణి గారి నుండి మెసేజ్ వచ్చి వుంది. "థాంక్ గాడ్, నేను చెప్పానా, నీకేమీ కాదని. మరి ఇన్ని రోజులెందుకు సమాధానం ఇవ్వలేదు?"

శారదకు చాలా ఉత్సాహంగానూ అదే సమయంలో బెరుకుగానూ వుంది. ఏమని సమాధానం చెప్పాలి? కొంత ఆలోచించి, "చాలా నీరసంగా ఉంటోంది" అని రాసాక, ఇలా రాస్తే అంటీ ముట్టనట్టు ఉందని గమనించి, దానికి "రా" కలిపింది. అలా చేస్తున్నప్పుడు 'పెద్దవారిని అవమానపరుస్తున్నానే' అని ఒకింత నొచ్చుకుంది.

"ఫరవాలేదులేరా, బాగా విశ్రాంతి తీసుకో, మన మాటలకేమిలే, ఎప్పుడైనా చెప్పుకోవచ్చు" ఆయన సమాధానం.

మరుసటి రోజు పదకొండు గంటలకు మళ్ళీ చాటింగ్ మొదలుపెట్టింది. ఈ సారి ఆయన ఆన్లైన్‌లోనే ఉండటం వల్ల వెంటనే సమాధానమిచ్చారు .

'ఏమి టిఫిన్ చేసావు' దగ్గర మొదలు పెట్టి నిన్నటి మధ్యాహ్నం నుండి ఈ రోజు ఉదయం వరకూ తన నిత్యకృత్యాలను వివరంగా వర్ణిస్తూ అలా రాస్తూనే వున్నారు.

ఇలాంటప్పుడు మామగారెలా స్పందిస్తారో, ఎలాంటి ప్రశ్నలు వేస్తారో తెలుసుకోవడానికి ఒక నెల రోజుల ముందటినుండీ వాళ్ళ పోస్టులను గమనిస్తూ పోయింది. తనముందు అంతగా మాట్లాడే మామగారు చక్రపాణి ముందు ఒట్టి శ్రోత మాత్రమే! తన పాలిటికి అదీ ఒకందుకు మంచిదే అయింది. అప్పుడప్పుడూ "అవునా", "అంతేలే మరి", "పాపం" "ఎందుకు", "తప్పదు కదా", "కొన్నిసార్లంతేరా", "మనచేతిలో ఉందా" "సరే" లాంటి పొడిపొడి మాటలు మాత్రమే మామగారు రాసినవాటిలో ఉన్నాయి. శారద, తన పని ఇంకా సులువైంది అనుకుంది. తనూ అదే వొరవడిని కొనసాగిస్తూ చక్రపాణి గారు రాసేమాటలను ఆసక్తిగా గమనిస్తూ పోయింది.

ఒక వారం గడిచేపాటికి శారదకు మామగారు లేని లోటు తీరిపోయింది. తనకి ఏ గ్రూపు ఇవ్వలేని సంతృప్తి, ఏ వీడియోలు పంచలేని ఆనందం చక్రపాణిగారి పోస్టులు అందిస్తున్నాయి. వాళ్ళ పక్కింటి అబ్బాయి అల్లరి నుండి వాళ్ళ మనవరాలి చదువు దాకా, పెరుగుతున్న వస్తువుల ధరలు, తరుగుతున్న నైతిక విలువలు, సినిమాలు, రాజకీయాలు, కూతురి వంట, బెంగళూరు రియల్ ఎస్టేట్ ... ఇలా ఏ విషయం మీదనైనా చదివిన వ్యాసాల్ని, తన అభిప్రాయాలని అలా చెప్పుకుంటూ పోతుంటారు. వేగంగా టైప్ చేయలేక పోయినా ఓపికగా పంచుకుంటుంటారు. టెక్నాలజీ ఈ రకంగా వీళ్లకు ఒక వ్యాపకం కల్పించడం మంచిదే అయ్యింది అనుకున్నది శారద.

మొదటి నెల గడిచింది. శారదకు ఇప్పటివరకూ ఎలాంటి ఇబ్బందీ రాలేదు. పైపెచ్చు మరింత ఆసక్తి పెరిగింది. చక్రపాణి గారి మాటలు ఒక్కోసారి సరదాగా, మరోసారి తాత్త్వికంగా, అప్పుడప్పుడూ అల్లరిగా ఉంటాయి. ఆయన రాసిన మాటలు అలా గుర్తుండిపోతాయి. "పరవళ్ళు తొక్కుతూ వచ్చిన కృష్ణమ్మ ప్రవాహాన్ని శ్రీశైలం డ్యాం కట్టి ఆపేసినవాళ్ళం, ఈరోజు మన ఒంట్లోని యూరినల్స్‌ని ఆపుకోలేక పోవడం ఎంత విషాదమో కదా?" మరోసారి తన కూతురి గురించి, "కూతురి దగ్గరకు వచ్చిన కొత్తల్లో నేనేదో మగదిక్కుగా ఉంటానని అనుకునేవాణ్ణి. ఇప్పుడు చూస్తే అన్ని దిక్కులూ నాకు ఆమే!" "ఎక్కాలు కనిపెట్టకముందు మనుషులు హెచ్చవేతలు ఎలా చేసివుంటారో ఊహించుకో ఒకసారి", "మన జీవిత కాలంలో మనం చూసినన్ని ఆవిష్కరణలు, దర్శించినంత వైవిధ్యం, నాకు తెలిసి మానవ చరిత్రలోనే ఎవరూ చూసిందరని నా నమ్మకం" ఇలాంటివి మచ్చుకు కొన్ని.

మరో మూడునెలలు అనుమానం లేకుండా నెట్టుకొచ్చిన శారదకు అనుకోకుండా కుదిరిన కొడుకు పెళ్ళి కొంత అడ్డొచ్చింది. ఎందుకైనా మంచిదని చాలా ముందుగానే 'మనవడికి పెళ్ళి కుదిరింద'ని మెసేజ్ పెట్టింది. తనకి పెళ్ళి పనుల వత్తిళ్లలో చక్రపాణి గారితో చాటింగ్ కుదరదని గ్రహించి, 'ఫోన్లో ఏదో సమస్య వుందని, ఇంట్లో అందరూ పెళ్ళి హడావిడిలో ఉన్నందున ఎవరినీ ఇబ్బంది పెట్టదలచుకోవట్లేదని, ఫోన్ బాగయ్యాక మళ్ళీ మెసేజీలు పెడతాన'ని రాసింది.

పెళ్ళయిపోయింది. పెళ్ళయిన మూడోరోజే శివరాత్రి పండగ రావడం, పండగకి అందరూ వియ్యంకుల ఇంటికి వెళ్ళాల్సిరావడం, వచ్చాక కొత్త దంపతుల ముంబై ప్రయాణం... అన్నీ ముగియడానికి రెండు వారాలు పట్టింది.

మళ్ళీ తన పూర్వస్థితికి వచ్చింది శారద. చాలా రోజుల తరువాత మళ్ళీ చక్రపాణి గారు గుర్తొచ్చారు. గబగబా మామగారి ఫోన్ తీసి ఇంజనీరింగ్ మిత్రుల చాట్ చూసింది. దాదాపు ఇరవై రోజుల కిందట– ఒకట్రెండు పలకరింపులు మాత్రమే కనబడుతున్నాయి. పాపం, సమాధానమేదీ రాకపోవడంవల్ల కావచ్చు. తరువాత కొనసాగించలేదు. జాలి కలిగింది శారదకు. చిన్న పిల్లాడిలా తోచారు చక్రపాణి గారు.

చాలా అభిమానంగా "ఏరా చక్రి... ఎలా వున్నావు? పెళ్ళిసందడిలో పూర్తిగా అలిసిపోయాను. చాలా రోజులైంది. ఏంటి సంగతులు?"

వెంటనే సమాధానం రాలేదు.

సాయంత్రమవుతుండగా "వెల్కమ్ బ్యాక్" అంటూ మెసేజి కనబడింది.

ఉత్సాహంగా మామగారు రాసినట్టుగానే కొన్ని పెళ్ళి విశేషాలు పంచుకుంది. అటునుంచి చక్రపాణి గారు "కొన్ని పెళ్లి ఫోటోలు పెట్టు" అని మెసేజి పెట్టారు

వెంటనే శారద దానికేం భాగ్యం అనుకుంటూ, "తప్పకుండా" అని తన ఫోన్లో ఫొటోల కోసం వెతుకుతుంటే హఠాత్తుగా గుర్తొచ్చింది – 'ఇప్పుడు తాను పెట్టబోయే ఫొటోల్లో మామయ్య గారు ఉండరు కదా, మరి చక్రపాణి గారు అడిగితే? అరెరే, ఎంత పనయిపోయింది? పెద్ద చిక్కులో పడినట్టు అర్థమయింది శారదకి. ఏమి ఆలోచించాలనుకున్నా తనకి కొంత సమయం కావాలి, అందుకే , "నా ఫోన్లో లేవురా, రేపు ఉదయమే మా కోడలితో పెట్టిస్తా" అని సమాధానమిచ్చింది.

ఎంత ఆలోచించినా పరిష్కారం దొరకడం లేదు. కొత్త దంపతులతో తమ కుటుంబంలో వెనకగా కేవలం మామగారి మొహం కనిపించేలా ఎడిటింగ్ చేయిస్తే? శారదకు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. కానీ చేసేవాళ్ళెవరు? కొడుకుకి ఫోన్ చేసింది. "అభీ, ఫొటోలో తాతయ్య లేకపోతే వెలితిగా ఉందిరా,

అదేదో ఫొటో ఎడిటింగ్ అని చేస్తారట గదా, నీకు తెలిస్తే, తాతయ్య ఫొటోని మన ఫ్యామిలీ ఫొటోలో ఇరికించెయ్యగూడదూ, మంచిగా ఫ్రేమ్ కూడా కట్టించుకోవచ్చు" అన్నది. కొడుకు టైం లేదని వాయిదా వేయబోతే, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి రాత్రికల్లా పూర్తిచేసి వాట్సప్ చేసేలా ఒప్పించింది.

మరుసటి రోజు ఫొటో పోస్ట్ చేసి సమాధానం కోసం ఎదురు చూడసాగింది. రాత్రికి ఒక సమాధానం వచ్చింది. "మంచి ఫ్యామిలీ ఫొటో. కొత్త జంట బాగున్నారు. నువ్వు గూడా ఆరోగ్యంగా కనబడుతున్నావు!"

గతుక్కుమన్నది శారద. ఎక్కడా దొరకకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఇదిగో, ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. హడావుడిలో అభిరాం, మామయ్య ఇటీవలి ఫోటో బదులు పాత ఫోటో పెట్టిన విషయం తను గమనించలేదు.

బొటనవేలు పైకెత్తిన ఎమోజీ పెట్టి ఆ ప్రస్తావన ముగించింది.

మళ్ళీ ఒక నెల యధావిధిగా కొనసాగింది. ఈ విడతలో చక్రపాణి గారి మాటల్లో వైరాగ్యం ఎక్కువ కనబడుతోంది. ఆయన జ్ఞాపకాలను తవ్వడం బాగా తగ్గింది. సూక్తులు, సుభాషితాలు ఎక్కువయ్యాయి.. నీ ఆరోగ్యం జాగ్రత్త, ఇంటి పట్టునే ఉండు, వేళకి మందులు వాడు అని మామగారి తరఫున రాస్తూనే అతని పట్ల తన అభిమానాన్ని చాటుకుంటోంది శారద. చక్రపాణి గారంటే ఎందుకో ఆమెకు అమితమైన వాత్సల్యం ఏర్పడింది. ఒక్కరోజు మాట్లాడక పోయినా ఆమె వెలితిగా ఫీలవుతోంది.

ఒకరోజు యధాలాపంగా చక్రపాణి గారి పోస్ట్ కోసం కళ్ళు వెదికాయి. ఉదయాన్నే పెట్టినట్టున్నారు. ఆ మెసేజ్ చదివిన వెంటనే కన్నీళ్లతో చూపు మసకబారింది శారదకి. సరిగానే చూసానా? మళ్ళీ చూసింది.

"రామూ, నిన్నరాత్రి నిద్రలోనే పక్షవాతం సోకి, ఎడమ భాగం పూర్తిగా పెరాలైజ్ అయిపోయింది. కొన్నాళ్ళు మంచానికే పరిమితం కావలసి వస్తుందని డాక్టరు చెప్పారు. వీలైనంతవరకూ కుడి చేత్తో మ్యానేజ్ చేసుకుంటున్నాను, ఈ ఫోన్ సహా!"

శారద ప్రాణం విలవిలలాడింది. అయ్యో, పాపం, ఎలా ఉన్నారో? ఏంటి, ఆయనకే ఈ కష్టాలు? అని నిట్టూర్చింది.

"దిగులు పడకు చక్రీ, త్వరగా నయమైపోతుందిలే, మళ్ళీ మనం జోరుగా ముచ్చట్లు చెప్పుకునే రోజొస్తుంది" అని రాసింది గాని, ఆమె మనసు దిగులుతో నిండిపోయింది.

చక్రపాణి గారి నుంచి మెసేజీలు బాగా తగ్గిపోయాయి. పక్షవాతం ప్రభావమేమో ఉదయమో, సాయంత్రమో అడపా దడపా ఒకటి ఆరా మెసేజిలు, అందునా ఎక్కువగా కొటేషన్లే ఉండేవి. తానేమైనా రాసినా ఎమోజీలే సమాధానాలు.

పది రోజులు అలానే గడచిపోయాయి. పాపం, చక్రపాణి గారు ఎలా వున్నారో, ఎలా కాలక్షేపమౌతోందో, ఒక్కరే మౌనంగా ఏమి ఆలోచిస్తుంటారో అని దిగులు చేసింది శారద. చక్రపాణి గారిని ఒకసారి కలిసొస్తే బాగుంటుందనిపించింది. చిన్న చిన్న పనులే గొప్ప సంతోషాలను కలిగిస్తాయి అని చెప్పిన వ్యక్తికీ అలాంటి సంతోషాన్ని మనమే కలిగిస్తే? అదే సమయానికి అనుకోకుండా రఘు కజిన్ కొడుకు పెళ్లి గుర్తొచ్చింది, అదీ బెంగుళూరులోనే. పెళ్ళికి వెళ్లినట్టు వెళ్లి, ఆ నెపంతో చక్రపాణి గారిని చూసి పలకరించి రావడం ఎంత బావుంటుంది. ఆలోచన వచ్చినదే తడవుగా 'ఆ.. ఏం వెళతాంలే, అనుకుని పక్కనేసిన పెళ్ళికార్డు వెతికి, రఘుతో చర్చించి, అతనికి కుదరదని చెబితే, తనొక్కర్తికే, తత్కాల్‌లో టికెట్ బుక్ చేయించుకుని బెంగుళూరు ప్రయాణమైంది శారద.

పెళ్లి చూసుకుని భోజనాలు ముగించుకుని చక్రపాణిగారి దగ్గరికి మధ్యాహ్నం వెళదామని నిర్ణయించుకుంది.

ఉదయమే, "మా బంధువుల పెళ్ళికి శారద బెంగళూరు వెళ్ళింది. పెళ్లి మధ్యాహ్నంకల్లా అయిపోతుంది, తన తిరుగు ప్రయాణం రాత్రికే. అందుకే సాయంకాలం నిన్ను కలిసి రమ్మని చెప్పాను. నేను శారద నెంబర్ పంపుతాను మీ అమ్మాయికివ్వు– శారద, ఆమె మాట్లాడుకుంటారు అని మామగారు రాసినట్టు రాసింది. ఉదయాన్నే చక్రపాణిగారి మనవరాలు ఫోన్ చేసింది. "ఆంటీ, నేను మనస్విని, చక్రపాణి గారి మనవరాలిని మాట్లాడుతున్నాను. మీరు ఇంటికి వస్తామని చెప్పారట గదా.. మీ వాట్సాప్‌కి లోకేషన్ షేర్ చేసాను. ఏ టైంకి వస్తారో చెబితే నేను ఇంట్లో వుంటాను, మమ్మీ రాత్రికి గానీ రారు" అని చెప్పి జయనగర్ లోని ఇంటి వివరాలు పంపింది.

సాయంత్రం నాలుగు గంటలకి టాక్సీ మాట్లాడుకుని, చక్రపాణిగారి ఇంటికి వెళ్ళింది శారద. కాలింగ్ బెల్లుకి సమాధానంగా మనస్విని తలుపు తెరచి ఇంట్లోకి తీసుకుని వెళ్ళింది. ఆయనకిష్టమని నేరేడు పళ్ళు, పుల్లారెడ్డి స్వీట్లు పట్టుకొచ్చింది శారద. నీళ్లు తేవడానికి ఆ అమ్మాయిలోనికి వెళ్ళగానే, శారద కళ్ళు చక్రపాణిగారి కోసం వెదికాయి.

తన మనసులో చాలారోజుల నుండి ఒక అపరాధ భావన. మంచి కారణం కోసమే కదా అని ఎంత సమర్ధించుకున్నా లోపల్లోపల ఇది మోసం కదా అనే ప్రశ్న వేధిస్తూనే వుంది. అందుకే మాటల మధ్యలో ఏదైనా సందర్భాన్ని కలుగజేసుకుని 'మామయ్యకు ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. చాలా సార్లు మీరు

చదివే మెసేజిలు నేనే టైప్ చేసి పెడుతుంటాను' అని చెప్పి అశ్వత్థామ హతః కుంజరః అన్న చందంగా మనసుని ప్రక్షాళన చేసుకుని మెల్లగా ఎప్పుడైనా అసలు విషయం చెప్పవచ్చు అనుకుంది.

మనస్విని బెంగుళూరు యూనివర్సిటీలో సైకాలజీలో రీసెర్చ్ చేస్తున్నదని చెప్పింది. తాత గారితో చిన్నప్పటినుండి తన అనుభవాలను పంచుకుంది. తాత గారు తన మెంటరని గర్వంగా చెప్పుకుంది. ఒక పావుగంట మాట్లాడిన తరువాత శారద పైకిలేచి, "మనస్విని, తాతగారిని చూద్దామా", అని ఇంటి లోపలివైపుకి ఒక అడుగు ముందుకేసింది.

మనస్విని, శారద దారికి అడ్డు నిలుస్తూ "ఆంటీ , తాతయ్య లేరు" అన్నది.

శారద భృకుటి ముడిపడింది. నిరుత్సాహం, చిరుకోపంగా మారుతుండగా "అదేంటి, నేను వస్తానని ముందే చెప్పాను కదా" అన్నది.

ఆ అమ్మాయి ఏమీ బదులీయకుండా, తన్నుకొస్తున్న దు:ఖాన్ని ఆపుకున్నట్టు– రుద్రమైన కంఠంతో–

"తాతగారు మమ్మల్ని వదలి శాశ్వతంగా వెళ్లిపోయారు ఆంటీ" అని ముఖం చేతులతో కప్పుకుని బావురుమంది.

శారద అవాక్కయింది. నిల్చున్నచోటనే కూలబడుతున్నట్టు అనిపించింది. "ఎప్, ఎప్పుడు, ఎప్పుడు జరిగింది?" తడబడుతూ అడిగింది.

"శివరాత్రి ముందు రోజు ఆంటీ" సమాధానం చెప్పి, సంజాయిషీ ఇస్తున్నట్టుగా "హాస్పిటల్‌లో తన చివరిరోజు నన్ను పిలిచి, రామకృష్ణ వాళ్ళ మనవడి పెళ్లి జరుగుతోంది.. ఒకవేళ నేను పోతే, ఆ కబురు వాడికి చెప్పకు, తట్టుకోలేడు. నిదానంగా ఎప్పుడన్నా చెప్పండి." అన్నారు.


"ఇప్పుడవన్నీ ఎందుకు తాతయ్యా, మీకేం కాదు అని ధైర్యం చెబుతుంటే, నవ్వుతూ నా తల దువ్వారు. ఆ తరువాత అరగంటకే ప్రాణం వదిలారు. ఆ తరువాత తీరికగా విషయం చెబుదామనుకుంటే, రామకృష్ణ తాతగారు వాట్సాప్‌లో మెసేజి పెట్టారు. నాకేం చేయాలో తోచక, తాతయ్యకు ఇచ్చిన మాట కోసం, కొన్నాళ్ళు ఆయన పేరు మీద నేనే మెసేజిలు పెట్టడం, చాట్ చేయడం మొదలు పెట్టానంటీ. అలా చేయడం తప్పే, కానీ తప్పలేదు ఆంటీ – అయితే రామకృష్ణ తాతగారి ఉత్సాహం, సంతోషం చూసి పొడిగించానాంటీ, ఎందుకంటే, తాతగారు పదేపదే చెప్పేవారు.. మనం చేసే చిన్న చిన్న పనులే అవతలవాళ్ళకు గొప్ప ఆనందాన్ని కలిగిస్తాయి అని. అందుకే, రామకృష్ణ గారి కోసం దాన్ని కొనసాగించాను."

ఆ అమ్మాయి వెక్కి వెక్కి ఏడుస్తూ చెబుతోంది. తనకు తెలీకుండానే, శారద కళ్ళవెంట నీరు ధారగా కారిపోతున్నాయి, మనసు మౌనంగా రోదిస్తోంది. అచేతనంగా దిక్కులుడిగి శూన్యంలోకి చూస్తూ కొన్ని నిముషాలు గడిపింది

గత నెలరోజుల నుండీ జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటే కళ్ళముందు మెదులుతూ వాటి తాలూకు సందేహాలకు సమాధానాలు దొరుకుతున్నాయి. సుదీర్ఘమైన వాక్ప్రవాహం ఎందుకాగిపోయిందో, ఎమోజీలు, ఫొటోలు, కొటేషన్లు ఎందుకొచ్చాయో, అన్నీ బోధపడి, ఆ పసిమనసు గుండెలో, ఒక ముసలాయన మీదున్న అభిమానానికి, ఇంకో ముసలి ప్రాణం మీదున్న శ్రద్ధకు చేయెత్తి మొక్కాలనిపించింది. ఐతే, అవన్నీ తనకెలా తెలుసు అని ఆ పిల్ల అడిగితే? అందుకే ఏమీ మాట్లాడకుండా, మౌనంగా ఆ పిల్లని దగ్గరకు తీసుకుని అక్కున చేర్చుకున్నది. కొన్ని నిముషాల ముందు వరకూ అపరిచితురాలైన ఆ పిల్ల తనకి ఎంతో కాలం నుండీ ఆత్మీయురాలైనట్టు తోచింది.

మరికొంత సేపు ఆ అమ్మాయితో గడిపి, తన ఫోన్ నెంబర్ తీసుకుని బయలుదేరుతుంటే, మనస్విని "ఇప్పుడు నా మనసు ప్రశాంతంగా వుందాంటీ. మీరే టైము చూసుకుని రామకృష్ణ తాతయ్యకి చెప్పాలి ఈ విషయం" అన్నది అభిమానపూర్వక చిరునవ్వుతో.


"ఆయనను కలిశాక చెప్తాను, సరేనా" అంటూ ఎవరికీ తెలియని మహా రహస్యాన్ని తనలోనే దాచుకుని టాక్సీ ఎక్కింది శారద. ■



**నియంతల మీదా, నిరుద్యోగమ్మీదా, లాకౌట్ల మీదా, యుద్ధాల మీదా గొంతెత్తేందుకు కళాకారులకు హక్కు లేదనడం మూర్ఖత్వం. అణగదొక్కాలనుకునేవారే ఇలాంటి తలతిక్కవాదం చేస్తారు.**

**ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు. జీవితంలోని కష్టాల్ని తీర్చలేనిది ఆవిష్కరణా కాదు. జీవితంలోని ప్రతి కోణాన్ని చూపించలేనిది సాహిత్యమే కాదు.**

**– కొడవటిగంటి కుటుంబరావు**




# మహా'ముద్రణ'ప్రస్థానం

- తెలకపల్లి రవి

**"ఈ మధ్యనే 'మహాప్రస్థానం' గీతాల్ని అచ్చువేయటానికి నా టరమ్ము ఏమిటని కొందరడగవస్తే ఇలాగే అన్నాను : 'నాకొక్క దమ్మిడీ కూడా ఇవ్వనక్కరలేదు. నేను కోరిన విధంగా అచ్చు వేయదానికి ఎన్ని వందల రూపాయలు నష్టపోవడానికి సిద్ధపడుతున్నారు?' అని. ఒకమారు వేళాకోళానికి 'నా దగ్గర డబ్బుంటే ఈ గీతాలను నిలువుటద్దం సైజులో అచ్చు వేయిస్తానన్నాను. ఈ యుద్ధపు రోజుల్లో అది అందరికీ కీల్పాకు వూహ అనిపించింది. సరే. ఎందుకు, అప్పుడూ ఇప్పుడూ కూడా నాకీ ఊహ ఆచరణ సాధ్యంగానే కనబడుతోంది."**

**- కన్యాశుల్కం చిత్ర సన్నాహక దశలో రాసిన వ్యాసంలో శ్రీశ్రీ.**

**శ్రీశ్రీ**ని, ఆయన ప్రజాసాహిత్య మహత్తర వారసత్వాన్ని స్మరించుకోవడానికి, అనుసరించడానికి జరిగే ఏ ప్రయత్నమైనా రెండు చేతులా ఆహ్వానించవలసిందే. శ్రీశ్రీ కన్నుమూశాక ఆయన పేరిట ఒక ముద్రణాలయం ఏర్పాటు చేసిన వీరాభిమాని విశ్వేశ్వరరావు. ఆవిధంగా శ్రీశ్రీ విశ్వేశ్వర రావయ్యాడు. ఇప్పుడు మహాప్రస్థానం మహా ముద్రణ తీసుకొచ్చి ఆ పేరు సార్ధకం చేసుకున్నాడు. శ్రీశ్రీ మొదటా, తర్వాత కీలక బాధ్యతలు నిర్వహించిన సంస్థలున్నా తమ తమ కారణాల చేత అవి ఆయనపై వర్ధంతి, జయంతి సభల వంటివి జరిపేవి కావు. నూతన సహస్రాబ్ది ముంగిట్లో సాహితీ స్రవంతి ఏర్పడుతున్నప్పుడే శ్రీశ్రీ వర్ధంతిని ఉమ్మడి రాష్ట్రవ్యాపితంగా క్రమబద్ధగా జరిపే కార్యక్రమం చేపట్టింది. దానికన్నా ముందే 'మహాకవికి మిగిలింది పావు శతాబ్దమేనా' అని కొందరు ప్రశ్నిస్తున్నప్పుడే– ఈ వ్యాస రచయిత 'శ్రీశ్రీ సాహిత్యం – సమకాలీనత' పేరిట నాలుగు వ్యాసాలు రాసి పుస్తకం తీసుకొచ్చాడు. తర్వాత దాన్ని మరింత విస్తరించి ప్రచురించాడు. 2009లో శ్రీశ్రీ శతజయంతి తెలుగునాట ఘనంగా జరిగింది. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణగా రాసిన 'శ్రీశ్రీ జయభేరి' ఇప్పటికి మూడు ముద్రణలు పూర్తి చేసుకుని నాలుగో పాదం కోసం ఎదురుచూస్తోంది. విజయవాడలో అప్పటి ప్రజాశక్తి పాత కార్యాలయానికి శ్రీశ్రీ భవన్‌గా నామకరణమూ జరిగింది. విజయవాడలో సింగంపల్లి అశోక్‌కుమార్ శ్రీశ్రీ రచనలను, ఆయనపై వచ్చిన రచనలను వంద పుస్తకాలుగా ప్రచురించి ఇప్పుడు రెండో వంద ప్రారంభించారు. డా.టిఎల్ కాంతారావు ఇంతకన్నా ముందే శ్రీశ్రీ రచనలపై పరితపిస్తూ రాసేవారు. ఇప్పుడు కొన్ని చోట్ల శ్రీశ్రీ నగర్‌లూ, సంస్థలూ ఉన్నాయి. వాస్తవానికి 2019లో శ్రీశ్రీ 110వ జయంతి జరిపి ఉండాలి. కరోనా అందుకు ఆటంకమైంది. అయినా సరే ఆయన జన్మస్థలం విశాఖపట్టణంలో సాహితీ స్రవంతి కాస్త ఆలస్యంగానైనా ఆ సభ జరిపింది. విశాఖ ఉక్కు రక్షణ కోసం జరిగే పోరాటానికి పనికివచ్చే ముక్కలు ఆనాడే శ్రీశ్రీ ఎలా రాశాడో వినిపిస్తే... అందరూ ఆశ్చర్యపోయారు.

ఈ పూర్వరంగంలోనే ఇప్పుడు విశ్వేశ్వరరావు సాహితీ మిత్రులు ఎవరూ ఊహించని విధంగానూ, తలపెట్టని రీతిలోనూ మహాప్రస్థానం బృహత్ ప్రచురణ తీసుకొచ్చారు. దీనికి స్మరణిక అని నామకరణం చేశారు. లండన్‌లో 1980లో ప్రచురించిన శ్రీశ్రీ చేతిరాత ప్రతిలోని అక్షరాలనే ఫాంట్‌గా వాడారు. ప్రస్థానం చిత్ర మిత్రుడు గిరిధర్ లేఔట్‌కూ, మేకప్ కూడా చాలా ప్రాధాన్యతనిచ్చారు. కాఫీటేబుల్ బుక్ అంటున్నారు గాని అవన్నీ ఇంత పెద్ద పరిణామంలో ఉండవు. చదవడానికి గాక చూసుకోవడానికి, ఆకర్షణకు బల్లమీద పెట్టుకుంటారనే

అర్థంలోనూ కాఫీ టేబుల్ బుక్ అనే మాట వాడుతుంటారు. వాటిలో ఫొటోలు అధికంగా ఉంటాయి. రెఫరెన్సు సమాచారం ఉంటుంది. ఈ విధంగా ఒక చరిత్రలో భాగమైన ఒక మహాకావ్యాన్ని ఇంత పెద్దదిగా రంగుల్లో హంగులతో తీసుకురావడం చాలా చాలా అరుదుగా మాత్రమే జరిగి వుంటుంది. అసలు జరిగిందో లేదో అన్నది కూడా మరో పరిశోధనాంశం అవుతుంది. సామాన్య పాఠకుల నుంచి కవి పండితులు, సెలబ్రిటీల వరకూ ఈ పుస్తకంతో ఫొటో సోషల్ మీడియాలో పెట్టడం రివాజుగా మారింది. విజయవాడలో ప్రచురణ విడుదల జరిగినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పట్టణాలన్నిటికీ ఈ మహాప్రచురణ ప్రస్థానం సాగిస్తున్నది. ఇంతటి ప్రయత్నం గనకనే విశ్వేశ్వరరావు అభినందనీయుడు. పలువురు సాహితీ మిత్రులు ప్రచురణలో, రూపకల్పనలో, విషయ సేకరణలో సహకరించారు కూడా.

ఈ సందర్భాన్ని అభినందిస్తూనే మనం ఇంకా మోస్తున్న విగ్రహంగా శ్రీశ్రీని అభివర్ణించాడో మిత్రుడు. మొదటే చెప్పుకున్న కోణంలో నిజమే అనిపించినా వాస్తవంలో మనం మోస్తున్నది విగ్రహాన్ని కాదు; ఆ విప్లవ భావజాలాన్ని, విలువలను విశ్వాసాలను, వాటిని శక్తివంతంగా వినిపించిన కవిత్వాన్ని. 'మరో ప్రపంచ నిర్మాణానికి సాగిపోయే యువవీరులకు మార్చింగ్ బ్యాండ్' అని శ్రీశ్రీ కవిత్వం గురించి యోగ్యతా పత్రంలో చలం చేసిన వర్ణన ఇప్పటికీ సత్యం గనకే ఈ పుస్తక రూపంలో ఇది పున:ప్రస్థానం. వాస్తవానికి సోవియట్ విచ్ఛిన్నానంతరం ఆరుద్ర పున:ప్రస్థానం అని అమెరికా నుంచి కవితే రాసి పంపించారు.

ఈ విశేష స్మరణికలో శ్రీశ్రీ కవితల్లో పదాల పేర్ల పాద పీఠికలు, వివరణలు జతచేశారు. సంబంధిత ఫొటోలు డిజైన్లు జోడించారు. దాంతోపాటే ఈ ప్రచురణకు సహకరించిన విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యుల ఫొటోలు, కొన్ని ఇతర సభల చిత్రాలు ఇచ్చారు. (ఈ ఫొటోలు వేసుకోవడంపై కొందరు ఆక్షేపణ తెలిపారు గాని అది వారి అభిమానానికి సూచికగా తీసుకోవడం సముచితం. అదేమీ మహాపరాధంగా చూడ నవసరం లేదు) నాటి కాంగ్రెస్ సర్కార్ ఘోరకలికి చెరగని సాక్ష్యమైన కాటూరు ఎలమర్రు ఫొటోలు ఇవ్వడం సరైందే. అయితే అరసం దశలో శ్రీశ్రీ ఫొటో ఒక్కటైనా లేకపోవడం చారిత్రిక లోపం. శ్రీశ్రీ ఫాదర్ గాడ్ అని చెప్పుకున్న ఆయన తండ్రి వెంకట రమణయ్య; తొలి గురువులు, అభ్యుదయ దృక్పథానికి అంకురార్పణ చేసిన అబ్బూరి, రోణంకి, పురిపండా వంటి వారి ఫొటోలు జతచేస్తే సముచితంగా ఉండేది. తెలుగు నాట తొలి కమ్యూనిస్టు సభలూ, జయభేరి తదితర మహాప్రస్థాన గేయాల రచనా ఒక ఏడాదిలోనే జరగడం గొప్ప చారిత్రిక సంకేతం. పెద్దగా ప్రచారంలో లేని అలాటి అనేక సత్యాలు తర్వాత ఆవిష్కృతమయ్యాయి. 1955 మహా సంగ్రామంలో కమ్యూనిస్టులతో నిస్సంకోచంగా నిలిచిన శ్రీశ్రీ... సుందరయ్యతో ఉన్న ఫొటోనైనా జోడిస్తే న్యాయంగా ఉండేది. శ్రీశ్రీ గురించి కొందరు విమర్శకులు, వ్యాఖ్యాతలు అన్న మాటలు చేర్చారు. కాని తొలినాటి సహచరులు, కెవిఆర్ వంటి ప్రామాణిక విమర్శకుల కోట్స్ జత చేయాల్సింది. ఇవన్నీ యాదృచ్ఛికంగా జరిగాయా, ఏదైనా కారణముందా చెప్పడం కష్టం. ఏమైనా ఈ విభిన్న, వినూత్న ప్రయోగాన్ని అభినందించటం తప్ప కొరతలు వెతికే పని పెట్టుకోవడం లేదు.

శ్రీశ్రీ ఆధునికత కవిత్వమేగాక చిత్రకళలో, చలనచిత్ర కళలో కూడా విశేషమైన ఆసక్తి కనపరచేవారు. ముద్రణా పరంగానూ ఆయనకు అమితాసక్తి. ఈ పరిచయం మొదట్లో పొందుపర్చిన ఆయన మాటలే అందుకు నిదర్శనం. గతంలో లండన్‌లో గూటాల కృష్ణమూర్తి ఆయన చేతిరాతతో ఫొటో కాపీ పద్ధతిలో క్యాసెట్ కూడా జతచేసి తీసుకొచ్చిన ముద్రణ అప్పటికి అపూర్వమైంది. విశ్వేశ్వరరావు తెచ్చిన ఈ విశేష స్మరణిక ఇప్పటివరకూ మరెవరికీ దక్కని గొప్ప ప్రత్యేకత. చాలా పెద్దగా ఉందనో, అందంగా ఉందనో మాత్రమే గాక తరతరాల పాఠకులను, అందులోనూ చైతన్యవంతులైన పాఠకులను, సాహిత్యకారులను ఉత్తేజపరుస్తూనే వున్న మహాకవి మహోన్నత వారసత్వానికి ప్రతీకగా దీన్ని పరిగణించడం వాస్తవికత అవుతుంది. ఇలాటి విభిన్న ప్రయోగాలకు రాబోయే కాలంలో ఆస్కారం ఉంటుంది. సాహితీ స్రవంతి అందుకు తగు రీతిలో చొరవ తీసుకుంటుంది. శ్రీశ్రీ కవిత్వాన్ని మరింతగా జనంలోకి తీసుకువెళ్లడం, అత్యధికులకు అందుబాటులోకి తేవడం ప్రజాకవులకు మార్గదర్శకమవుతుంది. అభ్యుదయ ప్రజాసాహిత్యానికి సంబంధించిన అనర్ఘ రత్నాలు ఇప్పటికీ కొన్ని అందుబాటులో లేవు. పాత కాలం గ్రంథాలయాల్లో చూస్తుంటే ఎన్నో దొరుకుతాయి. ఆనాటి గొప్పనేతలు, ప్రజాకవులు, రచయితల ఉత్తరాలు డైరీలు చిత్రాలు కూడా వుంటాయి. వాటి సేకరణ, డిజిటైజేషన్ ఒక ఉద్యమంగా చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

■

కవిత

## ఇప్పుడు నిశ్శబ్దం కాదు..!

- డా. కటుకోర్ఘ్వుల రమేష్
99490 83327



**త**ల తెగినప్పటికీ
కొన్ని దేహాలు ప్రయాణం చేస్తూనే వుంటాయి
జిర్ర పురుగులా..

మెదళ్లు లేని తలకాయలు
తల లేని దేహాలు
వున్నా లేకున్నా ఒక్కటే!
తలలుంటేనే కదా.. ఎటుపోతున్నామో
ఎవ్వరి పంచన చేరుతున్నామో
ఏది మంచో ఏది చెడో తెలిసొచ్చేది

దారి తప్పుతున్న భౌతిక పరంపరలు
సమూహమై అలుముకునే సందర్భాలు
ఒకానొక అసంబద్ధ విషపు కాలంలో
ఒక్కొక్కటిగా పోగుపడుతుంటాయి

బతుకు భద్రత నుంచి
అమాంతం నెట్టివేయబడ్డ దేహం
ఒడ్డున పడ్డ చేపపిల్ల మాదిరిగా
గిలగిలా కొట్టుకోవటం
అసంకల్పితంగా జరిగిపోద్ది

పురుగు పడ్డ జామపండులా
మన తియ్యదనాలను
అదృశ్య రూపాలేవో
లోలోపల కొల్లగొడుతూనే వుంటాయి
కడుపు చించుకుంటే
కాళ్ల మీద పడుతుందేమోననీ
ఆలోచించే వ్యవధిలోనే
అలుముకున్న డొల్లతనమంతా
ప్రపంచం ముందు దృశ్యమానమైపోతుంది

ద్వారాలు మూసుకున్న
చీకటి గదుల్లో దాక్కుంటే
నీ దేహంలో పుట్టిన రాచపుండు
సలపటం ఆపదు
కొన్ని గాయాలకు లేపనాలుండవు
కాలమే కరిగి వెన్నపూసై చల్లబరుస్తుంది
కొన్ని తేల్చుకోవాలన్నా విదిల్చుకోవాలన్నా
వెలుగు రెక్కల్ని విప్పుకోవాలి
సమర స్వరాల్ని కప్పుకోవాలి

మింగుడు పడని ఓ చిన్నమాట
శరమై మనసును తొలిచేస్తుంది
మంచంకోడుకు చిటికెన వేలుతగిలినా
ప్రాణం విలవిల్లాడిపోతుంది
సన్నివేశాలు.. సందార్భాలు ఏవైనా
కొన్ని నిట్టూర్పులను తూకం వేయలేం
అనివార్యంగానో అక్రమంగానో తగిలిన గాయం
చిన్నదా.. పెద్దదా.. అనేది
ఇప్పుడు ప్రశ్న కాదు
నాలుగు దార్లు పరుచుకున్న
ఏ కూడలీ
ఇప్పుడు.. నిశ్శబ్దం కాదు..!

■

# నీలాంజన వజ్రం

- అడిగోపుల వెంకటరత్నం
98482 52946




మంచి కవిత్వానిది
ఒక పార్శ్వంకాదు
ముందు వెనక
కుడి ఎడమ
వివిధ కోణాలు
వజ్రంలా ఎటుచూసినా
రంగులే
రంగుల అనుశాసనలే –

నడుస్తూ కవిత్వం చదివితే
చుట్టూ చెట్లపై
విడిది చేసిన పికాలకు పాకి
కోరస్ ఎత్తుకుంటాయి!
కూర్చొని పఠిస్తే
జనంలో కలతిరిగి
సమూహం కూడగదుతుంది!
కళ్ళల్లో నిలుపుకుంటే
ఏదురంగులు
వేలరంగుల పాయలై చిత్రిస్తాయి!

పదానికెన్ని అర్థాలు
అర్థానికెన్ని శబ్దాలు
వాక్యానికెన్నిదారులు
పండితుణ్ణి పామరుణ్ణి
అలరించిన కవిత్వం
మంగళతోరణాలు కట్టి
పూలబాటలు వేసి
పల్లకిలో వూరేగుతుంది!

పదునైన ఖడ్గం యిచ్చి
దుష్టశక్తుల్ని దునుమాడమంటుంది!
మానవత్వం సుక్షేత్రంలో నాటి
దిగుబదులు తియ్యమంటుంది!
సమతను చాటి హరితం చేసి
చాపకూడు ఉపదేశిస్తుంది!
కవిత్వం నీలాంజన వజ్రం
ఇంట దాచి తరచూ ఆస్వాదిస్తే
ఒంటికి ఉల్లాసం
మనసుకు ఆహ్లాదం
మేధస్సుకు చేతనం!

■




# ఒక అపురూప వర్ణచిత్రం



- మందరపు హైమవతి
9441062732

**తి**నడానికి గుప్పెడు మెతుకులు కరువై ఆకలిరాగం పాడుతున్నపుడు కన్నతల్లిలాంటి ఉన్న ఊరిని వదిలి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తాడు మానవుడు. సంతానోత్పత్తి కోసం చలి దేశాల నుంచి ఉష్ణ దేశాలకు వలస వస్తాయి పక్షులు. గాలిలో గాలై, నేలలో నేలై, ఊపిరిలో ఊపిరై జీవించిన జన్మభూమిని వదిలి తనవారంటూ ఎవరూ లేని చోటుకి, అంతా కొత్త కొత్తగా ఉండే పరాయి భూమికి వలస వెళ్ళడం ఎంత విషాదకరం! మనుషులకైనా, పక్షులకైనా ఇది బాధాకరం. తన సంతానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రతి ఏటా మంచు కురిసే సైబీరియా నుంచి ఎండలు కురిసే మన రాష్ట్రానికి వలస వస్తాయి ఫ్లెమింగో పక్షులు. ఈ వలస పక్షుల జీవన గమనాన్ని గురించి వర్ణించిన కావ్యమే 'ఫ్లెమింగో'. దీర్ఘ కవితా ప్రక్రియకు చెందిన ఈ కావ్యాన్ని ప్రసిద్ధ కవి, నెల్లూరు నివాసి పెరుగు రామకృష్ణ రచించారు.

దీర్ఘ కవితకు వస్తువు ముఖ్యం. తీసుకున్న వస్తువును చివరి వరకు ఏక సూత్రతకు భంగం కాకుండా నిర్వహించడం కవికి కత్తిమీద సాము. కథాకథన చాతుర్యం గల రామకృష్ణ ఈ కావ్యాన్ని మొదటినుంచి చివరివరకు ఎక్కడా బిగి సడలకుండా కొనసాగించారు. వాక్య నిర్మాణం, కొత్త కొత్త పద చిత్రాలు పాఠకుణ్ణి ప్రత్యక్షరం కుతూహలంగా చదివింప చేస్తాయి.

పక్షికీ, మనిషికీ అవినాభావ సంబంధం. ఇప్పుడైతే కాకులు కనబడకుండా పోయాయి కానీ, ఒకప్పుడు పెరట్లో అంట్లు వెయ్యగానే కావుకావుమంటూ ఎక్కణ్ణుంచో వచ్చి వాలిపోయేవి. మన అమ్మలు, అమ్మమ్మలు వసారాలో కూర్చొని బియ్యం ఏరుతూ పారేసిన వడ్లను ముక్కుతో పొడుచుకొని తినే పిచ్చుకలు, నాలుగ్గింజలు జల్లితే మన ముంగిట్లోకి గుంపులు గుంపులుగా వచ్చే పావురాలు, మనిషి అదృష్ట దురదృష్టాలను ముక్కున కరుచుకొన్న అట్టముక్కలతో జోస్యం చెప్పే చిలక పండితులు.. ఇలా నిత్య జీవితంలో ప్రతి క్షణమూ పక్షులతో రాగరాజితం. స్వేచ్ఛకు ప్రతీక పక్షి. ఆకాశంలో ఎగురుతున్న పిట్టల్ని చూసి పక్షిలా ఎగిరిపోతే బాగుండునని అనుకోని వాళు ్ండరు. ప్రతిరోజూ ఉదయాస్తమయాల్లో ఆకాశంలో బారులు తీరి ఎగిరే పక్షుల్ని చూస్తే ఎంతో ఆనందంగా వుంటుంది. అలాంటిది కొన్ని వేల విహంగాలు ఒక్కసారే ఆకాశంలో ఎగిరే దృశ్యం మరింత మహాద్భుతం.

నెల్లూరు జిల్లాలో నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం. అక్టోబరు నెల మొదట్లో సైబీరియా లాంటి సుదూర దేశాల నుంచి వలస వస్తాయి ఫెలికాన్ పక్షులు. ఇక్కడ ఈ పక్షులు గూళ్ళు కట్టుకొని జతకట్టి సంతానోత్పత్తిని ప్రారంభిస్తాయి. నేలపట్టుకి 1.5 కి.మీ దూరంలో పులికాట్ సరస్సు ఉంది. ఈ పక్షులు అక్కడకు వెళ్ళి ఆహారం సంపాదించి సాయంసంధ్యకి నేలపట్టులో తమ నివాసానికి చేరుకొంటాయి. ఆడపక్షులు గుడ్లు పెట్టి పొదగడంతో మగ పక్షులు వేటకి వెళ్ళి ఆహారాన్ని తెచ్చి ఆడ పక్షులకు అందిస్తాయి. ఆడ పిట్టలు పిల్లలను పొదుగుతాయి. 3,4 వారాల్లో పిల్లలు ఎగరడం నేర్చుకొంటాయి. అక్టోబరులో మన దేశానికి వచ్చిన పిట్టలు మార్చిలో పిల్లలతో సహా తమ దేశాలకు తరలి వెళ్ళిపోతాయి.

కవి ఈ వస్తువుని తీసుకొని ఫ్లెమింగో పక్షుల జీవన చిత్రాలకు తన కలం కుంచెతో రంగులు దిద్దారు. జీవితంలో ఎవరికైనా ప్రయాణం తప్పదు. ఉన్నచోటు నుంచి మరోచోటుకి తరలివెళ్ళడం ఒక ఆనందానుభవం. "ప్రయాణం/ ఒక చలన లక్షణం/ పువ్వు ప్రయాణిస్తుంది పరాగమై/ పువ్వు నుంచి పువ్వు వరకు అనురాగమై పక్షి ప్రయాణిస్తుంది" అంటూ "ప్రయాణమే వలస పక్షుల జిగీష/ సంతానమే అనురాగ సాగర ప్రయాస"

అని సకల ప్రాణులకు సంతాన వృద్ధే జీవన పరమావధి అన్న వాస్తవాన్ని చెప్తారు.

రకరకాల అందమైన పక్షులు నేలపట్టుకి ఎగిరి వచ్చే సుందర దృశ్యాన్ని "కెరటాల కాంక్షతో/ కడలి పరుగెత్తినట్లు/ తెరలుతెరలుగా గాలి ప్రవహించినట్లు/ ఊపిరూపిరులుగా జీవితం సాగిపోయినట్లు/ కాలం రెక్కలపై కదిలిన ఫెలికాన్లు / గాలికారుతో దూసుకొచ్చిన ఫ్లెమింగోలు/ పతంగులై ఎగిరొచ్చిన ఎర్రకాళ్ళ కొంగలు" అని రకరకాల పక్షుల్ని అక్షరాకాశంలో చిత్రీకరిస్తారు. ఎక్కడినుంచో వచ్చిన పక్షులను "ప్రేమ రాయబారులందరూ/ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నట్లు / నేలపట్టు ప్రకృతంతా రంగుల ప్రేమ సందేశాలు" అని ఆ పక్షులు సంతానాన్ని కనడానికి నేపథ్యాన్ని సిద్ధం చేస్తారు.

సృష్టిలో అనేక ప్రాణులున్నాయి. ప్రాణులన్నిటిలో మనిషే స్వార్థపరుడు. తోటి ప్రాణులను తన ఉపయోగం కోసం వాడుకుంటాడు. పరోపకారం కోసం చెట్లు పూలు పూస్తాయి. కాయలు కాస్తాయి. కానీ రూపాయల మత్తులో మునిగి అన్నింటినీ అమ్ముకుంటాడు మనిషి. పశువులు తన పిల్లల కోసం పాలిస్తే, వాటిని అమ్ముకొంటాడు. ప్రవహించినంతమేరా తీరప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాయి నదులు. ఆ నీటిని అమ్ముకొని వ్యాపారం చేస్తాడు. కానీ పక్షికి స్వార్థం లేదు. దీనినే 'స్వార్థ చింతనే ఎరుగదు/ సంకుచితత్వంతో కుంచించుకు పోదు' అని అంటారు కవి.

అసలైన అనురాగానికీ, ప్రేమకీ ఉదాహరణలు పక్షులు. క్రౌంచ పక్షి మిథునంలో ఒక పక్షి మరణిస్తే మిగిలిన ఒంటరి పక్షి శోకిస్తుంది. కానీ డబ్బునే ప్రేమించే మనిషి భార్యతో కాపురం చేయడానికి కట్నం అడుగుతాడు. కానుకలు కోరతాడు. వరకట్నం కోసం సహచరురాలిని సజీవదహనం చేస్తాడు. లాభం కోసమో, మరొక కారణం కోసమో పరస్త్రీలతో సావాసానికి సిద్ధపడతాడు. కానీ పక్షులు ప్రేమమయ జీవులు. వాటి బంధం గొప్పదనాన్ని 'పక్షికీ అనుబంధాలుంటాయి/ అక్రమ సంబంధాలు లేవు/ పక్షులకీ సంఘ జీవనం ఉంటుంది/ సంఘ విద్రోహమే తెలీదు" అని అంటారు. పిల్లలను పొదిగే ఆడపక్షికి మగపక్షే ఆహారం తీసుకొస్తుంది. 'సహనం సంయమనంతో/ పొదిగే ఆడపక్షికి/ పులికాట్ ఫలహారాన్ని/ ముక్కు కింద సంచుల్లో పొదుక్కొచ్చి/ పొడిచి పొడిచి తినిపిస్తుంది' అని తన సహచరి ఆడపక్షిపై ప్రేమను ప్రకటించడాన్ని కవి హృద్యంగా ఆవిష్కరిస్తారు.

సంవత్సరానికోసారి తమ దేశానికి వచ్చే అతిథులను ఎంతో ప్రేమతో అక్కున చేర్చుకొంటారు నేలపట్టు ప్రజలు. ఆ ప్రాంతాన్ని పక్షుల రక్షిత ప్రాంతంగా ప్రకటించింది ప్రభుత్వం. పుట్టింటి కొచ్చే ఆడపిల్లల్ని చూసినట్లుగా అక్కడి ప్రజలు ఆ పక్షుల్ని ప్రేమగా చూసుకొంటారు. ఏ వేటగాడూ తూటా గురిపెట్టకుండా కాపాడుకుంటారు. ప్రతిఫలంగా ఆ పిట్టలు రెట్టలు వేసి అక్కడి భూములను సారవంతం చేస్తాయి. 'తనపై ఏ తూటాను పేల్చనివ్వక / జాగ్రత్త వహించిన / ఆ పరిసర పల్లె ప్రజలకు/ పరోపకారిగా, కృతజ్ఞతా భావంతో/ తమ రెట్టలతో నేలపట్టు/ నేలను సారవంతం, ఫలవంతం చేసి / ముక్కారు కాపు/ కానుకగా ఇచ్చి వెళుతుంది' అని ఆ పక్షుల గొప్పతనాన్ని కొనియాడుతూ 'నిజాయితీకి నిబద్ధతకు / క్రమశిక్షణకు/ పక్షి మనిషికా ధర్మం కావాలి' అని అంటారు కవి.

నెల్లూరి నివాసియైన కవి వృత్తిరీత్యా సూళ్ళూరిపేటలో ఎన్నో సంవత్సరాలు ఉన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఎన్నోసార్లు పాల్గొన్నారు. అనేకసార్లు నేలపట్టు, పులికాట్ ప్రాంతాలు చూశారు. ప్రతి సంవత్సరం అక్కడకు వచ్చే విదేశీ పక్షులు కవి మనసులో ముద్రితమైపోయాయి. ఆ పక్షుల చిత్రాలను ఫ్లెమింగోలో రకరకాలుగా చిత్రిస్తూ 'ఒక్కో పక్షి ఎగరేసిన ఒక్కో కవితా పతాక/ రంగుల రామచిలక కలల ఖండ కావ్యం/ చీకటి అడుసు తొక్కిన నల్లకాళ్ళ కొంగ/ నీలి పులికాట్‌లో కాళ్ళు కడుగుతుంది/ రంగురంగుల సముద్రపు రాలుక/ గిలక బాయి చేదలా నీళ్ళలో జారుతుంది' అని విభిన్న భంగిమలలో ఉన్న పక్షులను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు.

పక్షుల్ని ప్రేమించిన కవి, విదేశీ పక్షులను చూసి పరవశించిన కవి 'ఆంక్షల్లేని ఆకాశం కింద అతిథి పక్షులు/ విశ్వ సౌభ్రాతృత్వ సందేశ వాహకులు/ ప్రణయ రహస్యాలెరిగిన మన్మథులు" అని సంతానేచ్ఛతో ఒకటైన పక్షులను గురించి, 'విత్తంతైనా విశాల హృదయాలు వీళ్ళవి/ తరం నుంచి తరానికి ప్రాణ పరివేష్టి ఇహం నుంచి పరానికి పురాణగోష్టి/ పక్షులు కాలరాజు ఎగరేసిన కేతనాలు" అని వర్ణిస్తారు.

మనుషుల్లాగా పక్షులు కూడా ప్రాణులే! సంతానాభివృద్ధి మనుషులకీ పక్షులకీ ఒకటే. ఈ పక్షుల సంతానోత్పత్తిని శృంగారరస భరితంగా మృదు మధురంగా చిత్రిస్తారు. 'ప్రతి కొమ్మా వాత్స్యాయన శిబిరం/ ప్రతిగూడు ప్రతివోత్థాన శిఖరం/ సంసార సుఖందినా విశ్వవృద్ధి లేదు / పక్షికి అందమే చైతన్య తేజం/ విత్తు నుంచి చెట్టు, చెట్టు నుంచి విత్తు/ విశ్వవ్యాప్తికి మొదటి మెట్టు/ వలస పక్షుల సంతాన యజ్ఞానికి/ యాగ వేదిక పరిఢవిల్లిన కడప చెట్టు". కడప చెట్ల మీదే ఈ పక్షులు నివసిస్తాయి. అక్కడే సృష్టి కార్యాన్ని నిర్వహిస్తాయి. ఈ విదేశీ పక్షుల వర్ణనలో కవి కలం మైమరచి పోతుంది. 'ఇంద్రియ చాపల్యం లేని విదేశీ యోగులు/ కాలచక్ర రహస్యం దర్శించిన

దివ్య జ్ఞానులు/ దైహికానందమో, ఆనంద దైహికమో మరచి/ మన్మథుడు ఉన్నత యోగి అవుతాడిక్కడ/ ప్రకృతే ఈ నేలపై ప్రకృతి ధర్మం నెరవేరుస్తుంది/ పురుషుడై సృష్టి ధర్మం సాగిస్తుంది/ స్త్రీ పురుష వివక్షలేని సమానత్వం/ కళ్ళు తెరచిన వారికి వాంఛావాసన/ కళ్ళు మూసిన ముముక్షులకి/ ఆత్మ సాక్షాత్కారం' అని మానవ జీవన తాత్వికతను వ్యాఖ్యానిస్తారు.

ఈ పక్షులు తమ పిల్లలకి ఆహారం అందించే ప్రక్రియను మన కళ్ళ ఎదుట కనబడేటట్లు కవితా చిత్రాలు చిత్రిస్తారు. 'ముక్కున కరచి తెచ్చిన బేడిసని/ మురిపెంగా ముద్దరాలి కందిస్తుంది ఫ్లెమింగో". పిల్లలు పెరిగి పెద్దవుతాయి. 'బుల్లి ఫ్లెమింగో రెక్కలాడిస్తూ/ పాము చేపను వేటాడుతుంది/ ముక్కు వంకరలకు ముకి పిట్ట/ మట్టి గిరుసను వెంటాడుతుంది/ రెక్కలొచ్చిన పిల్ల పక్షులకి/ ఆకాశం ఎంతో ఇరుకు" అంటారు.

పక్షుల పండుగలోని అందాన్ని 'నేలపట్టు నుంచి పులికాట్టు వరకు/ రంగుల గంగాధారగా ప్రవహిస్తుంది/ పక్షుల పండుగ/ సంబరం అంబరాన్ని తాకుతుంది/ ఎరలేదు వలలేదు గాలం అదీ లేదు/ ముక్కే వేటాడే ఆయుధం/ ఆకలి యుద్ధం యేనాడాగదు'. ఈ సృష్టిలో ప్రతిప్రాణి ఆకలితో యుద్ధం చేయాల్సిందే. కష్టపడి విజయం సాధించాల్సిందే. ఎక్కడినుంచో తన సంతానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇక్కడికి వస్తాయి పక్షులు. 'సంతాన సమృద్ధికి నేలపట్టు మానులేమహడీ/ ప్రళయకావేరి ప్రణయభావాల చర్చరి' అంటూ ఈ పక్షుల మీద అభిమానంతో 'వీటిని పరదేశి పక్షులన్న వాడు ఎవడో/ వలసత్వం వారసత్వం చేసినవాడెవడో/ ఇక్కడి పల్లె నుంచి వెళ్ళి/ అగ్రరాజ్యంలో పిల్లను కంటే/ ఆకుపచ్చ పతకంతో పాటు పౌరసత్వాన్ని దక్కించుకున్నట్లు/ ఇక్కడ పెట్టిన గుడ్డు పరాయిదెట్లౌతుంది/ ఈ నేల గుర్తిండిపోతుంది ప్రతి పక్షికి/ అందుకేగా తరలి వస్తుంది యేటేటా జన్మభూమికి'. ఈ ఫ్లెమింగో పక్షులు ఏ యేడాదికో ఒకసారి వచ్చి ఊరుకోవు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇక్కడికి తరలి వస్తాయి అని అంటారు.

ఈ కావ్యం కేవలం పక్షుల జీవితాన్ని మాత్రమే వర్ణించలేదు. సమాంతరంగా మానవ జీవన వ్యాఖ్యానం ప్రతి అక్షరంలో ప్రతిఫలిస్తుంది. నేడు నగరాల్లో, ఒక మాదిరి చిన్నచిన్న ఊళ్ళలో సైతం అపార్టుమెంట్ సంస్కృతి విస్తరించింది. చెట్లమీద వాలిన పక్షులతో ఆకాశం ఇంద్రధనస్సు పూచినట్లుగా వుంటుంది. 'ఆకాశం రంగుపూలు పూచిన దృశ్యం/ రబ్బరు చెట్ల కొమ్మల్లో/ ఫ్లెమింగో ఫెలికాన్‌ల కాపురం/ విస్తరిస్తున్న అపార్టుమెంట్ సంస్కృతిలో/ వేలాడుతున్న మనిషి కుటుంబాల ప్రతిబింబం' అని ఆధునిక నగర మానవ జీవితాన్ని కళ్ళకు కట్టిస్తారు కవి.

ఫ్లెమింగో పక్షులు ఏడడుగుల పొడవు వుంటాయి. మూడడుగుల పొడవు కాళ్ళతో, మూడడగుల పొడవు మెడతో ఒక అడుగు శరీరంతో తెల్లగా వుంటాయి. వీటిని సముద్ర రామచిలుకలు అని అంటారు. ఆకారాలు మాత్రమే కాదు, వాటి కూజితాలూ అందంగా ఉంటాయి. 'కువకువలు ప్రేమల్ని పొదిగే సింఫనీలో/ ఎన్నారై రెక్కల సంగీతం నేర్చే సరిగమ' అని వాటి అరుపులలోని మాధుర్యాన్ని అభివర్ణిస్తారు.

ఈ ప్రపంచంలో ప్రాణులన్నిటిలో మనిషి మేధావి. ఐనా స్వార్థపరుడు. ప్రకృతితో మమేకమై జీవించవలసిన వాడు ప్రకృతిని వికృతిగా మార్చేస్తున్నాడు. మట్టితో అనుబంధం పెంచుకోవాల్సిన వాడు మట్టిని చూసి అసహ్యించుకుంటున్నాడు. కన్నతల్లిలాంటి భూమిని అమ్మకం సరుకుగా మార్చేశాడు. ఇలాంటి సమయంలో పక్షిని చూసి తన గుణగణాలను మానవులు మెరుగులు దిద్దుకోవాలని అంటున్నారు. 'బతుకు మూలాలు మరిచిన సమయంలో/ అంతర్ముఖాన్ని కోల్పోయిన మట్టి మనిషి/ మరయంత్రమై పోయాక/ ఇప్పటికైనా యిక/ పక్షిలో పరకాయ ప్రవేశం చేయాల్సిందే'నని అంటారు.

'ఫ్లెమింగో కావ్యం' ఆద్యంతమూ ఆసక్తికరంగా చదివిస్తుంది. జలపాతం లాంటి శైలి. ఎక్కడా అవరోధం కలిగించదు. 'ఒక చీకటి ఖండం మీద నుంచి, ఒక వెలుగు మీదకు/ ఒక మంచుదేశం నుంచి/ ఒక ఉష్ణ ప్రాంతం వరకు/ రుతువుల వంతెన కడుతుంది'. ఇలాంటి వర్ణనలు హృదయాంగమంగా ఉంటాయి.

ఫ్లెమింగో చదివాక ఒక అపురూప క్యావం చదివిన అనుభూతి కలుగుతుంది. పక్షుల గురించి, అవి పిల్లలకు ఆహారం పెట్టే విధానం, ఇలాంటి సందర్భాల్లో ఆయా వర్ణనలు చదువుతుంటే రంగురంగుల వర్ణచిత్రం చూస్తున్నట్లే ఉంటుంది. ఇది కేవలం పక్షుల జీవితమే కాదు ఆధునిక మానవ జీవన వ్యాఖ్యానం కూడా. దీర్ఘకవితల కావ్యాల్లో 'ఫ్లెమింగో' ఒక విశిష్ఠమైన క్యావం. విభిన్న వస్తువులపై రాసిన దీర్ఘకవితా కావ్యాలు తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. కానీ ఇలా పక్షులను వస్తువుగా తీసుకొని రాసిన దీర్ఘ కవితా కావ్యం ఇదేనని చెప్పవచ్చు. వస్తురూపాలు ఒకదానికొకటి పోటీపడి పాఠకుల హృదయాల్లో ప్రగాఢ ముద్ర వేస్తాయి. పుస్తకం చదివి మూసేసినా ఆ ఎగురుతున్న రంగు రంగుల ఫ్లెమింగో పక్షుల చిత్రాలు హృదయాకాశంలో ఎగురుతూనే ఉంటాయి ఎప్పటికీ.

■



# మిమ్మల్ని కాక ఇంకెవర్ని?

- నందిరాజు విజయకుమార్
95027 60757

పరమ కారుణ్యంతో
మీకు అవకాశం కల్పించాం కదా?!
మీ జీవితాన్ని ఆమాత్రంగా
ప్రతిఫలంగా పుచ్చుకుంటే అంతగా గింజుకోవాలా?
గింజలేసి పుంజును మేపేది
పందేనికైనా కావొచ్చు
విందుకైనా కావొచ్చు!
మీరు పున్నాగపూలైనా సరే
సన్నాయి నొక్కులే నొక్కాలి కానీ
సౌరభాలు చిమ్మటానికి అస్సలు వీల్లేదు.

అయినా
మీరు కూలుతున్న గోపురాలు
శిధిలమౌతున్న మహాచైత్యాలు
భోషాణంపెట్టెలో చిలుము పట్టిన పంచపాత్రలు
కాల పురుషునికి కురచైపోయిన అంగవస్త్రాలు
ఇంగువ కట్టిన గుడ్డలు

పోనీలే పాపం అని మిమ్మల్ని
చేరదీసిన అపార దయామూర్తులం మేం
మీ బతుకుపై మాక్కాక అధికారం ఎవరికుంటుంది?
మీ కళ్ళని ఎప్పుడో జప్తు చేశాం
కలల్ని అలా ప్రసవించటం నేరమని తెలీదా?
మీ జీవిత పాత్రలోని కాలామృతం మొత్తం
మా జీవన వృక్షంపైనే వర్షించాలి!
ఔదార్యాన్ని ప్రచారం చేయటానికి మాత్రమే
మీ గొంతుల్ని ఉపయోగించాలి
లేకుంటే బంగారుదారంతో నైనా కుట్టేసి
మా దానశీలతను ప్రపంచానికి చాటుతాం!

అయినా మీకిదేం రోగం?
ఆత్మగౌరవమంటూ అంగలారుస్తారు
క్రమం తప్పకుండా
మా ఎంగిలి చేయి విదిలిస్తూనే ఉన్నాం కదా?
మిమ్మలను పురావస్తువులుగా
ప్రదర్శనశాలలో ఉంచాం కదా!
కావాలంటే కావ్యాల్ని తినండి
ఆధ్యాత్మిక మర్మాలను వినండి
అప్పుడప్పుడూ సభలు పెట్టించి మరీ
పొగడ్తల శాలువాలు కప్పుతాం

మీరే చెప్పండి–
మీ బతుకుని లాక్కునే హక్కు మాకు లేదా?
అరే! ఆభిజాత్యం మీకు చచ్చినా పోదు
కానీ మిమ్మల్ని చావనిస్తే
మేమెవర్ని నిందించాలి?
మా పల్లకీలను ఎవరి భుజంపై పెట్టాలి?



# ఏ వెలుగులకీ ప్రస్థానం

- గన్నవరపు నరసింహమూర్తి
77520 20123

**ఇం**జనీరింగ్ పూర్తి కాగానే నా స్నేహితులందరూ అమెరికాకి ప్రయాణం కట్టారు. టోఫెల్ రాయడం, మంచి విశ్వవిద్యాలయాల్లో సీటుకి ప్రయత్నించడం వంటి పనుల్లో బిజీ అయిపోయారు. కొందరు కేంపస్ ప్లేస్‌మెంట్స్‌లో వచ్చిన ఉద్యోగాల్లో చేరిపోయారు.

నేను చదివింది మెకానికల్ ఇంజినీరింగ్. కంప్యూటర్ ఉద్యోగాలు నాకిష్టం లేదు. ఏదైనా మన దేశంలోనే ఉద్యోగం చెయ్యాలన్న కోరిక. గ్రూప్ 1, సివిల్ సర్వీసెస్, ఇంజనీరింగ్ సర్వీసెస్... గేట్ ఇలా చాలా పరీక్షలు రాశాను. కానీ వేటిలోనూ అర్హత సాధించలేక పోయాను. కాలేజీల్లో సరిగ్గా చెప్పకపోవడం ఒక కారణమైతే, నాలాంటి చాలామందికి లెక్కలు, సైన్స్‌ల్లో సరైన జ్ఞానం లేకపోవడం మరొక కారణం. ఎవరికైతే ఐక్యూ పది స్కేలు మీద 7 దాటుతుందో వాళ్ళకే ఇంజనీరింగ్, సైన్స్ బాగా పట్టుబడుతుంది అని మా ప్రొఫెసర్ ఒకరు చెప్పేవారు. అది నిజమేననీ ఇప్పుడు తెలుస్తోంది.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఇబ్బడి ముబ్బడిగా రావడం, తమ పిల్లల్ని ఇంజనీరింగ్ చదివిస్తే ఉద్యోగాలొస్తాయన్న భ్రమలో తల్లితండ్రులు ఉండటంతో అందరూ ఇంజనీరింగ్ బాటే పడుతున్నారు. వాళ్ళకి ఐక్యూ ఉందా లేదా అని ఎవ్వరూ చూడలేదు. ప్రైవేట్ కళాశాల్లో 30 శాతం యాజమాన్యపు కోటాకింద లక్షలు పోసి కావల్సిన బ్రాంచిలో చేరిపోవడం, ఆ తరువాత హైదరాబాద్ వెళ్ళి అమీర్‌పేట్‌లో ఏవో కొన్ని కోర్సుల్లో చేరడం... మమూలైపోయింది.

90 శాతం ఐఐటీ విద్యార్థులు విదేశాల్లోనూ పనిచేస్తూ మన దేశానికి హాని చేస్తున్నారని నాకనిపిస్తోంది. ప్రభుత్వం ఒక్కొక్క ఐఐటీ విద్యార్థి మీద రూ.50 లక్షలు ఖర్చుపెడుతున్న విషయాన్ని వారు పట్టించుకోవటం లేదు. వరద వచ్చినపుడు చెట్టూ చేమతో సహా అన్ని ప్రవాహంలో కొట్టుకుపోక తప్పదన్నట్లు నేను కూడా అమెరికా వచ్చి పడ్డాను.

రెండేళ్ళు నానా బాధలూ పడి ఎమ్మెస్ చదివాను. చాలామంది అనుకున్నట్లు ఇక్కడ విశ్వవిద్యాలయాలు అన్నీ గొప్పవి కావు. కొన్ని మన దేశంలో వాటికన్నా హీనంగా ఉంటాయి. అవి విదేశీ విద్యార్థుల డబ్బు మీదే ఆధారపడతాయి. చిన్న రూమ్‌లో నలుగురం ఉండేవాళ్ళం. సాయంకాలాల్లో పెట్రోల్ బంకుల్లో, కాలేజీ లైబ్రరీల్లో, రిసెప్షన్లో పని చేస్తూ చదువులు పూర్తి అయిందనిపించాం. ఇలాంటి బాధలతో చదువులు, ఉద్యోగాలు చెయ్యడానికి ఇంత దూరం ఎందుకు? హాయిగా మన దేశంలో చేసుకోవచ్చు కదా అని అప్పుడప్పుడు అనుకునేవాడిని.

అమెరికా సమాజం ఎవరి గురించీ పట్టించుకోదు. ప్రతివాళ్ళు తమ వ్యక్తిగత ఎదుగుదల, డబ్బు సంపాదన, జీవితాన్ని అనుభవించడం మీదే కేంద్రీకరిస్తారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే అనుబంధాలు చాలా ప్రాక్టికల్‌గా ఉంటాయి. చాలా కుటుంబాల్లో భార్యాభర్తలు పిల్లలు పెద్దయ్యేసరికి విడిపోయి, ఇంకొకర్ని వివాహం చేసుకుంటారు. దాంతో, పిల్లలు ఇంటర్ తరువాత పెళ్ళి చేసుకొని తల్లితండ్రులకు దూరంగా వెళ్ళిపోతారు. మన దేశంలో

విడాకులు తక్కువ కాబట్టి కుటుంబాల్లో అనుబంధాలు ఎక్కువ. ఈ విషయం అమెరికా వెళ్ళిన చాలా రోజులకి నాకు బోధపడింది.

అమ్మ ఒకసారి ఫోన్ చేసి, నేను పనిచేస్తున్న కాలిఫోర్నియా లోనే ఉంటున్న మా మావ కూతురు సీతను కలవమని చెప్పడంతో– ఒక ఆదివారం కష్టపడి ఆమెను కలిసాను. అప్పటికే ఆమె భర్తతో విడాకులు తీసుకొని ఓ అమెరికన్‌తో సహవాసం చేస్తోంది. ఆ విషయం వాళ్ళ తల్లితండ్రులకు చెప్పలేదట. అక్కడ మా అత్తావాళ్ళు కూతురు అమెరికాలో హాయిగా ఉందని అందరికీ చెబుతూ కలల్లో విహరిస్తున్నారు.

ఒక శనివారం నా స్నేహితుడు రవి, అతని స్నేహితు రాలితో పిక్‌నిక్ వెళ్ళాడు. అది 50 కిలోమీటర్ల దూరంలోని ఒక వాటర్‌ఫాల్ లొకేషన్. నన్ను రమ్మంటే పనుండటం వల్ల వెళ్ళలేదు. ఆ అమ్మాయి విద్య కూడా మాతో చదువుకున్నదే. ఈ మధ్యనే ఆమెకు ఉద్యోగం వచ్చింది. ఏదో హొటల్లో పనిచేస్తోంది. తల్లిదండ్రులు ఆమెనిక్కడ చదివించడానికి చాలా డబ్బులు ఖర్చుపెట్టారని ఒక రోజు చెప్పింది. అక్కడ మన రాష్ట్రంలో చదివితే తల్లితండ్రుల ఆంక్షలుంటాయి. ఇక్కడ అవేమీ లేకపోవడం వల్ల వారాంతాల్లో బాయ్‌ఫ్రెండ్స్‌తో ఎక్కడికో వెళుతుంటుంది. అడిగే వాళ్ళెవరూ లేరు.

సోమవారం నాడు మిత్రుడు శ్రీనాథ్ ఫోన్ చేసి, రవి ఈ రోజు ఆఫీసుకి రాలేదని, ఫోన్ స్విచాఫ్ వస్తోందని, విద్య ఫోన్ కూడా పనిచెయ్యటం లేదని చెప్పడంతో... నేను వెంటనే అతని దగ్గరికి వెళ్ళాను. పోలీసుల సాయంతో రెండురోజుల తరువాత వాళ్ళ ఆచూకీ తెలిసింది. వాళ్ళ కారు ఒక లోయలో పడిపోయి అందులో ఇద్దరూ చనిపోయి కనిపించారు. వారం రోజుల తరువాత వాళ్ళ డెడ్‌బాడీలను వాళ్ళ ఊళ్ళకు విమానాల్లో పంపించారు. పిల్లలు అమెరికా వెళ్ళి తమను ఉ ద్ధరిస్తారు అనుకున్నవాళ్ళ తల్లితండ్రులకు ఇదొక పెద్ద శరాఘాతం. వాళ్ళనెవరు ఓదారుస్తారు!

వీటికి తోడు ప్రతి ఆరు నెలలకూ ఉద్యోగాలు మారవల్సి వస్తోంది. ఉద్యోగాల్లో ఏవో సమస్యలు... మా వాళ్ళు మాత్రం అందరికీ నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాననీ చెబు తున్నారు. దూరపు కొండల నునుపు. బెంగుళూరుల్లోనూ, హైదరాబాద్‌లోనూ పనిచేస్తున్న మా స్నేహితుల పది వేల రూపాయల ఉద్యోగాలకీ, మాకు ఏమిటి తేడా అనే నేను రోజూ అనుకుంటూ ఉంటాను.

అలా అని అందరిదీ ఇదే పరిస్థితి కాదు. స్టాన్‌ఫోర్డ్, మెస్సచూసెట్, కాలిఫోర్నియా లాంటి మంచి విశ్వవిద్యా లయాల్లో చదివితే మంచి కంపెనీల్లో వస్తాయి. వాళ్ళ ఉద్యోగ జీవితాలు బాగుంటాయి. కానీ వాళ్ళు ఓ 20 శాతం మందే ఉంటారు. మిగతావారంతా నాలాంటివాళ్ళే. ఇక కార్లూ, విలాసవంతమైన జీవితం అమెరికన్ సమాజంలో మామూలే. మన దేశంలో పొదుపుగా బతకటం ఒక అలవాటు. ఇక్కడ అందుకు భిన్నం. ఏవారం సంపాదన ఆవారాంతం ఖర్చు అయిపోవల్సిందే! సోమవారం నుంచి క్రెడిట్ కార్డుల వాడకం మొదలవుతుంది.

నేను అమెరికా వచ్చిన నాలుగేళ్ల తరువాత మా ఊరు వెళ్ళాను. అమ్మావాళ్ళు నన్ను చూసి ఎంతో గర్వపడ్డారు. అందరితోనూ మావాడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడనీ, 2 లక్షలు జీతం అనీ చెబుతుంటే నాకు చాలా సిగ్గనిపించింది. నేను అక్కడ నెల రోజులుంటాననీ చెప్పడంతో మా అమ్మ నాకు సంబంధాలు చూడటం మొదలు పెట్టింది. అమెరికా పెళ్ళికొడుకుని కాబట్టి చాలా సంబంధాలు రావడం మొదలైంది.

ఓరోజు మా మేనమావ, అత్త వచ్చారు. మావ ఒక పల్లెలో ఉపాధ్యాయుడు. ఒక్కర్తే కూతురు. దీపాంజలి. బిఈడీ చేసి టీచరుగా పనిచేస్తోంది. మావ ఆ రాత్రి మా నాన్నతో దీపాంజలిని కోడలిగా చేసుకొమ్మని అడిగాడు. మా అమ్మ వద్దంది. మా మామ చాలా బాధపడుతూ వెళ్ళిపోయాడు. నాకైతే దీపని చేసుకోవాలనుంది. నాకు చిన్నప్పట్నుంచి తను తెలుసు. కానీ, అమ్మని ఎదిరించలేకపోవడం నా బలహీనత. కానీ ఆ నెల్లాళ్ళలో ఒక్క సంబంధం కుదరలేదు. చాలా సంబంధాలు జాతకాల వల్ల తప్పి పోవడం నాకాశ్చర్యం కలిగింది. ఈ కాలంలో కూడా జాతకాలా?

మళ్ళా అమెరికా వచ్చేసాను. ఆ సమయంలో కోవిడ్ మొదలైంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అమెరికాని ఒక కుదుపు కుదిపింది. లాక్‌డౌన్ ప్రకటిస్తే చాలామంది ఉ ద్యోగాలు కోల్పోయి ఎన్నో బాధలు పడవలసి వస్తుంది. అందుకనీ వాళ్ళూ ప్రభుత్వపు మాట వినకపోవడం వల్ల ఆ వ్యాధి అమెరికా అంతటా వ్యాప్తి చెంది 4 కోట్లమందికి సోకింది. 15 లక్షలకు పైగా చనిపోయారు. నాకైతే ఇండియాకి వెళ్ళిపోవాలనిపించింది కానీ చాలా రోజులు దాకా విమానాలు దొరకలేదు. రోజూ బయటకు వచ్చినప్పుడల్లా భయం వేస్తుండేది.

కోవిడ్ వల్ల సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. ప్రపంచాన్ని చిటికెన వేలితో శాసించే మానవుడు ఒక కంటికి కనిపించని అతి సూక్ష్మ వైరస్‌కి లొంగి పోక తప్పలేదు. కనిపించని శత్రువుతో యుద్ధంలో అలసిపోయి చాలా మూల్యం

చెల్లించుకున్నాడు.

ఏడాది పాటు వర్క్ ఎట్ హోమ్. జీతాల్లో కోత విధించారు. ఈ ఉద్యోగం ఎన్నాళ్ళుంటుందో తెలియదు. బయటకెళ్ళాలంటే భయం. రోజూ రాత్రిపూట ఒంటరితనం ఆవహించేది. అమ్మ నాన్న గుర్తుకు వచ్చేవారు. వెళ్ళాలంటే వేల మైళ్ళు... అమెరికా జీవితం ఎండమావి లాంటిది. మనిషిని ఆకర్షిస్తూ పరిగెత్తిస్తూ చివరకు మొండిచెయ్యి చూపిస్తుంది.

ఒక ఆదివారం మా దూరపు చుట్టాలింటికి న్యూయార్క్ వెళ్ళాను. అప్పటికి కరోనా కొద్దిగా తగ్గుముఖం పట్టింది. వాళ్ళు ఇక్కడ కొచ్చి ఇరవై ఏళ్ళైంది. ఆమె మా నాన్నగారికి చెల్లెలు వరసవుతుంది. వాళ్ళకిద్దరు పిల్లలు... ఇంటర్ చదువుతున్నారు. భోజనాలప్పుడు వాళ్ళని పరిచయం చేసింది ఆంటీ. అంకుల్ ఏదో కంపెనీలో పనట. అతని తెలుగు వింటే నాకాశ్చర్యం వేసింది. పూర్తిగా మరచిపోయాడట. పిల్లలకు మన తెలుగే రాదట. అంతా అమెరికన్ ఏక్సెంట్‌తో ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు.

"ఆంటీ! వాళ్ళకి తెలుగు రాదు. ఇంక తరువాతి తరానికి అసలు రాదు. కొన్నాళ్ళకు మన జాతి అంతరించి పోదా?" అని అడిగితే ఆమె నవ్వేసింది.

అలా ఎన్నో తెలుగు కుటుంబాలు మరుగున పడిపోతున్నాయి. ఈ అమెరికా ఉద్యోగాలు లక్షల మంది తెలుగువారిని మింగేయబోతున్నాయి. పెద్ద చేపకు చిన్న చేప బలి కావలసిందేననీ ఎక్కడో చదివాను.

రోజులు భారంగా గడుస్తున్న సమయంలో నా కొలీగ్ హెన్రీ తండ్రి చనిపోయినట్లు కబురొచ్చింది. అతనిది కెన్యా... బ్లాక్... చాలా పేదరికంలో పుట్టాడు. రేసిజంని భరిస్తూ ఎన్నో కష్టాలు పడి ఉద్యోగం చేస్తుండేవాడు. తండ్రి వడ్రంగి పనిచేస్తుంటాడనీ చెప్పాడు.

ఎంతో పురోభివృద్ధి చెందిన దేశం అని చెప్పుకునే అమెరికాలో రేసిజం ఒక మాయని మచ్చ. వాళ్ళు మన దేశంలో అంటరానితనం ఉందని ఎత్తి చూపుతారు. కానీ అంతకన్నా ఘోరమైన రేసిజం వాళ్ళ దేశంలో ఉందన్న నిజాన్ని వాళ్ళు ఒప్పుకోరు.

ఎంత అభివృద్ధి చెందినా మనిషి తన సహజసిద్ధమైన లక్షణాలను వదులుకోడు. అసూయ, స్వార్థం, అహంకారం ఈ గుణాలు అన్ని దేశాల్లో ఉన్నాయి. చాలామంది వీటికి ముసుగు తొడుగుతారు.

హెన్రీతో నేను కూడా కెన్యా వెళ్ళాను. అది తూర్పు ఆఫ్రికా ఖండంలో ఒక చిన్న దేశం. హిందు మహాసముద్రం ఒడ్డున ఉంది. నైరోబీలో దిగి అక్కడి నుంచి ఐదు గంటలు కారులో ప్రయాణించి ఆ పల్లె చేరుకున్నాం. 6 లక్షల చదరపు కిలోమీటర్ల అతి చిన్న దేశం. 5 కోట్ల జనాభా. అక్కడ చాలామంది ఎయిడ్స్‌తో చనిపోతారని వినీ నాకు ఆశ్చర్యం కలిగింది. అక్కడి ఆ ప్రదేశాలను, ఆ ఊరి ప్రజల్ని చూసిన తరువాత మన దేశం చాలా గొప్పదనిపించింది.

ఆఫ్రికాలో ఒక చిన్న రేకుల ఇల్లు హెన్రీది. ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లె.... తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబానికిప్పుడు హెన్రీయే ఆధారం. నేనక్కడ వారం రోజులున్నాను. వాళ్ళ సంప్రదాయంలో తండ్రికి అంత్య క్రియలు చేసాడు హెన్రీ. ఇంక బయలుదేరే సమయంలో తను ఇంక అమెరికా రానని చెప్పాడు. అతని మాటలు నాకు ఆశ్చర్యం కలిగించాయి.

"రామ్! నా కుటుంబాన్ని వదలి నేనెక్కడికీ రాను. ఇన్నాళ్ళూ మా నాన్నగారుండేవారు. ఇప్పుడు నేను అమెరికా వస్తే వీళ్ళని చూసే వారుండరు. అమ్మకి ఒంట్లో బాగుండదు. నేను కూడా లేకపోతే మా తమ్ముళ్ళు, చెల్లెలు అనాథలవుతారు. నా స్వార్థం కోసం వాళ్ళని బలిపెట్టలేను. ఇక్కడే ఏదో చేసుకొని వీళ్ళని పోషిస్తాను. అసలు నేను ఈ జన్మభూమిని వదలి అనవసరంగా అమెరికా వచ్చాననిపిస్తోంది. నాన్న చనిపోయిన తరువాత కానీ తల్లిదండ్రుల విలువ తెలీలేదు' అన్నాడు ఏడుస్తూ. అతన్ని ఓదార్చటం కష్టం అయింది. ఆ మర్నాడే నేను అమెరికా వచ్చేసాను.

హెన్రీ మాటలు నన్ను వెంటాడుతున్నాయి. ఆ రాత్రి శ్రీశ్రీ మహాప్రస్థానం చదివాను – అందులో ఒక వాక్యం నన్ను వెంటాడసాగింది. ఏ వెల్గులకీ ప్రస్థానం? అవును... తానెందుకు అమెరికా వచ్చాడు? ఏ వెలుగుల కోసం... తనలాగే వచ్చిన హెన్రీ తిరిగి తన దేశం వెళ్ళిపోయాడు. తన మూలాలను తెలుసుకున్నాడు. తన వేళ్ళు అక్కడే ఉన్నాయనీ గ్రహించాడు. వారంరోజుల సంఘర్షణ తరువాత నాకు అక్కడ ఉండబుద్ధి కాలేదు.

అసలు తాను ఎందుకొచ్చాడు? ఏం సాధిద్దామనీ... కేవలం డబ్బు కోసమే... అది ఎంత కష్టమో ఈ నాలుగేళ్ళలో తెలిసింది. ఈ పాటి కష్టపడితే, ఇండియాలో ఇంత కన్నా ఎక్కువే సంపాదించేవాణ్ణి... ఇక్కడైతే ఎవ్వరికీ తెలియదనీ ఏ పనికైనా సిద్ధపడే మనవాళ్ళు అక్కడ సామాజిక హోదా అడ్డు వచ్చి ఆ పనులు చెయ్యరు.

ఈ నాలుగేళ్ల అమెరికా జీవితం నాకు చాలా నేర్పింది. ఎలా బతకాలో చెప్పింది. జీవితం చాలా చిన్నదనీ, క్షణభంగురమనీ ఒక చిన్న వైరస్ కరోనా రూపంలో మనకి పాఠం నేర్పింది. డబ్బుకన్నా ప్రాణం, మానవ సంబంధాలు

గొప్పవన్న చేదు నిజాన్ని అంతర్లీనంగా గుర్తుచేసింది. నెలరోజుల తరువాత నేను మన దేశం బయల్దేరాను.

చెప్పాపెట్టకుండా రావడంతోనే అమ్మనాన్న ఆశ్చర్యానికి లోనయ్యారు. అందరితోనూ వాళ్ళు పెళ్ళి కోసం నెలరోజుల సెలవు మీద వచ్చాడని చెప్పబోతుంటే వారించాను.

"అమ్మా! నేనింక అమెరికా వెళ్ళను. ఎవ్వరికీ నేను మళ్ళీ వెళ్ళిపోతాననీ చెప్పకండి. ఇప్పుడు నేను అమెరికా నుంచి వచ్చేసాను కాబట్టి నాకు పిల్లనిస్తాననీ బహుశా ఎవ్వరూ రాకపోవచ్చు. ఇక్కడే నేనేదో ఉద్యోగం చూసుకుంటాను. ఇకనుంచి మనందరం నేలమీద నడుద్దాం. వాస్తవాలను మాట్లాడదాం" అని చెప్పాను.

అమ్మానాన్నా నా మాటలు విని అవాక్కయ్యారు.

పరీక్ష రాయడానికి వెళ్ళినపుడు మామ కూతురు దీపాంజలి కలిసింది. ఆమె కూడా ఆ పరీక్ష కోసం వచ్చింది.

జరిగిన విషయాలు ఆమెకు చెప్పాను.

రెండు నెలల తరువాత ఫలితాలొచ్చాయి. ఆమె సెలక్టైంది. నేను కాలేదు.

ఆమెకు కంగ్రాట్స్ చెప్పి ఇంటికి వచ్చేసాను.

మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలు...

◆◆◆

నాలుగు నెలల తరువాతనుకుంటాను ఒకరోజు దీప నుంచి ఫోన్ వచ్చింది. అర్జెంటుగా తనని కలియమనీ ఎక్కడ కలవాలో చెప్పింది.

అదొక చిన్న రైల్వేస్టేషన్. పాసింజర్లో దిగింది. కొద్దిసేపు మౌనం తరువాత ...

'నేను ముస్సోరీ ట్రైనింగ్ కోసం 10 రోజుల్లో బయల్దేరుతున్నాను. సంవత్సరన్నర తరువాత పోస్టింగిస్తారు...' అని చెప్పింది.

నేను మౌనం దాల్చేను. ఈ విషయం చెప్పడానికా తనని పిల్చింది... అన్న అనుమానం కలిగింది.

'నీ భవిష్యత్తు ప్లానేమిటి?'

మళ్ళీ ఆమె అడిగింది. "ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు దీపా... గ్రూప్ వన్‌కు ప్రిపేర్ అవుదామనుకుంటున్నాను".

"ఇంటి దగ్గర చదవడం కష్టం. ఏ ఢిల్లీకో వెళితే మంచిది"

"ఇప్పుడు ఢిల్లీకేం వెళతానులే... ఇంకో రెండుసార్లు ప్రయత్నించి ఆ తరువాత ఏం చెయ్యాలో ఆలోచిస్తాను" అని చెప్పాను.

ఇంతలో పల్లీలవాడు వస్తే రెండు కొని ఆమెకొకటిచ్చాను.

"పోనీ నాతో ముస్సోరీ వస్తావా? అక్కడ బాగా ప్రిపేర్ కావొచ్చు" అంది.

ఆ మాటలు నాకాశ్చర్యం కలిగించి ఆమె వైపు అనుమానంగా చూసాను.

ఆమె ముఖం సీరియస్‌గానే ఉంది.

"జోక్ చేస్తున్నావా? అక్కడికి ఇతరులను రానిస్తారా?" అన్నాను కోపంగా.

"తప్పకుండా రానిస్తారు... నన్ను పెళ్ళి చేసుకుంటే ..." అంది నవ్వుతూ.

మొదట ఆమె మాటలు నాకర్థం కాలేదు..

ఆ తరువాత అర్థమై ఆశ్చర్యంగా చూసాను.

నా ముఖంలో భావాలు అర్థం చేసుకొని "నీకిష్టమైతే చెప్పు. పెళ్ళి చేసుకొని కలసి వెళ్ళిపోదాం" అంది.

"వద్దు దీపా.. ఆరోజు మీ నాన్న వచ్చి అడిగినపుడు ఇష్టం ఉన్నా పిరికివాడినై ఆ విషయం ధైర్యంగా చెప్పలేకపోయాను. ఇప్పుడు ఒప్పుకుంటే అంతకన్నా ఆత్మవంచన ఉండదు. నీ ట్రైనింగ్ పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరు. నువ్వు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నాను. సమాజానికి సేవ చేసే అవకాశం సివిల్ సర్వీసెస్‌లో ఎక్కువ. దాన్ని ఉపయోగించుకో... ఇక నా జీవితం అంటావా? చూద్దాం ఏం జరుగుతుందో..." అన్నాను.

ఆ తరువాత మా ఇద్దరి మధ్యా మౌనం...

ఇంతలో పాసింజర్ వస్తున్నట్లు ప్రకటన వచ్చింది.

పాసింజర్ వచ్చి ఆగింది...

దీపాకు భారంగా వీడ్కోలు చెప్పాను.

ఆమె కళ్ళలో చెమ్మగిల్లిన నీరు...

మెల్లగా రైలు కదిలింది.

రాను రాను దీప దూరం కాసాగింది.

చాలాసేపటి వరకు ఆమె చేయి ఊపుతూ కనిపించింది.

అలా కొద్ది క్షణాల తరువాత కనుమరుగైంది.

చాలాసేపటికి నేను మామూలు మనిషినయ్యాను...

"జీవితం అంటే కాసింత నవ్వు, మరికొంత ఏడుపు. పిడికెడు ఆనందం, వీసెడంత దుఃఖం... ఎడతెగని ప్రయాణం" ఎక్కడో నేను చదివిన వాక్యం గుర్తుకొచ్చి బాధ కలిగింది.

■



## నేల దుఃఖిస్తోంది!

పచ్చని కళలతో
కమ్మని కలల్ని ఆరబోస్తూ
కమనీయ అందాల్ని విరబోస్తూ
ప్రకృతి పరువంగా పరవశించేది
నేలంతా నవ్వుల నక్షత్రాల్లా
పక్షుల కువకువలతో
కూనిరాగాలు వినిపించేవి

అడవులు కన్నీటితో వీడ్కోలు పలికాయి
స్వచ్ఛ గలగలల నీటితో
నవ్వుల్ని రువ్విన నదులు
స్వేచ్ఛను కోల్పోయి
ప్లాస్టిక్, కలుషిత నీటితో
కన్నీరు మున్నీరై విలపిస్తున్నాయి

ఇప్పుడు
పల్లె, పట్నం ఏం తేడా లేదు
ఎక్కడ చూసినా కాలుష్యపు కర్కశ కోరలే
నీలిరంగును కోల్పోయిన
బూడిద మేఘాలే
పచ్చదనం లేని చీకటి గుహలే
స్వచ్ఛ గాలి లేని ఎడారి ఛాయలే!

మనిషి మారాలి
తనతో పాటు ఓ చెట్టూ ఉండాలి
ఆ చెట్టులో స్వేచ్ఛగా తిరుగాడే
పక్షులూ నిలవాలి
ఏ తోడూ లేక దిగులుగా దుఃఖిస్తున్న నేలకు
మనిషి అన్ని వనరుల్ని మిగిల్చే నేస్తం అవ్వాలి..!

**- మహబూబ్ బాషా చిల్లెం**
**95020 00415**

## కవితాధార


అక్షరం జ్వలించే దీపిక
నా భావం అందులో ప్రతీక
నిరంతర ప్రవాహం గీతిక
నా మనసు నివేదన వేదిక..!

కవితల విత్తనాలను జల్లి
నేలమ్మ రుణం తీర్చుకుంటా
అక్షర చుక్కను నింగికి విసిరి
కవితా వర్షం కురిపిస్తాను..!

కన్నీటితో అక్షరాలను శుభ్రపరిచి
కాగితాలపై భద్రపరుచుకుంటా
భావచిత్రాలను మనోఫలకంపై గీసి
ఇంద్రధనస్సులో రంగులను అద్దుతాను
కంటితో చూసిన దృశ్యాలను
అక్షర రూపంలో చిత్రించి పంచుతా
పువ్వుల రెక్కల్లో దాగిన తేనెల కోసం
తుమ్మెదల ప్రతి హృదయంపై వాలిపోతా..

కమ్మని కవిత్వంతో అమ్మలా లాలించి
ఆప్యాయంగా చనుబాల రుచి చూపిస్తా
అమ్మ నేర్పిన కమ్మని మాటలతో
అందమైన అక్షర మాలలు అల్లుతాను
చైతన్యానికి సరికొత్త నిఘంటువు కోసం
మానవత్వానికి కొత్త పదం సృష్టిస్తా
అక్షర ప్రమిదలో ఇంధనమై
నా శక్తినంతా ధారవోస్తాను..!

**- కొప్పుల ప్రసాద్**
**98850 66235**



## కవిత

# శూన్యకవిత



- సాంబమూర్తి లండ

96427 32008

ఎట్టకేలకొక
పూలరుతువు నన్ను పలకరిస్తుంది
వసంతాలు నన్నుల్లుకుని తెగ అల్లరి చేస్తాయి
వయసు కొమ్మమీద కోయిలలు వాలి
పాటందుకుంటాయి
అప్పుడే
నా చుట్టూ మొదటి ముళ్ల కంచె మొలుస్తుంది

కొన్ని అనూహ్య మలుపుల తర్వాత
నేనో నదినవుతాను
ఎన్నో పాయలుగా ఉరకలెత్తి
ఎన్నో తీరాలుగా విస్తరించి
దారి పొడుగునా ఉత్సవమై సాగిన కాలం నిమ్మళిస్తుంది
నాలో ఇంకిపోయిన కలలు కొన్ని
తిరిగి రెక్కలు తొడుక్కొని
భుజం మీద సందడి చేస్తాయి
అప్పుడే
నా పరివాహక ప్రాంతం మీద
కొత్త పరిమితుల రేఖలు గీయబడతాయి

నాటకం గబగబా
ఆఖరి అంకానికి పరుగులు పెడుతుంది
కొన్ని నిట్టూర్పులూ కొన్ని నిర్లిప్తతలూ
నస పెడతాయి

పొద్దు గుంకిపోతున్నప్పుడైనా
నీ పాటేదో నువ్వు పాడుకోవచ్చుగా అని
మనసు ఒకటే పోరు పెడుతుంది
ఇక తెగించి రెక్కలు సవరించుకుంటాను
అప్పుడే
కాలం నా చుట్టూ
చిట్టచివరి చీకటి తెర దించేస్తుంది

జీవితం పొడుగునా
ఇంటిల్లపాదికీ
అందమైన కవితలల్లుతూ అలసిన నేను
అప్పుడిక
నా సమాధి మీద చెక్కేందుకొక
శూన్యకవితను రాసిపెట్టుకోవాలి!

## సాహిత్య ప్రస్థానం సెప్టెంబరు 2021 పురస్కారాలు

**కుంచెవొకటి ...**
**కవితకి రూ.500**
కవి : **మెట్టా నాగేశ్వరరావు**

**బతుకు చెట్టు**
**కథకు రూ.500**
రచయిత : **పివిబి శ్రీరామమూర్తి**

■■■

*కవితకి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*కథకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

# కవితలు



## తిరిగొచ్చిన గతం

సుదీర్ఘ విరామం తర్వాత
బాల్య మిత్రుల పలకరింపుతో
నేలకొరిగిన పక్షి ఆయువు పోసుకుని
నింగికెగిరినంత హాయిగా ఉంది...
శిశిరం తను రాల్చిన
ఆకులను తానే స్వయంగా
కొమ్మకు అతికించినంత
ఆనందంగా ఉంది...
దారి తప్పిపోయిన పిల్లాడికి ఆ దారే
తన తల్లి వద్దకు చేర్చినంత తృప్తిగా ఉంది...
చీకటి సంద్రాన్ని ఈదుతున్న నావికుడికి
వెలుగు తీరం కనిపించినంత సంతోషంగా ఉంది
కాలం తను కప్పేసిన గతాన్ని
తానే తవ్వి జ్ఞాపకాలను
శిథిలం కాకుండా అప్పగించిందని
గర్వంగా ఉంది
ఎన్నో అనుభవాలను, అనుభూతులను
ఏరుకున్న నాటి గూటికి
నేడు మళ్ళీ చేరుకున్న
పక్షుల కోలాహలంలా
నా మనసు సందడి చేస్తుంది
చాలా రోజుల తర్వాత
కళ్ళలో ఆనంద భాష్పాలు
ఆత్మీయ ఆలింగనం చేసుకున్నాయి
ఓడిపోయిన కాలం తలదించుకుంది!

- సునీత పేరిచర్ల
83094 20900



## గాయాలగని

ఇచ్చే ప్రేమ నాది
పుచ్చుకునే స్పర్శ నీది
స్వాభిమానాన్ని కాపాడుకోవాలనే వెర్రి ఆత్రం నాది
నా అభిమానాన్ని చంపే అభిజాత్యం నీది
ఐనా నీకూ, నాకూ నడుమ
ఎడ తెగని బంధమే వుంది
ప్రతినిత్యం అనివార్య కలయికే మనది

నా ఎదుగుదలను తుంచేయ గల కఠినత్వమే నీది
తుంచిన కొద్దీ పెరిగే ఆత్మవిశ్వాసమే నాది
మొగ్గతొడిగే నిజాన్ని సైతం అణిచే నైజం నీది
ఏ వివక్షా ఎరుగని కక్ష్యలో భ్రమణమే నాది
కసుగాయల్ని కొరికేసే మృగత్వమే నీది
గాయాల్ని తడుముకుంటూ సాగే
జీవన గమనమే నాది
ఐనా నీకూ, నాకూ నడుమ
కనురెప్ప వాల్చని సాక్ష్యముంది
కనుమూసే వరకు మన ఇరువుర్ని
అక్కున చేర్చుకునే సహనమది..


ఎన్ని సాక్ష్యాలున్నా, ఎన్ని ప్రశ్నలెదురైనా
నీదే ఒప్పునుకుని తిరిగే యజమానివి నువ్వు
గాయాలను(కాల) రాయాలనుకున్నా రాయలేని
మీ జీవన గేయాన్ని..

తనువంతా సంస్కారాన్నద్దుకున్న తరూలతను
వసు గర్భోదయాన్నుదయించిన గలగలను..

- సోంపాక సీత
86393 11050

# వర్గవైరుధ్యం సృష్టించిన నెత్తురు నది

- వి.రెడ్డెప్ప రెడ్డి
94400 44922




**తమిళ మూలం : కురితిప్పునాల్,**
**రచయిత : ఇందిరా పార్థసారథి,**
**ఆంగ్లానువాదం : ఇందిరా పార్థసారథి**
**తెలుగు అనువాదం : రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

**2020** ఆక్స్‌పామ్ లెక్క ప్రకారం.. మన దేశంలో 42.5 శాతం సంపద ఒక శాతం సంపన్నుల వద్ద ఉంది. 50 శాతం జనాభా వద్ద 2.8 శాతం సంపద మాత్రమే ఉంది. ఈ అసమానతలు ఇంకా పెరిగితే దేశం ఏమౌతుంది? బాంబులతో నింపిన జీపును ముంబాయిలో వీధి చివరన నిలిపి, ఆసియాలోనే అత్యంత సంపన్నుడిని ఒక సర్కిల్ ఇనస్పెక్టర్ భయపెట్టే స్థాయికి దేశం ఎదిగింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశం ఇంకెంత ఎదిగేనో?

వ్యవసాయాధారిత జీవిత నేపథ్యంలో భూములు లేని కుటుంబాలకు సొంత పని ఉండదు. మరోచోట పని దొరకదు. అప్పు పుట్టదు. కడుపు నింపుకునే పరిస్థితి ఉండదు. మనిషిగా గుర్తింపు కనీస స్థాయికి పడిపోయి ఉంటుంది. భూములు లేని పేదవాళ్ళ పరిస్థితులు ఇంత దయనీయంగా ఉంటే భూములు ఉండి కూడా ఏ మాత్రం మెరుగ్గా లేని వారూ ఈ దేశంలో తక్కువేమీ కాదు. భారతీయ గ్రామాల్లో 10 శాతం ఉన్నత వర్గాలు 60 శాతం భూమి విలువపై హక్కు కలిగి ఉండటం ఒక పార్శ్వమైతే, ఆర్థిక నిచ్చెన అడుగునే మిగిలిన 50 శాతం గ్రామీణులు కేవలం 3 శాతం భూమి విలువకు సొంతదారులు కావడం మరో పార్శ్వం. భూసంస్కరణ చట్టాల్లోని లొసుగులు ఇందుకు కారణమన్నది అసలు నిజాన్ని దాచడమే!

గ్రామాల్లో ఆర్థిక అసమానతలకు కొలమానం కుటుంబాల మధ్య భూవిస్తీర్ణంలో తేడాలు సూచిస్తాయని చెప్పుకునే రోజులు పోయాయి. భూమి విస్తీర్ణంపై కాక, భూమి విలువపై ఆధారపడి అసమానతలు లెక్కించాల్సిన సందర్భం ఇది. వాణిజ్య పంటలకు అనువైన, నీటి వసతి కలిగిన సారవంతమైన భూములు ఎవరి చేతుల్లో ఉంటే వారి ఆర్థిక స్థాయి లేదా ఆర్థిక విలువ, ప్రభుత్వంచే పేదలకివ్వబడిన డి ఫార్మ్ పట్టాభూములు, డొంక పోరంబోకులు, పోడు భూముల కంటే కనీసం పదుల రెట్లు అధికమన్నది నిజం. భూమి విలువలో అంతర్లీనంగా ఉన్న భారీ వ్యత్యాసాలను బయట ప్రపంచానికి దాయడంలో పాలకులు విఫలమయ్యారనడానికి వ్యవసాయరంగంలోకి పారిశ్రామికవేత్తల ప్రవేశమే నిదర్శనం. భూమి ద్వారా సంక్రమించిన అసమానతలు ఆర్థిక అంశాలకే పరిమితం కాలేదు. భూమి హక్కులో అసమానతలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక, ప్రాదేశిక, పర్యావరణ అసమానతలకు కారణమన్నది జీర్ణించుకోరాని నిజం. వీటికితోడు ఎన్నో తరాలుగా పేరుకుపోయిన కుల అహంకారం కొందరిది, అన్ని తరాలుగాను ఆ అహంకారానికి తలొంచిన దైన్యం ఇంకొందరిది. ఈ అంశాలే ఉన్నవారికి లేనివారికి మధ్య ద్వేష భావాలకు మూలం. గ్రామ ప్రాంతాల్లో అడుగున మిగిలిన దళితుల పట్ల ఉన్నత వర్గాల దమన నీతి ఈ ద్వేష భావాల రూపురేఖలతో నిత్యం బయటపడుతూనే ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రావణ కాష్టాలుగా ముద్రపడ్డ కారంచేడు, టి.చుండూరు, పాదిరికుప్పం సంఘటనలు

శూద్రులలో ఉన్నత వర్గాలు, దళితుల మధ్య ద్వేష స్వరూపానికి ప్రతీకలు. తమిళనాడు తెవర్స్, పల్లార్స్ మధ్య ఘర్షణలు వెనక బడ్డ కులస్తులకు దళితులతో సయోధ్య మిధ్యేనని చెప్పడానికి సాక్షీభూతాలు. ఉత్తరాదిన పశువులను కబేళాలకు తోలు తున్నారనే నెపంతో దళితులను పశువులకంటే హీనంగా శిక్షించిన ఉన్మాదులకు వ్యవస్థల నుంచి ఇంకా రక్షణ దొరకడం జీర్ణించు కోలేని నిజాలు. భారత శిక్షాస్మృతి అటువంటి మృగతత్వ వాదులను శిక్షించడంలో తొందర పడకపోవడం మానవ మాత్రులకు ఆక్షేపణీయం కాకపోదు. ఇటువంటి వ్యవస్థలు గ్రామీణ జీవితాలను నిర్దేశిస్తుండడంతో నెత్తురు నదుల ప్రమాదం పొంచి ఉంటాయనేది కొంగులో నిప్పు దాచుకోవడం లాంటిదే.

నెత్తురు నది ఏ దేశంలోనూ, ఏ వ్యవస్థలోనూ పారకూడదని విజ్ఞుల అభిమతం. తాత్కాలికంగా అలాంటి నది రూపుదిద్దు కున్నా సజీవరూపంలో పారి జనసముద్రంలో కలిసిపోవాలి. దానికో ముగింపు ఉండాలి. నెత్తురునది ఏర్పడి పారకపోతే ఏమవుతుంది? బలిష్టమైన ప్రాణులు నదిని ఆక్రమించు కుంటాయి. నదిలో బతికే బక్క ప్రాణులను ఆహారంగా చేసుకుని బతకడం అలవాటు చేసుకుంటాయి. అయితే బలహీనుడు, బలహీనుడిగానే మిగిలిపోడు. పదిమంది బలహీనులు కలిస్తే ఒక్క బలవంతుణ్ణి మట్టి కరిపించడం సహజ పరిణామమే.

నెత్తురు నదులు ఏర్పడడానికి అవకాశాలు కల్పించే పరిస్థితులు మన దేశంలో సర్వవ్యాప్తం. ఆర్థిక వైకల్యమనదగు అసమానతలు ఒకవైపు, సామాజిక వైకల్యమనదగు కులవివక్ష మరోవైపు, గ్రామీణ ప్రాంతాలను చెట్టుకు వేలాడదీసి తూకం పడుతుంటాయి. చట్టాల అమలులో నిర్లజ్జ, నిర్భీతితో వ్యవహరిస్తూ బలాఢ్యుడి వైపు తూకం పెంచుతూ, చట్టాలను కాపాడవలసిన వ్యవస్థలు సామాన్య జీవితాలు అతలాకుతలం కావడంలో దోహదపడుతుంటాయి.

అలాంటి ఒక నెత్తురు నదిలో జీవిస్తూ ఒకరినొకరు హరించివేయాలనే తపనతో పోరాడే బలాఢ్యుడు, బలహీనుల మధ్య జీవన పోరాటాన్ని పరిచయం చేస్తుంది 'నెత్తురు నది' నవల. 'మహాప్రస్థానం' యోగ్యతాపత్రం రాస్తూ 'కృష్ణశాస్త్రి తన బాధను అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు' అంటాడు చలం. రచయిత బడుగుల బాధను ఈ నవలలో పలికిస్తాడు. 'చివరికి మిగిలేది' ముందుమాటలో బుచ్చిబాబు 'పాశ్చాత్య దేశాల్లో నవల జీవితం మూడు మాసాలుట' అంటాడు. ఆ దేశాల్లో ఓ సమస్యపై నవల వస్తే, ఆ సమస్యపై పరిశోధనలు జరిగి, సమస్యల పరిష్కారం వైపు అడుగులు పడతాయి. కానీ మనదేశంలో నవలల్లో ప్రస్తావించిన అంశాలను పాలకులు పట్టించుకోరు. పరిష్కారాలను వెతకరు. ఎవరైనా పరిష్కారాలు చూపినా తలకెక్కించుకోరు. పరిష్కరించ డంతో ఉపయోగాన్ని గుర్తించరు. ఎందుకంటే ఈ దేశంలో ప్రజలు ప్రజలు కాదు, ఓటర్లు మాత్రమే! అందుకే ఇలాంటి నవలలు మనదేశంలో దశాబ్దాలైనా జీవిస్తాయి.

'మైనా' నవల గురించి శీలా వీర్రాజు, 'ప్రయాణంలో ఏవో రెండు ముఖ్య బిందువులను గుర్తుపెట్టి, ఒక బిందువు వద్ద బయలుదేరి, దారిలో కనిపించే వాటన్నిటినీ కుతూహలంతో చూసి, ఒక్కొక్కసారి కాసేపు నిలబడి, వెనక్కి తిరిగి చూసి, మళ్ళీ కదిలి రెండో బిందువును చేరుకున్నాను' అంటాడు. నవలలో కథకు ఓ ప్రారంభం, ఓ ముగింపు ఉండవంటాడు. ఈ నవల కూడా అంతే. కథకు మొదలు, అంతం దొరకవు. ప్రవహించే నదిలోని వరద ఉధృతిని, ఆ ఉధృతిలో ఎగిసిపడే రాక్షస కెరటాల్ని, కెరటాల సుడిలో పడి కొట్టుకుపోయే సామాన్యుడి జీవన పరిస్థితులను చూపిస్తుంది. సమస్యలకు పరిష్కారాలను ప్రభుత్వ వ్యవస్థల్లో వెతకడం కంటే సమాజంలోనే వెతుక్కోవాలనే ధోరణిని సమర్థిస్తాడు రచయిత.

అనువాదానికి సర్వజనీనమైన నవలను ఎన్నుకోవడం సాహిత్య కళ. ఇందిరా పార్థసారథి గారి 'కురుతిప్పునల్' తమిళ నవలను ఎన్నుకుని తన జీవన, సాహిత్య దృక్పథాన్ని చెప్పకనే చెప్పారు రాచపాళెం గారు.

ఇక కథలోకి వస్తే, తన మిత్రుడు గోపాల్‌ని వెతుక్కుంటూ శివ చేసే బస్సు ప్రయాణంతో మొదలవుతుంది. పాఠకుడు బస్సు ప్రయాణంలో భాగమైపోతాడు. ప్రయాణంలోనే తమిళనాడుని శాసించే సినిమాలు, రాజకీయాలు, మత అంశాలపై పాఠకుడు కూడా అవగాహన ఏర్పరుచుకుంటాడు. గ్రామంలో కన్నయ్య నాయుడనే భూస్వామి ఒకవైపు రొమ్ము విరుచుకు నిలబడితే, పేద రైతులు, కూలీల వైపు రామయ్య నిలబడి పోరాడుతుంటాడు. విప్లవ భావజాలాన్ని నమ్మే రామయ్య వైపున్న న్యాయాన్ని నమ్మి ఆ వర్గంలో తాను ఒకడై పోతాడు గోపాల్.

ధన బలాన్ని, కుల బలాన్ని, వృత్తిరీత్యా రౌడీలను, చేతిగజ్జికి అలవాటుపడ్డ పోలీసులను, అధికార పార్టీ బలాన్ని, గ్రామంలోని స్త్రీ పురుష సంబంధాలను, చివరకు తల్లి మరణాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకోగలిగిన తెలివితేటలతో పాటు, కామ విశృంఖలత కలిగిన భూస్వామి కన్నయ్య నాయుడు

ఒకవైపు ఉంటాడు. ఆకలి, దారిద్ర్యం వెంటాడుతున్నా మార్క్సిస్ట్ భావజాలాన్ని నమ్ముకున్న రామయ్య, గోపాల్, కనకసభ, సభాసుందరం పేద రైతుల వైపు ఉంటారు. రామయ్యతో పాటు పోరాడే గోపాల్‌కు స్త్రీల విషయంలో బలహీనతలు ఉండటం మరో పార్శ్వం. గోపాల్ చేసిన తప్పులను కథలో భాగం చెయ్యడం నిజ జీవిత ప్రతీక.

గ్రామ రైతులు కూలీ విషయంలో న్యాయాన్ని అడిగితే, ఇతర గ్రామాల నుంచి కూలీలను పిలిపించుకుని, ఎదురు తిరిగిన రైతులపై ద్వేషంతో, గ్రామాన్ని తగలబెట్టించి, అందులోకి స్త్రీలు, పిల్లలను తోసి భూస్వామి తన పంతాన్ని, ధనశక్తిని, పలుకుబడిని నెగ్గించుకుంటాడు. గ్రామస్తుల నెత్తురుతో కూడిన ప్రవాహంలోకి దిగిన గోపాల్, పరుశురాముడి లాగా పోరాటం చేస్తానని తీర్మానించుకోవడంతో నవల ముగుస్తుంది.

నేరస్తులనే అనుమానంతో పేదవాళ్లను స్టేషనుకు రమ్మనే పోలీసులు, భూస్వామి నేరస్తుడయినా అతడింటికే వెళ్లి విచారించడం లాంటి జీవిత సత్యాలను ఆవిష్కరించడంలో రచయిత సఫలమయ్యాడు. 'భూముల్ని నది నీళ్ళతో పండించడు. దళితుల నెత్తురుతో పండిస్తాడు.','అది సముద్రపు హోరులాగా ఉంది. ఇది చివరి ప్రళయం 'యుగాంత తాండవం'. దిక్కులు పగిలిపోతాయి. ఉరుములు గర్జిస్తాయి. అనంత, బాహిర, విశాల విశ్వంలో అసంఖ్యాక పిశాచాలు పాటలు పాడుతూ నృత్యం చేస్తాయి. సందేహం లేదు.. ఇది భూగోళ నిర్మూలన నృత్యం. సందేహం లేదు. అధికార పిశాచాలు లయబద్ధమైన నిర్మూలన పాటలో భయంకరంగా గర్జిస్తున్నాయి.'లాంటి మాటలు పాఠకుడిని ఉద్వేగానికి లోను చేస్తాయి. "దేశమంతా విప్లవం వస్తే తప్ప, చట్టాలు మారవు. పరిస్థితులు మారవు.", "విప్లవం ఎప్పుడూ ముగిసిపోదు. ముగిసిపోయిందంటే అది విప్లవం కాదు.", "సామాజిక విప్లవం వచ్చే ముందు దానిని ఓడించడానికి అవతార సిద్ధాంతం పుట్టింది.", "అధికారంలో ఉండేవాళ్ళ చొక్కాలకు లెక్కలేనన్ని జేబులున్నాయి." లాంటి జీవిత సత్యాలు నవల నిండా కనబడతాయి.

అనువాదంలో దొర్లిన ఒకటి రెండు చిన్నతప్పులు కొట్టొచ్చినట్లు కనబడ్డాయి. తంజావూర్, తంజావూరు అనే ఊరి పేరు లాగానే, సెమ్మలర్, చెమ్మలర్ పదాలు, ఉండాడు, ఉన్నాడు అనే పదాలు వేర్వేరు చోట్ల వేర్వేరుగా పొటమరించాయి. 'ఉంటారు'లోని 'ఉ' ఒక లైనులో మిగతా అక్షరాలు మరో లైనులోకి, అలాగే 'పందిళ్ళు', 'రాళ్ళు' పదాల్లో 'ళ' వత్తును తరువాతి లైనులోకి నెట్టిన ముద్రారాక్షసాలు ఉన్నాయి. రాచపాళెం గారు 'ప్రాచీన, నవీన సాహిత్యాలతో సజీవ పరిచయం ఉన్నవాడు.. ప్రామాణిక గ్రంథాలు రాసి అకడమిక్ రంగంలో పేరు తెచ్చుకున్నవాడు' అన్న వల్లంపాటి గారి మాటలు అక్షర సత్యాలని ఈ రచనతో మరోసారి ఋజువైంది. ఇంత చక్కటి తెలుగు అనువాదాన్ని కేంద్ర సాహిత్య అకాడెమి ప్రచురించడం హర్షించదగ్గ విషయం. పలుమార్లు చదివి, చదివించదగ్గ నవల 'నెత్తురు నది'. దాచుకోదగ్గది కాదు. ■

## వెలుగు దృశ్యం

రెక్కలపక్షి ఎగిరిపోయింది
కదిలే సూర్యబింబం మాయమైపోయింది
రెక్కలు ఎవరిని అలుముకున్నాయో
వెలుగు ఎవరికి చేరిపోయిందో
ఇక్కడ మాత్రం పెను చీకటి కురుస్తోంది!

విరిసిన పువ్వు రాలిపోయింది
విచ్చుకున్న నవ్వు ముడుచుకుపోయింది
పరిమళం ఎక్కడ దాగిపోయిందో
ఆనందం ఎక్కడ చేరిపోయిందో
ఇక్కడ మాత్రం స్తబ్దత వ్యాపిస్తోంది!



ఒక్కో క్షణం
వేలికొసలనుంచి జారిపోతుంది
ఒక్కో అనుభవం
మదిలో చేరి నిండిపోతుంది!
కమ్మని రోజులు లెక్కపెట్టడం
జ్ఞాపకాలను నెమరువేయడమనేవి
భారమైన కాలంలో
మోడుబారిన వృక్షానికి
చిగురించడం నేర్పిస్తుంది!

చీకట్లో కళ్ళు మూసుకుంటేనే
వెలుగు దృశ్యం కనబడుతుంది
వేదనలో కన్నీటి రాగమెత్తితేనే
హృదయం సేదతీరుతుంది!

**- పుట్టి గిరిధర్**
94914 93170



# అనువాదాల వల్ల భాషా సంస్కృతులు బలోపేతం



**కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత**

**రంగనాథ రామచంద్రరావు**

**కర్నాటక రాష్ట్రం చామరాజనగర్ నుంచి వలసొచ్చి కర్నూలు జిల్లా ఆదోనిలో హోటల్ వ్యాపారంతో స్థిరపడ్డ కుటుంబంలో 28.04.1953న రంగనాథ రామచంద్రరావు జన్మించారు. తెలుగు, కన్నడ భాషల్లో పట్టున్న ఆయన స్వతహాగా కథకులు. తెలుగు కథాసాహిత్యంలో దింపుడుకల్లం పేరుతో ఆయన రాసిన కథ సంచలనమైంది. వృత్తిరీత్యా గణిత ఉపాధ్యాయుడైన రంగనాథ రామచంద్రారావు అనువాద సాహిత్యంలో చేసిన విశిష్టమైన కృషికి నిదర్శనంగా ఈ ఏడాది కేంద్రసాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. వృత్తి పట్ల అంకితత్వం, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడుగా అందరికీ సుపరిచితులు. తెలుగు- కన్నడ భాషల వారధిగా అను వాదాలలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న రచయిత. రంగనాథ రామచంద్రారావుకు 2001లో జిల్లా ఉత్తమ ఉ పాధ్యాయ పురస్కారం, 2007 నవంబర్ 1న తెలుగు కళాసమితి కర్నూలు పురస్కారం, 2008లో సాహితీ మిత్రులు మచిలీపట్నంవారి పురస్కారం, కొడవలూరి బలరామయ్య అవార్డు, 2011లో పఠాభి కళాపీఠం అవార్డు, బాలసాహిత్య పరిషత్ హైదరాబాద్ వారి బాలసాహితీరత్న అవార్డు, 2013లో రాళ్ళు కరిగే వేళ అనువాద గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ అనువాదకుడి అవార్డు, నేనున్నానుగా రచనకు జివిఆర్ సాహితీ కిరణం వారి పురస్కారం లభించాయి. తిక్క లక్ష్మమ్మ అవ్వకథ, ఓ చంటిగాటి ఇంటి కథ అనే టెలిఫిల్మ్‌లో నటించి నటుడుగానూ మెప్పించారు. 2011లో రిటైర్ అయిన వీరు పూర్తికాలం రచనలకే వెచ్చిస్తూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అనువాద సాహిత్యంలో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం పొందిన సందర్భంగా ఆయనతో ముఖాముఖి..**

**గణిత ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైరైన మీరు అనువాద సాహిత్యంలో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం పొందటం పట్ల ఎలా ఫీలౌతున్నారు.?**

చాలా సంతోషంగా. మాటల్లో వ్యక్తం చేయలేనంత సంతోషంగా.

**మీ కుటుంబ నేపథ్యం?**

సాధారణమైన మధ్య తరగతి కుటుంబం. సుమారు 80 ఏళ్ళ క్రితం కర్ణాటక నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడ్డ కుటుంబం. నాన్న బహుభాషా కోవిదుడు. అంటే సాహిత్యంలో కాదు. బతుకుతెరువు కోసం సొంత నేలను వదిలి అనేక చోట్ల తిరిగి చివరికి ఆదోని వచ్చి చేరారు. దాంతో ఆయన ఏ ప్రాంతానికి వెళితే ఆ భాషను నేర్చుకునేవారు. ఇప్పుడు ఆలోచిస్తే ఆయన ప్రయత్నించి నేర్చుకున్నారా? లేదా భాష తనంతట తాను వచ్చేసిందా? అని అనుమానం కలుగుతుంది. అందుకు కారణమేమిటంటే ఆయన తమిళం మాట్లాడితే తమిళుడు మాట్లాడినట్లే ఉండేది. ఉర్దూ మాట్లాడితే ముస్లిం అనుకోవాలి. మరాఠీ మాట్లాడితే మరాఠీ వ్యక్తి అనుకోవాలి. ఆ యాక్సెంటే అంత పర్‌ఫెక్ట్‌గా ఉండేది. అమ్మ చాలా చక్కగా పాడేది. బహుశా అందువల్లనే నాకు సంగీతం పట్ల ప్రేమ. శ్రీమతి వడుగూరి లక్ష్మీకుమారి సాహిత్యం పట్ల అభిరుచి కలిగిన

మనిషి. ఆమె సుమారు 8 పుస్తకాలను తెలుగు నుంచి కన్నడలోకి అనువదించింది. కన్నడ నుంచి తెలుగుకు, తెలుగు నుంచి కన్నడకు అనువదించగలదు. మా పెద్దమ్మాయి ఆంగ్లంలో నవలలు రాస్తూ సాహిత్య కృషి చేస్తూ వుంది. చిన్నమ్మాయి సంగీతంలో కృషి చేస్తుంది. చక్కగా పాడు తుంది. ఫ్లూట్ వాయిస్తుంది.

**మీరు ఎన్ని భారతీయ భాషల్లోంచి అనువాదాలు చేశారు?**

కన్నడ, హిందీ భాషల నుంచి తెలుగులోకి అనువాదం చేశాను. తెలుగు నుంచి కొన్ని కథలూ, కవిత్వమూ కన్నడలోకి అనువదించాను. డా.రావి రంగారావుగారి మినీ కవితల్ని కన్నడలోకి అనువదించాను. పుస్తకంగా వచ్చింది. ప్రస్తుతం ఎన్.గోపి గారి కవితా సంపుటిని కన్నడలోకి అనువదించాను. త్వరలో ప్రింటింగ్‌కు వెళుతుంది.

**మీరు స్వతహాగా కథకులుకదా.. అనువాదరంగం ఎంచుకోడానికి కారణం?**

బహుశా నేను చిన్న వయసులోనే చదివిన శరత్ సాహిత్యం కావచ్చు, రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యం కావచ్చు. బంకించంద్ర నవలలు కావచ్చు. బొల్లిముంత శివరామకృష్ణ, రెంటాల గోపాలకృష్ణ, గద్దె లింగయ్య ... ఇంకా ఎందరి అనువాదాలో చదవటం వల్ల అనువాదాల పట్ల ప్రేమాభిమానాలు ఏర్పడ్డాయి. మొదట్లో ఆసక్తితో మొదలు పెట్టిన అనువాదాలు రచన రాను రాను సీరియస్‌గా మారి కన్నడ నుంచి మంచి సాహిత్యాన్ని, వైవిధ్యమైన రచనలను తెలుగు పాఠకులకు అందించాలనే ఉద్దేశ్యంతో అనువాదాన్ని గంభీరంగా తీసుకున్నాను. ఆ కారణంగానే ప్రసిద్ధ సమకాలీన కన్నడ కథలు, నలుపు తెలుపు– కొన్ని రంగులు పేరిట కన్నడ మొదటి ఆధునిక రచయిత్రి కొడగిన గౌరమ్మ మొదలు ఇప్పటి రచయిత్రుల వరకు కొందరిని ఎన్నుకుని ఒక కథల సంకలనాన్ని, కన్నడ నుంచి సమకాలీన దళిత కథల సంకలనాన్ని తెలుగులోకి తెచ్చాను.

**ప్రస్తుతం అనువాద సాహిత్యం ఎలా ఉంది?**

బాగుంది. అనేక భాషల నుంచి అనువాదాలు వస్తు న్నాయి. అందువల్ల వల్ల ఇతర భాషల్లోని సాహిత్యం గురించి, అక్కడి జీవితాల గురించి తెలుస్తుంది. అనువాదకులూ పెరిగారు. వైవిధ్యమైన రచనలు ఇతర భాషల నుంచి తెలుగులోకి వస్తున్నాయి.

**మీరు పుట్టి పెరిగింది తెలుగునాడు... మీ మాతృభాష కన్నడ.. అంతర్జాతీయ భాషల నుంచీ అనువాదాలు చేసినట్లున్నారు?**

మా పూర్వీకులు కర్నాటక నుంచి వలస వచ్చి ఇక్కడ అంటే కర్నూలు జిల్లా ఆదోనిలో సెటిల్ అయినవారు. నేను ఇక్కడే అంటే ఆదోనిలో పుట్టాను. ఇక్కడే చదువుకున్నాను. తెలుగులో చదువుకున్నాను. ఇక్కడే ఉద్యోగం చేశాను. ఇక్కడే రిటైర్ అయ్యాను. నా మటుకు కన్నడ, తెలుగు రెండూ నాకు మాతృభాషలే. ఇక అంతర్జాతీయ భాషలనుంచి అనువాదాలు చేసినట్టున్నారు అని అడిగారు. నిజానికి అందరికీ అన్నీ భాషలు రావు. అనువాదం– అనే ప్రక్రియ ఉండటం మన అదృష్టం. కాబట్టి అనేక భాషల సాహిత్యం మనకు అందుబాటులోకి వస్తోంది. నాకు కన్నడ, హిందీ, ఇంగ్లీషు వచ్చు. అయితే ఏ ఉర్దూ కథనో, ఏ మరాఠీ కథనో, ఏ రష్యన్ కథనో, ఏ కోస్టారికా కథనో, అనువాదం చేయటం కష్టం. అసాధ్యం. అయితే నాకు తెలిసిన భాషల్లో ఈ కథలు దొరికితే నేను చేయగలను. అలా అనేక విదేశీ భాషల కథలను నేను తెలుగులోకి తీసుకుని రావటం జరిగింది. దీనికి ముఖ్యంగా ఉండవలసింది ఆసక్తి. తెలుగు పాఠకులకు నేను చదివింది అందించాలనే తపన. అంతే.

**ఇప్పటివరకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన రచనలు ఎన్ని అనువాదాలు చేశారు. ఎవరెవరివి చేశారు?**

8 రచనలను చేశాను. వ్యాసరాయ బల్లాళగారి 'బండాయ' (తిరుగుబాటు), పి.లంకేశ్ గారి 'కల్లు కరుగువ సమయ' (రాళ్ళు కరిగే వేళ), డా. కరీగౌడ బీచనహళ్ళి గారి 'పూర్ణచంద్ర తేజస్వి –బతుకు మత్తు బరహ (పూర్ణచంద్ర తేజస్వి, జీవితం– సాహిత్యం, డా. శాంతినాథ దేసాయిగారి ఓం ణమో (ఓంణమో), డా.కుం.వీరభద్రప్పగారి అరమనె (అంతఃపురం), డా. శంకరమోకాశి పుణేకరగారి అవధేశ్వరి (అవధేశ్వరి), శ్రీనివాస వైద్య గారి హళ్ళ బంతు హళ్ళ (వాగు వచ్చింది వాగు), డా. విజయాగారి 'కుది ఎసరు' (మరిగే ఎసరు) (అచ్చులో), వడ్డా రాధన (ఇందులో రెండు కథలు అనువదించాను)

**జ్ఞానపీఠ పురస్కార గ్రహీత యు.ఆర్ అనంతమూర్తిగారి రచనలు అనువాదాలు చేశారనుకుంటా ...**

అవును. నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం కన్నడ నుంచి యు.ఆర్. అనంతమూర్తిగారి భారతీపుర (భారతీపురం) చేశాను. ఛాయ రిసోర్స్ సెంటర్ వారి కోసం అవస్థె (అవస్థ) చేశాను. త్వరలో రాబోతుంది. మరొక ప్రచురణ సంస్థ కోసం యు.ఆర్.

అనంతమ్మూగారి కథల సంపుటి తెచ్చే ప్రయత్నంలో ఉన్నాను.

**'ఓం ణమో' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికయ్యింది. ఈ నవలాకారుడి ప్రత్యేకత... ఈ నవలలోని ప్రత్యేకత?**

"ఓం ణమో" నవలా రచయిత శ్రీ శాంతినాథ దేసాయి గారు కన్నడ నవ్య సాహిత్యోద్యమంలో అత్యంత ప్రతిభావంతులైన రచయిత. గొప్ప పండితులు. ఉపాధ్యాయులుగా పనిచేశారు. ప్రొఫెసర్‌గా ఉన్నారు, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. కువెంపు విశ్వవిద్యాలయానికి మొదటి వైస్ ఛాన్సెలర్‌గా సేవలు అందించారు. ఆయన కవిగా, కథకులుగా, విమర్శకులుగా, అనువాదకులుగా, సంపాదకులుగా బహుముఖ ప్రతిభావంతులు. ఆయన 'ముక్తి' నవల ద్వారా కన్నడ నవలా రంగంలో నూతన ద్వారాలు తెరిచివారని చెప్పవచ్చు. 'ఓం ణమో' ద్వారా కన్నడ కాల్పనిక రచనల్లో కొత్త కోణాన్ని చూపారు. ఈ నవలలో మూడు తరాల ఒక జైనుల కుటుంబ కథను చిత్రించారు. జైనుల సిద్ధాంతాలు, ఆచారాలు, ధర్మం, సంస్కృతి, సమాజం, సంబంధాలలో చిక్కుకుని, తన ఉనికిని అన్వేషించే మనిషి తపన ఈ నవల ఇతివృత్తం అని చెప్పవచ్చు. జైన ధర్మం గురించి లోతైన చింతన, ఆచారాల, తత్వాల ఘర్షణ, వ్యక్తిగత స్వాతంత్ర్యపు అవసరం. ఇప్పటి పరిస్థితులు అన్నిటినీ రచయిత సజీవమైన పాత్రలతో పాఠకులను ఆలోచనలకు గురిచేస్తారు. శాంతినాథ దేసాయిగారి విలక్షణమైన కథనశైలి, దట్టమైన వివరాలతో చిత్రించే ఆయన కథాశిల్పం వల్ల ఈ కృతి కన్నడలోని గొప్ప నవలల వరుసలో చోటు చేసుకుంది.

**మీరు అనువాద రంగంలోకి రావడానికి స్ఫూర్తి ఎవరైనా ఉన్నారా?**

అనువాద రంగంలోకి రావడానికి ఎవరు స్ఫూరినిచ్చారో చెప్పడానికి ముందు సాహిత్యం పట్ల నాకు కలిగిన ఆసక్తిని క్లుప్తంగా వివరిస్తాను. నేను 6 వ తరగతిలో ఉండగా (1963-64), మా పక్కింట్లో ఉన్న అన్న రోజూ నన్ను బ్రాంచి లైబ్రేరీకి వెంటబెట్టుకుని వెళ్ళేవాడు. అక్కడ బాలసాహిత్యం పుస్తకాలతో పరిచయం ఏర్పడింది. అలా పుస్తకాలతోటి ఏర్పడిన స్నేహం రోజు రోజుకూ పెరిగి, కథల పుస్తకాలకు, నవలలకు, శరత్ సాహిత్యానికి, రవీంద్ర సాహిత్యానికి విస్తరించింది. కాలేజి చేరే సరికి ఎన్ని పుస్తకాలు చదివానో! అదే సమయంలో మా పాఠశాలలోని హిందీ మాస్టారు సాయంకాలం పూట హిందీ ప్రేమీ మండలికి తీసుకుని పోయి, మాచేత ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, విశారద ఇలా పరీక్షలు కట్టించారు. ఆ సమయంలో మాకు హిందీలో ఒక కథల సంపుటి పాఠ్యాంశంగా ఉండేది. శ్రీ గోవింద్ వల్లభ్ పంత్‌గారి మిలన్ ముహూర్త్ కథ ఉండేది. ఆ రోజు ఆ కథ విని ఎంతగా స్ఫూర్తి చెందానంటే ఇంటికి వచ్చి రాత్రికి రాత్రి ఆ కథను అనువదించి తులసీబాయి మేడమ్‌కు చూపించాను. ఆమె ఆశ్చర్యపోయి ఆ అనువాదాన్ని నా చేత క్లాసులో చదివించి నన్ను అభినందించారు. అది నాకు మొదటి ప్రోత్సాహం. కాలేజిలో అడుగు పెట్టాక శ్రీ అనంత్ కమల్‌నాథ్ పంకజ్ గారు హిందీ లెక్చరర్. ఆయనకు ఉర్దూ, కన్నడ తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పాండిత్యం ఉన్నవారు. పైగా రచయితలు, అనువాదకులు. ఆయన పరిచయం, ప్రోత్సాహంతో కాలేజిలో ఉండగానే అనేక కథలు హిందీ నుంచి అనువదించాను. నా మొదటి అనువాద కథ 'స్రవంతి'లో (దక్షిణ హిందీ భాషా ప్రచార సభ వారు ప్రచురణ) ప్రచురింపబడింది. చాలా కథలు అప్పట్లో విషయవాడ నుంచి వస్తున్న 'ప్రగతి' వార పత్రిలో వచ్చాయి. డిగ్రీ తరువాత బి.యి.డి. చేయడానికి మైసూరు రీజనల్ కాలేజికి వెళ్ళాను. అక్కడ మాకు శ్రీ ఎస్.ఎల్. భైరప్ప గారు పాఠాలు చెప్పే ప్రొఫెసర్. కన్నడ సాహిత్యంలో గొప్ప పేరున్న రచయిత. అక్కడ నాకు శ్రీకృష్ణ ఆలనహళ్లి, దేవనూర మహాదేవ, వీరభద్ర మొదలైన రచయితల గురించి వారి రచనల గురించి తెలిసింది. అలా కన్నడ సాహిత్యంతో గాఢమైన పరిచయం, సంబంధం ఏర్పడింది. శ్రీకృష్ణగారి కథలు, కవితలు అనువదించడం జరిగింది. వారి కథలు ఆంధ్రజ్యోతిలోను, కవితలు స్రవంతిలోను, భారతిలోను ప్రచురితమయ్యాయి. రాను రానూ నేను పూర్తిస్థాయి కన్నడ అనువాదకుడైపోయానేమో! అయితే 'విపుల'కు మాత్రమే కన్నడ నుంచి, హిందీ నుంచి, ఆంగ్లం నుంచి సుమారు 120 కథలు చేశాను. ఈ మధ్యన శరణ్‌కుమార్ లింబాళెగారి 'అక్రమసంతానం', 'దళిత బ్రాహ్మణుడు', 'రాచరికం' నవలలు హిందీ నుంచి చేసినవే.

**ఇప్పటివరకు కథలు, నవలలు, ఆత్మకథలు మాత్రమే అనువదించారు. కవిత్వం అనువదించకపోడానికి కారణం?**

కవిత్వానువాదం మొదట్లో చేశాను. ఇతర భాషల్లోంచి నేను చేసిన కవితలు కొన్ని పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అందులో ప్రజాశక్తి ఆదివారం అనుబంధం ఒకటి. సూర్య, విశాలాక్షి,

పాలపిట్ట మొదలైన పత్రికల్లో వచ్చాయి. కన్నడ నుంచి కవితా సంపుటాలను తీసుకుని రాకపోవడానికి ప్రత్యేక కారణమంటూ లేదు. అయితే కథా సంపుటాలను ప్రచురించేలా కవితా సంపుటాలు ప్రచురించే పబ్లిషర్స్ దొరుకుతారా? కవితా సంపుటాలను తగిన సంఖ్యలో రీడర్స్ కొంటున్నారా? అలాంటప్పుడు ఎవరు ప్రచురించాలి? అనువాదకుడే ప్రచురించాలా? ప్రచురించి ఏమి చేయాలి?

**ఇతర భాషల్లోంచి కన్నడలోకి అనువాదాలు ఎక్కువ వస్తాయని విన్నాను..**

తెలుగులోనూ ఎన్నో అనువాదాలు వచ్చాయి. శరత్ సాహిత్యం కానీ, రవీంద్రుని సాహిత్యం కానీ, బంకించంద్రది కానీ, ఆంగ్ల సాహిత్యానువాదాలు చాలానే వచ్చాయి. కన్నడలోనూ అలాగే వచ్చాయి. అయితే భారతీయ భాషల్లోంచి కన్నడలోకి వచ్చినన్ని అనువాదాలు తెలుగులో రాలేదేమో. లేదా చాలా ఆలస్యంగా వస్తున్నాయేమో. నేను పాతిక ఏళ్ళ క్రితం కొన్న కొన్ని కన్నడలో వచ్చిన అనువాదాలు ఈ మధ్యన తెలుగులో చూస్తున్నాను. మనం ఆలస్యం చేస్తున్నామా? అందుకు కారణం మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. దానికి పరిష్కారం వెతుక్కుంటే మనం కూడా అనువాద రంగంలో ముందుండగలమని భావిస్తున్నాను.

**ప్రస్తుత అనువాదకుల, అనువాద రచనల మీద మీ అభిప్రాయం?**

ఇంతకు ముందు కంటే ఇప్పుడు అనువాదాలు బాగా వస్తున్నాయని అనుకుంటాను. కొత్త వాళ్ళు కూడా చాలా మంది అనువాదాలు చేస్తున్నారు. చక్కగా చేస్తున్నారు. వాళ్ళను ప్రోత్సహించాల్సిన అవసరం పాఠకుల మీద, ప్రచురణకర్తల మీద ఉంది.

**సాహిత్యరంగంలోకి వస్తున్న యువతకు మీరిచ్చే సందేశం?**

చదవటమే... ఎంత చదివితే అంత మంచిది... కాబట్టి చదవటమే... మంచి సాహిత్యాన్ని చదవటం...

**సాహిత్యరంగంలో మీరు ఏదైనా సాధించలేదనే అసంతృప్తి ఉందా?**

లేదు. ఎలాంటి అసంతృప్తీ లేదు. నేను ఏదైతే అనుకున్నానో దాన్ని సాధించటానికే ప్రయత్నిస్తూ వచ్చాను.

సంభాషణ : **కెంగార మోహన్**

■



## అన్నపుముద్దకు ఆకలి

**ఐ**దు వేళ్ళ మధ్య అమరిన అన్నపుముద్ద
నోటికాడికి చేరిందో లేదో
'అమ్మా ఆకలి ఇంత అన్నం పెట్టమ్మా' అని
ఓ పదేళ్ల కుర్రాడు దీనంగా అర్థిస్తున్నాడు
ఒక్కసారిగా నా దేహం ముక్కలయింది
బీడుబడ్డ పొలంలో కూలబడి
దీనంగా దిక్కులు చూస్తున్న రైతు కనిపించాడు
గిట్టుబాటు ధర అందక
రోడ్డుపాలైన టమాటాలు వెక్కిరిస్తున్నాయి
చేతికొచ్చిన పంటమీద
వడగళ్లు కురిసిన భీకర శబ్దం వినిపించింది
నకిలీ విత్తనాలతో నవ్వుల పాలైన పంట గుర్తుకొచ్చింది
పురుగుల మందో ఎరువుల మందో
బడుగు రైతు జీవం తీసుకుంటున్న దు:ఖం కురిసింది

ఈ మెతుకులు ఏ రైతు పండించినవి
చేతిలోని ముద్దను చూడగానే కళ్లు చెమర్చాయి
గుమ్మం దాటి వచ్చిన వాడి ఆకలి
నా కడుపును దేవినట్లయింది
గుమ్మం దాటి పోయిన నా చూపుకు
వాడు ఓ అన్నపుముద్దలా కనిపించాడు
ఆ ఒక్క పిడికెడన్నం
వాడి కడుపులోకి చేరి చేరగానే
ఎండిపోయిన నది పరుగులు పెడుతున్నట్లుగా
వాడి కళ్ళలో ఆనందం సుడులు తిరిగింది
పంట చేలలో పైరగాలిలో ఊగుతున్న రైతు దర్శనమిచ్చాడు


**- కోడం పవన్‌కుమార్**
98489 92825

## యుద్ధం ముగిసింది!

- ములుగు లక్ష్మీ మైథిలి
94400 88482

అవును
ఇక యుద్ధం ముగిసినట్లే
ప్రాణం ఊపిరి పోసుకుంది
శత్రువు అంతంతో
శ్వేత పావురాలు
ప్రశాంతంగా రెక్కలు విదిలించాయి
అజ్ఞాతవాసం వీడిపోయింది

అద్దాల తలుపుల మధ్య
ఘనీభవించిన మనసులను
సున్నితంగా తట్టి లేపి
మమతల ముంగిట్లో
వాలడానికి సిద్ధమవుతున్నాయి



కనురెప్ప వేయని కంటిపాపలకు
హాయిగా జోల పాడాలి
పగలు రాత్రి తెలియని
గాజు గదుల మధ్య
ఎడతెగని సమరంతో
అలసిన దేహానికి సాంత్వన కావాలి

రాకాసి కోరలనుంచి
మృత్యువును జయించి
వారు విజేతలై వెళుతుంటే...
తెల్లచొక్కా గర్వంగా పొంగిపోయింది

పునర్జన్మ ఇచ్చినందుకు
దేవుళ్ళను చేసి...
వారి ఆనంద బాష్పాలతో
పాదాలను అభిషేకిస్తుంటే
మరో కొత్త ప్రపంచాన్ని
సృష్టిస్తున్నామనే ఆత్మస్థైర్యం కలిగింది! ■



## చినుకు ముత్యం

మబ్బు నవ్వితే రాలిన చినుకో
కన్నీటి తునకో
ఆవలింతలెక్కువై కారిన బిందువో
కారం గాటుకు కంటి నుంచి జారిన అణువో
తామరాకుపై పడి నిలిచింది అంటుకుపోకుండా
కిరణాలు ముద్దాడితే మెరుపు సింగిడైంది
చూపరుల మనసుల్లో వేసింది చెరగని ముద్ర

జీవిత కాలం ఎంతైనా
నీటి బుడగైనా
బూడిదగా మారే నిప్పైనా
చలికాచుకునే ఎండైనా
కూరుకుపోవద్దు మోసాల బురదలో
మోహంతో పట్టుకు వేలాడొద్దు
చూపుల చలనాలలో నెత్తురులా మారాలి
చల్లని ప్రాణవాయువు కావాలి
తామరాకు పైనుంచి జారిపోని ముత్యం కావాలి

తామరాకుపై నుంచి జారినా
చెరువు నీటి ఒడిలో చేరినా
మట్టితో మమేకమైనా
పచ్చని జీవితాలకు అండగా నిలిచేది చినుకు

- కొమురవెల్లి అంజయ్య
98480 05676




# సామాజిక కవితా పరిమళం 'మా ఊరు మట్టి'



- పిల్లా తిరుపతిరావు
70951 84846

**మా**నవునిలో సకల మౌఢ్యాలను పారద్రోలి సామాజిక విజ్ఞానాన్ని పెంపొందించేలా చేసేదే నిజమైన కవిత్వం. కవిత్వానికి సామాజిక శ్రేయస్సు అనే లక్ష్యమే లేకపోతే, అది ఎందుకూ కొరగాని కవిత్వమని అనవచ్చు. సామాజిక కవిత్వాన్ని సృజనచేసే కవులు సిక్కోలు సీమకు కొత్తేమీ కాదు. ఎందరో మహాకవులు తమ సామాజిక కవితా జల్లులతో ఈ నేలను పునీతం చేసారు. వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని మానవీయత, సామాజికత, వాస్తవికత అనే ప్రధాన వస్తువులతో నింపిన కవిత్వాన్ని సృష్టిస్తున్న సిక్కోలుకు చెందిన మరో కవి 'పొన్నాడ వరాహ నరసింహులు' గారు. సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయునిగా పనిచేసిన అనుభవాలు, ఆ అనుభవాల్లోంచి నేర్చుకున్న పాఠాలు, జనబాహుళ్యంతో నిత్యమూ తనకున్న సంబంధాలు, ఆ సంబంధాలతో ఇమిడి ఉన్న వివిధ పరిశీలనలు కలబోసి కవిత్వం రాయటం నరసింహులుకు కొట్టిన పిండి. ఈ క్రమంలోనే 'మా ఊరుమట్టి' అనే కవితా సంపుటిని ఇటీవల ఆవిష్కరించు కున్నారు. ఈ సంపుటిలో 52 కవితలున్నాయి. అవి వివిధ పత్రికల్లో ప్రచురితమైనవే. వాటిలో కొన్ని మేలి ముత్యాల్లాంటి కవితలు ఉదహరిస్తూ సమీక్షించుకుందాం.

ఈ సంపుటిలో మొదటి కవిత 'చందమామ'. ఈ కవితలో కవి ఇలా ఆక్రోశిస్తాడు. "కోట్లాధీశుడైన– కటిక దరిద్రుడైన/ బడుగు బలహీనులైన–బలవంతులైన/ ప్రేయసీ ప్రియులైన– విరహబాధితులైన/ సంస్కారవంతులైన–సంస్కారహీనులైన/ విజ్ఞానులైన–జ్ఞాన శూన్యులైన/ నీకు అందరూ సమానమే" అని ప్రకృతిలో భాగమైన చందమామ తన చల్లని వెన్నెలను వర్గదృష్టి లేకుండా సమానంగా పంచుతుందంటాడు. అయితే ఈ ప్రపంచీకరణ మాయాజాలంలో నిరంతరమూ కొట్టుమిట్టాడుతున్న జనం ఎంతమంది కౌముదీ కాంతులలో సేద తీరుతున్నారు? ఎంతమంది ప్రజలు ప్రకృతిలోని రమణీయతను ఆస్వాదిస్తున్నారు? అనేది మాత్రం సంశయాత్మకమే. 14వ శతాబ్దంలోని కవి అన్నమయ్య తన 'బ్రహ్మమొక్కటే– పర బ్రహ్మమొక్కటే' అనే కీర్తనలో నిద్ర, నేల, ఎండ మొదలగు ప్రాకృతిక పదార్థాలు రాజు – పేద, అగ్ర – నిమ్న అనే వివక్ష చూపవని అంటారు. ఇది ప్రకృతికి గల సహజసిద్ధ లక్షణమని వివరిస్తారు. ఇది నిజమే కానీ, నేటి జనం ఆ ప్రకృతి ఒడిలో సేదతీరే తీరిక లేక అనారోగ్యాలను కొని తెచ్చుకొని జీవనం సాగిస్తూ ఉండడం దయనీయం.

కవి 'క్రమభంగం' అనే కవితలో పర్యావరణ వినాశనానికి గల కారణాలను వెలికి తీస్తారు. 'రుతు క్రమం తప్పినట్లుంది/ ప్రకృతి గతి తప్పినట్లుంది/ అడవులను తుదముట్టిస్తూ/ పర్యావరణను పరిరక్షించనందుకు/ భూగోళమంతా కాంక్రీట్ మయం చేస్తున్నందుకు/ పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించనందుకు" అని నిష్టూరంగా పలుకుతాడు. ఈ కాలుష్యానికి కారణభూతులు ఎవరు? వారిని అదుపు

చేయాల్సిన బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు మనలో ఉదయిస్తాయి. ప్రజా చైతన్యం తీసుకురావాల్సిన ప్రభుత్వాలే మిన్నకుండా ఉంటే, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాల్సిన రాజ్యమే మీనమేషాలు లెక్కపెడుతుంటే, సామాజిక ప్రగతి ఏ రకంగా సాధించగలం? అని కవి పాలకుల తీరుని ప్రశ్నిస్తారు. అంతేకాదు కార్పొరేట్ వర్గాలు తమ లాభాల కోసం విచ్చలవిడిగా అణు ధార్మికతను, పలు విష వాయువులను వెదజల్లే పరిశ్రమలను స్థాపించడం, అలా నెలకొల్పే వారికి సర్వ విధాలా సహకరించే రాజ్యం యొక్క ద్వంద్వ వైఖరిని కవి ఈ కవితలో తూర్పారబడతాడు.

'వచ్చావా! నేస్తం వచ్చావా?' అనేక కవితలో ఉద్యమకారుని ఆగమనాన్ని స్వాగతిస్తాడు కవన కార్మికుడు. "నీవొక ఉద్యమ గ్రంథం/ అది గత తరాల చరిత్రకాధారం/ ఎన్ని ఉద్యమ కథలు, ఉత్తమ కతలు చెప్పావు?/ ఎన్ని పోరాటాలు నిన్ను రూపుదిద్దాయి/ పోరాటాలతో రాటుదేలిన నీ అనుభవాలు/ మా జీవన పోరాటాలకు పాఠాలు" నేడు సామాజిక ఉద్యమాలు సన్నగిల్లుతున్న తరుణంలో... ఓ పోరాట వీరుడా! ఓ ఉద్యమకారుడా! నీ అనుభవాలు, నీ ఎత్తుగడలు, నీ పోరాట క్రమాలు మళ్లీ అవసరమైనవి. నేటి ప్రజా సమూహాలు ఆ దిశగా పయనిస్తే కానీ, సగటు మనిషికి నిలువనీడ దొరకదు. కాదు పోదంటే, కొన్నాళ్లకు మనిషి మనుగడకే ప్రమాదం వాటిల్లుతుంది. ప్రపంచీకరణలో భాగంగా సామ్రాజ్యవాదుల కోరల్లో చిక్కుకున్న మానవుణ్ణి పునఃప్రతిష్ట చేసేందుకు నీ ఉద్యమ కార్యాచరణే శరణ్యం.. అని ఎంతో ఆశావహ దృక్పథంతో కవి ఉద్యమాల అవసరాన్ని నొక్కివక్కాణిస్తాడు. "ఎనభైళ్ళలో కూడా ఇరవైల్లా/ ఇప్పటికీ ఉద్యమ పిడికిలి సడలించనంటావు/ అందుకే నీవంటే నాకుత్తేజం/ నీతో సంభాషణ నాకొక ఉద్యమ గ్రంథ పఠనం" అని గత కాలపు ఉద్యమాలను తలచుకుంటూ, ఆ పోరాట యోధులపై గౌరవాన్ని చాటుతూ, వర్తమానంలో పోరాటాల ఆవశ్యకతను గుర్తు చేస్తాడు కవి.

'ప్రశ్న' అనే కవితలో "ప్రశ్న ప్రగతికి మూలం/ ప్రశ్న సృష్టి వికాసానికి దోహదం/ ఏమిటి? ఎందుకు? ఎలా?/ ప్రశ్నలు లేకుంటే, విజ్ఞానశాస్త్ర వికాసం లేదు/ జన్మ రహస్యాన్ని, జీవోద్భవాన్ని ఛేదించింది/ అయినా ఈ అసమానతలకు హేతువేమిటి? అని ప్రశ్న యొక్క ఔన్నత్యాన్ని, అవసరాన్ని ప్రబోధిస్తాడు కవి. శాస్త్ర విజ్ఞానాన్ని అందుకోవటానికి ప్రశ్న తార్కిక శక్తినిస్తుంది. ఆ తార్కికశక్తే నేటి నవీన యుగపు అవసరాలను తీర్చగలదు. అయితే నేడు కొంతమంది ఆ గతితార్కిక నేపథ్యాన్ని మరచిపోయి మూఢత్వాన్ని, ఛాందస వాదాన్ని బుర్రలో ఎక్కించుకుని ఆధిపత్య భావజాలం మరింత ప్రబలేలా చేస్తున్నారు. ఇది చాలా బాధాకరం.

'ఊరు ఊరులా లేదిపుడు' అనే కవితలో 'ఇప్పుడూ ఊరు ఊరులా లేదు/ ఛిద్రమైన మట్టి గోడలా ఉంది/ చిల్లులు పడ్డ తాటాకు గిడుగులా ఉంది" పట్టణీకరణ పేరిట సాగుతున్న విధ్వంసకర అభివృద్ధి నేటి గ్రామీణ జీవనాన్ని ఎలా అతలాకుతలం చేస్తోందో విశదీకరిస్తాడు కవి. "ఊరులో బతుకే ప్రశ్నార్థకమవుతుంది/ డబ్బు గబ్బు ఊబిలో/ పీకల లోతు కూరుకుపోయింది" ధనానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, ఆత్మీయులకు వారి అనుబంధాలకు దూరమవుతూ, ప్రేమపూర్వక స్నేహ సంబంధాలు విడిచిపెడుతూ, నేడు ముందుకు పోతున్న జనం ప్రవృత్తిని నిరసిస్తాడు కవి. అవినీతికి అక్రమాలకు నిలయమైన నేటి పల్లెల్లో, నీతిని నిజాయితీని ఎప్పటిలాగానే పాదుకొల్పమని సూచిస్తాడు కవి. అంటే కలుషిత వాతావరణంలో కూరుకుపోయిన మనిషి మరలా స్వేచ్ఛగా, హాయిగా పల్లెల నీడపట్టున సేదతీరుతూ జీవనం సాగించాలని కోరుకుంటాడు కవి. 'బువ్వ ముఖ్యం' కవితలో ఏడాది కాలంగా ఉత్తర భారత రైతులు చేస్తున్న ఉద్యమాన్ని ఉత్తేజంగా ఉదహరిస్తాడు. సంపద సృష్టి కారకులు కర్షకులు. అలాంటి సైనికులు పిడికెడు మెతుకుల కోసం, బుక్కెడు బువ్వ కోసం అలమటిస్తూ జీవించడాన్ని స్పృశిస్తాడు కవి. పదిమందికి అన్నం పెట్టే రైతన్న నేడు తిండిలేక నరకయాతన పడడాన్ని ఏకరువు పెడతాడు. దీనికి కారణం ఎవరు? ప్రభుత్వం కాదా? రాజ్యం విధానాలు కావా? అని ప్రశ్నిస్తాడు. "దుక్కి దున్నే రైతులు/ మొక్కనాటే కూలన్న లొక్కట్టై/ లాంగ్ మార్చిని తలపించే/ అన్నదాతల పదఘట్టనలు/ యావత్తు భారతదేశాన్నే కుదిపేసింది/ వెల్లువలా ఉప్పొంగి/ ముంబాయి నగరాన్ని ముంచేసింది" అంటూ గతంలో జరిగిన 'ముంబై లాంగ్ మార్చ్'ను నొక్కి చెబుతాడు కవి. అలా నేటి రైతు ఉద్యమం కూడా రూపు దాల్చుకోవాలని ఆకాంక్షిస్తాడు. దానికోసం కర్షకులు, కార్మికులు, కులవృత్తుల వారు, బుద్ధిజీవులు ఏకం కావాలంటాడు. 'బులెట్ ట్రైన్ బ్యూరోక్రాట్ సంస్థలూ కాదు/ బువ్వ ముఖ్యమని నినదించి చాటింది' అంటూ నేటి కర్షకుల పోరాటాన్ని వివరిస్తాడు.

'కాలగమనంలో' కవితలో "కాలే కడుపుతో యోగా చేయిస్తున్నారు/ జేబులో చిల్లిగవ్వైనా లేకున్నా/ బ్యాంకుల్లో

ఖాతాలు తెరిపిస్తున్నారు/ సాధ్వీల్నీ మానవ హనన కారకుల్నీ/ ఎన్నికల్లో పోటీ చేయిస్తున్నారు" అంటూ గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ ధోరణులను ఈ కవి చీదరించుకుంటాడు. జేబులో పైసా లేకపోయినా బ్యాంకుల్లో ఖాతాలు తెరవమంటూ ఒత్తిడి తేవడాన్ని నిరసిస్తాడు. మనుషుల్నీ వారి వేదనల్నీ పట్టించుకోని రాజకీయ నాయకులను చట్టసభలకు ప్రతినిధులుగా మనం పంపించడాన్ని ఆక్షేపిస్తాడు. 'మా ఊరుమట్టి' కవిత శీర్షికనే కవి తన కవితా సంపుటికి పేరుగా పెట్టాడు. ఇందులో కవి తన గ్రామ మట్టి వాసనను గుర్తుకు తెచ్చుకుంటాడు. ఎవరికైనా తన జన్మభూమిలో గడిపిన క్షణాలను అపురూపంగా నెమరు వేసుకోవడం ఇష్టమే కదా! అందుకే కవి ఇలా తన మట్టి మధుర జ్ఞాపకాలను తడుముకుంటాడు. "మట్టి మట్టి మట్టి/ మా మడి మట్టి మా చెరువు మట్టి/ మా గెడ్డ మట్టి మా గుడ్డె మట్టి/ మా పెంట మట్టి మా పొలం మట్టి/ మరపురాని అనుభూతులను మట్టి/ తాతలనాటి తరతరాల మట్టి/ ఎన్నటికీ సువాసనలు వీడని మట్టి/ నన్నీ స్థితికి చేర్చిన మట్టి మా ఊరు మట్టి" ఎన్నో అష్టకష్టాలు పడి, తన తల్లిదండ్రులు తనకీ ఉన్నత జీవితం ఇచ్చారనీ, తన గురువుల ప్రేమపూర్వక ఆదరణ ఎంతో దొరికిందనీ, ఎన్నో మానవ సంబంధాలకు తాను బందీనయ్యాననీ, అవన్నీ కలసి తన ఊరి మట్టిలో నిగూఢంగా ఉన్నాయనీ, తనకెప్పుడూ అవి గుర్తుంటాయనీ చెబుతూ కవి ఆనందపరవశుడవుతాడు. ఈ కవితా సంపుటికి మా 'ఊరుమట్టి' అని నామకరణం చేయడాన్ని లోతుగా పరిశీలిస్తే, ఆ పదం అర్థంలో ఋణాత్మక భావమేదో పొడచూపుతున్నట్లు అనిపిస్తున్నది. అదే 'మా ఊరిమట్టి' అని శీర్షిక పెట్టి ఉంటే, ధనాత్మక భావనేదో కచ్చితంగా స్ఫురణకు రాగలదని చెప్పొచ్చు. తెలుగు భాషా పదాల పొందికలో గుణింతాల ప్రాధాన్యత అంత్యంతావశ్యకం. ఏమాత్రం అటుఇటుగా పొరపాటు జరిగినా అర్థం పూర్తిగా మారిపోతుంది. 'భావనా బలం పుష్కలంగా ఉన్న ఈ కవి శ్రద్ధగా కవిత్వాన్ని అధ్యయనం చేస్తే, వచనానికీ– కవిత్వానికీ మధ్య గల తేడాని నిశితంగా పరిశీలించి కవితా సేద్యం చేస్తే, రేపు యివే కవితల్ని తిరిగి రాయాలనుకుంటే, అప్పుడవి మరింత పదును తేలుతాయి" అన్న ప్రముఖ కవి గంటేడ గౌరు నాయుడు గారి పీఠికలో పలుకులు యదార్థమనే భావన పాఠకులకు కూడా కచ్చితంగా స్ఫురిస్తుంది. మంచి సామాజిక కవిత్వాన్ని అందించిన 'పొన్నాడ' వారికి శుభాభినందనలు. ■



## సూఫీ

సీతాకోక చిలుకలు
పూలన్నిటినీ ప్రేమించటం నేర్పింది
తనకున్నదంతా
పంచి పెట్టమని నది చెప్పింది

ప్రాణ పరిమళాన్ని
జగానికి గాలి పంపకం పెట్టింది

ఆకాశం వర్షించి
సృష్టి దాహాన్ని తీర్చింది

భూమి పాదాల కోసం
భూగోళాన్ని సముద్రం చుట్ట చుట్టింది
చీకటి వెళ్ళిపోతూ
దీపం లాంటి వెలుతురు పంచింది
అడుగు జాడల్లేని ఎడారిలో
తడారిపోని చెలమ పుట్టింది
విరిగి ముక్కలైనా
అబద్ధం చెప్పనని అద్ద చాటింది

నానాజాతి సమితి మీటింగుకి
చెట్టు పర్మిషన్ ఇచ్చింది

నేల అన్నార్తుల కోసం
పంటనంతా దానం చేసింది

పాము ముంగిస చలి చీమలు
ఐకమత్యానికి వేదిక వొకే పుట్ట అయ్యింది!

- ఈత కోట సుబ్బారావు
9440529785

## ఇంతకుక్రితమే..!



నువ్వు ఇంతకు క్రితమే ఫలానా పని
చేసి వుండాల్సింది అన్నాడో మిత్రుడు!
కాలమానాలు మన దొడ్లో కట్టేసిన
గేద మెడలోని గంటలు కాదు కదా!
మేత వేయగానే.. గలగలమనడానికి?
నేను ఏ పనైనా ఎప్పుడు చేసానో
అప్పుడు చేసినందుకే గర్విస్తాను!
సాధనకి, గమ్యానికి మధ్య రహస్య ఒప్పందం
కుదర్చడానికి అవి రెండు దశలు కాదు,
ఒకే దేహంలోని రెండు ప్రవాహాలు కదా!
విమానాలు శబ్దాలు రాల్చినట్టు
కాలమానాలు దూరాలు పూడుస్తాయి కదూ!
ఏదైనా పనిచెయ్యడమంటే
మనల్ని మనం అంకితం చేసుకోవడం కదూ...
పిల్లలందర్నీ వరుసలో కూర్చోబెట్టి అక్షరాలు దిద్దించినట్టు
మన కలలన్నిటినీ వరుసలో కూర్చోబెట్టి
ఆశయాలు దిద్దించడం కాదు!
పిల్లలందరికీ యూనిఫారం వేసి,
టై, స్కూలు బ్యాడ్జి పెట్టినట్టు
మన ఆశయాలన్నిటినీ శిల్పంలా చెక్కి, ప్రాణం పోసి,
ఆచరణలో పెట్టాలి కదూ!

మిత్రులారా!
మీరేవైనా మంచి పనిచేయడానికి పరిపరివిధాలా
ఆలోచించకండి!
'పిల్లల్ని అల్లరి చెయ్యొద్దు' అని బుజ్జగించినట్టు
పనుల్ని కూడా లాలించి బుజ్జగించి చేయాలి కదూ!
ఒక మంచి పని చేయడమంటే
ఒక జీవితాన్ని సఫలం చేయడం!
ఒక మంచి పని చేయడమంటే
ఒక జీవితాన్ని జాతికి అంకితం చేయడం!
ఒక మంచి పని చేయడమంటే
మనల్ని మనం సంస్కరించుకోవడం!

**- కె. ఆంజనేయకుమార్**
94940 53019

## అదేమీ పెద్ద సోద్యం కాదు!

**- ఉప్పరి తిరుమలేష్**
9618961384

ఆ పాదాలకు
అదేమి పెద్ద సోద్యం కాదు..!
అనునిత్యం అరకనే ఆయుధంగా చేతబూని
ప్రతినిత్యం పచ్చని ప్రకృతితో
కరచాలనం చేస్తూ ...

కరువునే కర్రతో తరిమిన అ పాదాలకు
అదేమి పెద్ద సోద్యం కాదు..!
నిండు అమావాస్య నాడు పూర్ణమి చంద్రుడిలా
నల్లరేగడి నేలలలో వేకువ పొద్దై ఉదయిస్తూ
పలుగు రాళ్ళలో పసిడి పంటలు దీసిన
ఆ పాదాలకు
ఆ పని గడ్డి పరకతో సమానం..!

చీదరించిన కాలాన్నే చేరదీస్తూ...
చెలిమె నీళ్లతో దూపదీర్చుకుంటూ..
ప్రకృతి సృష్టించిన ప్రళయాలపైనే
శాంతి ఖవాత్ జేసిన.. ఆ పాదాలకు
అదేమి పెద్ద చోద్యం కాదు..!

నిజాం కురిపించిన జడివానపై
సాయుధ పోరాటంతో
వొనుకు పుట్టించిన జాతిరత్నాలివి ఆ పాదాలు....

తెల్ల బట్టలు ధరించిన
నల్లని మనస్సుతో నేతలు జేసిన...
నల్ల చట్టాలను రద్దు చేయకుంటే
తెల్లవారే లోపే
నాగలితో పార్లమెంట్‌నే దున్నెయ్యడం...
అదేటమి పెద్ద సోద్యం కాదు అని
నినదిస్తున్నాయి మట్టి పాదాలు....

■




# సతీస్మృతి సత్యారాధేయం

- డాక్టర్ జోస్యుల కృష్ణబాబు
98664 54340

**ఎ**లిజీ అంటే స్మృతి కావ్యం. తెలుగులో 'ఎలిజీలు' కొంచెం అరుదుగానే కనిపిస్తాయి. అందులోనూ సతీస్మృతి మరీ అరుదు.

"అంతెపేరునకంతె భార్యాస్థిగాని
నాశరీరాస్థి నిజము కఅష్ణార్పణమ్ము"

అంటూ విశ్వనాథ తన భార్య వరలక్ష్మీదేవి మరణానంతరం ఆమె అస్థికలను కృష్ణలో నిమజ్జనం చేస్తూ పొగిలి పొగిలి విలపించారు. "నానా విచిత్ర జన్మకృతా స్మదఘరాశి" పండి పండి ఇలా భార్యా వియోగంగా పరిణమించిందంటూ వాపోతారు. దువ్వూరి రామిరెడ్డి గారి 'భగ్నహృదయం' అనే కావ్యం సతీ స్మృతికి నివాళి వంటిది.

"హృదయమును దొంగిలించిన రీతిగానె
స్మృతిని సైతంబు నీవు హరింపుమతివ"

అంటూ విలపిస్తారు ఆయన.

ఇలా తెలుగులో సతీస్మృతిని ఎంతో వేదనా భరితంగా అక్షరబద్ధం చేసిన కవులున్నారు. కాని చాలా తక్కువ.

అలా రాయాలంటే భార్యను ఎంతో ప్రేమించగలగాలి. ఆరాధించగలగాలి. ఆమే లోకంగా జీవించగలగాలి. ఆమెతో మమేకమవ్వాలి. మరీ ముఖ్యంగా ఆ ప్రేమను వ్యక్తీకరించగలిగే భాష, కవిత్వ నిర్మాణ శక్తీ రెండూ ఉండాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్న భార్యా ప్రేమికుడు డాక్టర్ రాధేయ. అందుకే 39 వసంతాలు తన చేయి పట్టుకు నడిచిన తన అర్ధాంగి సత్యాదేవి ఒక్కసారిగా ఆ చేయిని వదలి నిష్క్రమించేసరికి ఆ వియోగ గ్రీష్మాన్ని తట్టుకోలేక పోయారు. పొగిలిపొగిలి దు:ఖించారు. లోలోపల కుమిలిపోయారు. అయితే కవి కాబట్టి ఆ అంత ర్మథనాన్ని 'సత్యారాధేయం' అనే ఒక దీర్ఘ కావ్యంగా అక్షరబద్ధం చేశారు.

అర్ధాంగిగా ఒక స్త్రీమూర్తి పురుషుని జీవితంలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి ఆమె కన్ను మూసేవరకూ ఎదురైన అనుభూతులూ, అనుభవాలు రాశిగా పోసిన దీర్ఘవచన కథాకావ్యం ఈ సత్యారాధేయం. భార్య అంటే ఏంటో, భార్య అవసరమేంటో, విలువేంటో, భార్య దూరమైతే కలిగే భరింపరాని ఆ ఆవేదన ఎలాంటిదో ఈ దీర్ఘ కవితలోని ప్రతి అక్షరం చెపుతుంది. తెలుగులో చాలా కాలంగా దీర్ఘకవితా ప్రక్రియ విస్తృతంగా ప్రచలితమవుతోంది. ఇందుకు రెండు ప్రధానమైన కారణాలున్నాయి. మొదటిది కవులు తమని విపరీతంగా వేధిస్తున్న, లేదా కదిలిస్తున్న అంశాన్ని, ఆలోచనల్ని ఆధారంగా చేసుకొని విస్తృతంగా చెప్పాలనే స్పృహ. రెండవది కవితాభివ్యక్తి విషయంలో ఎటువంటి పోకడ పోవాలన్నా స్వేచ్ఛగా పోగల అవకాశం. అలా ఈ కవితలో రాధేయ తన అర్ధాంగి సత్యాదేవితో గడిపిన జీవితాన్ని, పెనవేసుకొన్న అనుబంధాన్ని, పంచుకొన్న కవితా సాహిత్య విశేషాల్ని ఒక్కోటీ ఆర్ద్రంగా చెప్పుకొంటూ వెళ్ళారు.

ప్రతి పురుషుని జీవితంలోనూ అమ్మ పాత్ర ఎంతో గొప్పది. అయితే ఒక్కోసారి అంతకుమించి భార్య పాత్ర ఉంటుంది. పాతికేళ్ళ వరకు అమ్మ చేతుల్లోనే పెరిగిన పురుషుడు, పెళ్ళి కాగానే అప్రయత్నంగానే భార్య చేతుల్లోకి వస్తాడు. మంచి నీళ ్ళ కావాలన్నా, కాఫీ, టిఫిన్, భోజనం .. ఇలా ప్రతి చిన్న విషయానికీ భార్యపైనే ఆధార పడతాడు. భార్య ఇల్లాలిగానే గాక ఒక్కోసారి పురుషుడికి తల్లిగా కూడా మారుతుంది. అమ్మ ప్రేమను కూడా తానే అందిస్తుంది. తల్లి చనిపోతే భార్య ఒళ్ళో తలపెట్టుకొని ఏడవచ్చు. కాని తనే లోకంగా మసలిన భార్య చనిపోతే మాత్రం పురుషుడికి ఇంక ఆ లోటును ఎవ్వరూ భర్తీ చెయ్యలేరు.

ఈ స్మృతి కావ్యం ఒక క్షతగాత్రుని శ్వేతపత్రం. ప్రాణంలో ప్రాణంగా మసలిన ఇల్లాలి నిష్క్రమణను తట్టుకోలేక రాసిన

ఒక వియోగి అంతర్మథనం. ఒక ప్రేమికుని వ్యథ. తోడు కోల్పోయిన క్రౌంచపక్షి దీనాలాపం. ఉమ్మడిశెట్టి ఉమ్మడి చెట్టుగా ఎదిగి కవిత్వ ఫలాలను పండించిన గాథ.

మరణోన్ముఖురాలైన ఇల్లాలిని ఎలాగైనా బతికించుకోవాలని ఆ ప్రేమమూర్తి పడిన తపన ఇందులో కనిపిస్తుంది.

"అరచేతులడ్డుపెట్టినా కొండెక్కిన
దీపం ముందు నడక ఆగిపోయిన
ఓసెలయేటి సంభాషణ .."గా ఈ కావ్యాన్ని పేర్కొన్నారు కవి. నెలకు రూ.50ల సంపాదన పరునిగా 23 ఏళ్ళ వయసులో రాధేయకు పెళ్ళిచూపులయ్యాయి. ఆ పెళ్ళి చూపుల నుంచి తిరిగివచ్చేటప్పుడు అనుకోని రీతిలో కారు ధ్వంసమయింది. మనుషులు మాత్రం వొళ్ళంతా గాయాలతో ప్రాణాలతో బయట పడ్డారు. అందరూ అపశకునమన్నారు. సంబంధం ఇక వదులుకోమన్నారు. ఎవరి అజాగ్రత్త వల్లనో జరిగిన దుర్ఘటన భారాన్ని ఆ అమాయకురాలిపై రుద్దకూడదన్న సహృదయతతో రాధేయ ఆమెనే వివాహం చేసుకొంటానని పట్టుబట్టి మరీ పెళ్లి చేసుకొన్నారు. అలా ఆ వివాహబంధం నాలుగు దశాబ్దాలపాటు కవిత్వ బంధమై నిరాఘాటంగా సాగిపోయింది.

ఆనాటి సత్యారాధేయుల వివాహవేదిక ఒక్కసారి కవి సమ్మేళన వేదికగా మారిపోయింది. ఎక్కడెక్కడి యువకవులూ, కవితాభిమానులూ ఆ పెళ్ళికి తరలివచ్చారు. పెళ్ళికొడుకే సభాధ్యక్షుడిగా ఆనాటి కవిసమ్మేళనం కన్నుల పండువుగా, వీనులవిందుగా సాగింది. కుందుర్తి సత్యాదేవిని వెదికిపట్టుకొన్న రాధేయను అదృష్టవంతునిగా అభివర్ణించారు. సి.నా.రె ఒక రసరమ్యగీతంలో ఆశీర్వచనాలు పంపారు.

పెళ్ళయ్యాక ప్రతి ఆడపిల్లా తప్పకుండా భర్తలో తండ్రిని చూసుకొంటుంది. తండ్రిప్రేమతో భర్తప్రేమను బేరీజు వేసుకొంటుంది. అందుకే సత్య అమాయకంగా భర్తను ఏమండీ! అని కాకుండా, అయ్యా! అని పిలుస్తానని అడిగింది. జీవితాంతం ఆ పిలుపే ఆమెకు తారకమంత్ర మయింది. అంతేకాదు; ఆమె తన సత్ప్రవర్తనతో ఇంటిల్లిపాదికీ అభిమానవతిగా సత్యమ్మగా మారిపోయింది.

ఆ తరువాత ఆ దంపతులకు పాప, బాబు పుట్టారు. తొలి తెలుగు శాసనం వెలువడిన ఎర్రగుడిపాడులో రాధేయకు ప్రథమశ్రేణి హిందీపండితునిగా ప్రభుత్వోద్యోగం వచ్చింది. అప్పటివరకూ ఆయనను బాధించిన ఆకలీ, పేదరికం ఆయన ముందు తలవంచి చేతులు జోడించాయి. అయితే ఎర్రగుడి పాడులో అద్దె ఇల్లు దొరకక ఆ దంపతులు పందిళ్ళపల్లికి మకాం మార్చారు.

రాధేయ పుట్టిన యామవరం, కవిగా ఆయన ఉనికిని చాటితే, పందిళ్ళపల్లె ఉమ్మడిశెట్టి అవార్డుకు శ్రీకారం చుట్టింది. ఒకనాటి రాత్రి ఆ దంపతుల మధ్య కవుల కోసం ఏదైనా అవార్డును ప్రారంభించాలన్న ఆలోచన రేగింది. అయితే రాధేయకు వచ్చే జీతంతో అవార్డును నడపటం కష్టమని భావించారు ఆ దంపతులు. ఆమె కుట్టు మిషను ద్వారాను, ఆయన హిందీ ట్యూషన్లు ద్వారాను ఆ అవార్డును ప్రారంభించి ముందుకు తీసుకువెళ్ళేందుకు నిర్ణయం తీసుకొన్నారు.

హిందీ పండితునిగా చేస్తూనే స్పెషల్ తెలుగు ఐచ్ఛికాంశంగా బిఏ, ఎంఏలు పూర్తిచేసారు రాధేయ. తెలుగు లెక్చరర్‌గా పదోన్నతిని సాధించారు. ఎస్వీ యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి చేసి డాక్టరేట్ కూడా అందుకొన్నారు.

ఎన్ని ఇడుములు, ఆటంకాలు ఎదురైనా ఈ దంపతులు అవార్డు ప్రదానాన్ని మాత్రం ఆపలేదు. ఈ ఉమ్మడిశెట్టి అవార్డు సాహిత్యలోకంలోకి ఎంత బలంగా దూసుకు పోయిందంటే, కాకలు తీరిన కవులనుంచి ఇపుడిప్పుడే కలం పడుతున్న కవుల వరకూ అందరూ ఈ అవార్డును అందుకోవాలని భావించేవారు. తరువాత అవార్డుకు 25 సంవత్సరాల వయసువచ్చింది. రాధేయకు ఉద్యోగ విరమణ వయసూ వచ్చింది. రజతోత్సవ పదవీ విరమణోత్సవ సభలు రెండూ ఒకే వేదికపై జరిగాయి. ఇక పెన్షన్‌తో అవార్డును నడపటం కష్టమని భావించి అక్కడితో ఆపేయాలని ఆ దంపతులు భావించారు. కాని కవులందరూ ఆపొద్దు, మేమండగా ఉంటాం అంటూ నినాదాలు చేశారు. దంపతులిద్దరూ ఏం చెయ్యాలో పాలుపోక ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకొన్నారు. అప్పుడు సత్యాదేవి భర్త అనుమతితో మైకు తీసుకొని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇకపై కూడా అవార్డును కొనసాగిస్తామని ప్రకటించారు.

ఎప్పుడూ మైకు ముందు మాట్లాడి యెరుగని ఆమె భర్త ఉద్దేశాన్ని, కోరికను, అశక్తతను గమనించి తాను వెన్నంటి ఉంటానన్న భరోసాతో ఈ ప్రకటన చేశారు. అందరిలోనూ ఒక్కసారి ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. సభ చప్పట్లతో మార్మోగిపోయింది. అలా ఆ తరువాత కూడా ఆ ఉమ్మడిశెట్టి అవార్డు కొనసాగుతూ వచ్చింది. ఇలా ఆ దంపతుల జీవితం సాఫీగా సాగిపోతోంది. అప్పుడే జరిగింది ఒక దుస్సంఘటన. ఒక బైక్ యాక్సిడెంట్‌లో సత్యాదేవి ఒళ్ళంతా గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. అయితే ప్రాణాలతో బయట పడ్డారు. కాని మెమరీ కోల్పోయారు. అప్పటినుంచి రాధేయ జీవితం ఊహించని మలుపు తిరిగింది.

వైద్యం కోసం ఆమె చెన్నైలో కొడుకు వద్దా, ఆయన అనంతపురంలో కూతురి వద్దా ఉండాల్సివచ్చింది. విశ్రాంత జీవనంలో కొంతకాలం ఎడబాటు తప్పలేదు. అప్పుడు 26వ అవార్డుసభను రాధేయ మిత్రుడైన పలమనేరు బాలాజీ పలమనేరులో నిర్వహించారు. సత్యాదేవి ఆరోగ్యం కొంతమెరుగవటంతో ఆ దంపతు లిరువురూ సభకు హాజరయ్యారు. కె.శివారెడ్డి గారు ఆ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ విధంగా అవార్డు ప్రదానం ఆగిపోకుండా ముప్పైయేళ్ళపాటు ముందుకు సాగింది.

అవార్డుకు మూడు దశాబ్దాలు నిండాయి. ఈ సందర్భంగా ఆ దంపతులు త్రిదశాబ్ది సభను కూడా ఎంతో ఘనంగా నిర్వహించారు. ఏమీ ఆలోచించకుండా తమ ఆరోగ్యం కోసం వైద్యంకోసం, దాచుకొన్న రిటైర్మెంట్ ధనాన్ని వెచ్చించి ఆ సభను నిర్వహించారు. ముప్పై సంవత్సరాలుగా ఎవరెవరికైతే అవార్డులు ఇస్తూ వచ్చారో వారందరితో పాటు మరికొందరు ప్రసిద్ధులైన కవులకు కూడా ఆ త్రిదశాబ్ది ఉత్సవ వేదికపై పురస్కారాలు అందజేసారు. అదే వేదికపై అంతకుముందు అవార్డులు పొందిన ఆ ముప్పై పుస్తకాల పైనా రాధేయ రాసిన ముప్పై విశ్లేషణల్నీ 'మూడు పదులూ ముప్పై కావ్యాలు' అనే గ్రంథంగా ఆవిష్కరించారు. ఆరోజు ముగింపు సభలో సత్యాదేవి భావోద్వేగ ప్రసంగం సభాసదుల హృదయాల్ని కదిలించింది. త్రిదశాబ్ది సభ అయ్యాక సత్యాదేవి మళ్ళీ వైద్యం కోసం మద్రాసు వెళ్ళారు. మూడు నెలలు గడిచింది. ఆమె పరిస్థితి సీరియస్ అయింది. ఊపిరి తీసుకోవటం కష్టమయింది. గుండె బరువుతో చెన్నైలో అడుగు పెట్టిన రాధేయకు ఆమె గుండె ఆగిపోయిందన్న వార్త అశనిపాతమే అయింది.

పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో తన జీవితంలోకి అడుగుపెట్టి, నాలుగు దశాబ్దాలపాటు తనతో కలిసి నడిచిన ఆమె అయ్యో! ఇక సెలవు అంటూ ఈలోకం నుంచి నిష్క్రమించింది. ఆమె ఎడబాటును రాధేయ తట్టుకోలేకపోయారు. లోకమంతా ఒక్కసారి శూన్యమనిపించింది. ఆయన ధైర్యం, ఆయన కవిత్వం దీనంగా నిలబడిపోయాయి. ఆయన బతుకు మగ్గం వణికిపోసాగింది. సత్యా! మరో జన్మంటూ ఉంటే ఉన్న ఫళంగా నిన్ను చేరుకొని నీ కడుపున బిడ్డగా పుట్టాలని ఉంది అంటారు. అవును అటువంటి ఉత్తమ ఇల్లాలు తల్లి కావాలని ఎవరైనా కోరుకొంటారు.

ఆమె నిష్క్రమణ తరువాత రాధేయ ఈ ఉమ్మడిశెట్టి అవార్డును, 'ఉమ్మడిశెట్టి సత్యాదేవి' సాహితీ అవార్డుగా ప్రకటించారు. ఇప్పటివరకూ 33 అవార్డులను ఇచ్చారు. ఇక రాధేయ శిష్యులు పెళ్ళూరి సునీల్, దోర్నాల సిద్ధార్థ, సుంకర గోపాల్ ముగ్గురూ కలిసి గురువు గారి పేరుపై ఉమ్మడిశెట్టి రాధేయ అవార్డును పన్నెండేళ్ళుగా ఇస్తూ వచ్చారు. అక్టోబర్ మూడవ తేదీన పలమనేరులో ఈ అవార్డు సభ జరగబోతోంది. ఈ కావ్యానికి కె.శివారెడ్డి, చినవీరభద్రుడు, రాచపాళెం, కొప్పర్తి, వాడ్రేవు వీరలక్ష్మీదేవి వంటి ముప్పై మందికి పైగా ప్రసిద్ధ సాహితీవేత్తలు చాలాచక్కని ఆత్మీయ వచనాలు రాశారు. ఈ స్మృతి కావ్యం ఒక్కో పుటా తిప్పుతుంటే కొన్ని చోట్ల చేతులు వణుకుతాయి. అనేకచోట్ల హృదయం ద్రవిస్తుంది. చదవటం పూర్తయ్యాక కూడా ఇది మనల్ని చాలాసేపు వెంటాడుతూనే ఉంటుంది.

■

## చిందే స్వేదం 'స్వర్గం'

వాళ్ళతో
రాళ్లు మాట్లాడతాయి
చెమటలో తడుస్తూ
ఆకలి కోసం ఆఖరి దాకా
లోకం కోరిక తీరేదాకా ...

మట్టి మళ్ళు నడుమ నలిగి
ముక్కలై మెలుగుతుంది
బక్కోళ్లకు అండగా
ఉన్నోళ్ళకు అందంగా
పనికి రెండు కళ్ళు పలుగూ పారా
చిందే స్వేదం స్వర్గం
శ్రమ దారిలో
పొంగే గమ్యం సుఖం...

కష్టం ఎగిసిపడుతుంది
కునుకు లేని కళ్ళ వీధిలో
కథలు నడిచేలా కలలు పండేలా
వాళ్లే
శ్రమతో లోకాన్ని బతికించే
బలహీనులు శ్రమజీవులు
కష్టంతో సుఖాన్ని సృష్టించే
సామాన్యులు కష్టజీవులు ..

**- చందలూరి నారాయణరావు**

**97044 37247**

## 'హాంకీ కత్తి ఒకటి'

- లోలా రవికుమార్
కోసూరి

జాగ్రత్త తల్లీ
ఇపుడిదొక అడవి
నువ్వు పువ్వుల కోసమో
గుప్పెడు నవ్వుల కోసమో
అందని ఏ ఆనందం కోసమో
ఇక్కడ తిరగాలనుకుంటున్నావ్..

ఇక్కడ తలలో కత్తులు
దోపుకున్న కోరిక పులులు తిరుగుతుంటయ్
వాటికి వాటితో
మాట్లాడటమే ఒక గ్రీన్ సిగ్నల్
వాటి రిక్వెస్టు యాక్సెప్ట చేయటమే
వాటికి ఆహ్వాన పత్రం
నంగిరిగా మాట్లాడుతూ మొదలెట్టి..
నువ్వు అదాటునున్నపుడు
ఐ లవ్యూ అంటాయ్!

వీటికి కులచారల బలుపూ ఎక్కువే
నీ సమాధానం వాటికక్కర్లేదు
నీ నిత్య జీవితపు సమయాల్లోకీ చొచ్చుకు వస్తాయి
అడవిలోంచి బయటకొచ్చి
సెంటర్లలో కాపుకాస్తాయి
మొలలో కత్తి, తలలో కత్తి
వీటికి ఒళ్ళంతా కత్తే ...

నువ్వు
ఏ కూరగాయల కోసమో
నాయినమ్మ మాత్రల కోసమో
లేదా పాల పాకెట్ల కోసమో
ఆదమరచినపుడు
మొలలో పంజా విసురుతానంటాయ్
వినకపోతే తలలో పంజా విసిరి
కోరల్లాంటి కత్తులతో
ఊపిరి ఆగేదాకా ఉన్మాదిస్తాయ్!




జాగ్రత్త తల్లీ
ఫేస్‌బుక్ ఎప్పటికీ పూలవనం కానేకాదు
మేక వన్నె పులులు తిరుగాడే మోహవనం

నువ్వు వెళ్ళిపోయాక
కాసిని 'కొవ్వొ'త్తులూ నినాదాలూ
ఒకరోజు స్పెషల్ న్యూస్ ఐటమూ
ఓ రెండు గంటల నిరంతర వార్తా స్రవంతీ
ఉరి తియ్యాల్సిందేననే డైలాగులూ
వాంతి చేసుకుని
నగరం గుక్కెడు తాగి గూట్లో పడుకుంటుందిలే!

హాప్పీగా సచ్చిపో తల్లీ
నువ్వు పులులతో ఛాట్ చేశావనీ
నయగారంగా మాట్లాడావనీ
కొన్ని సెల్ఫీలు పంపావనీ తీసుకున్నావనీ
నువ్వేమీ తక్కువ తినలేదనీ
ఇలా ... అరుగుల మీద చేరి
పల్లెలు పరామర్శించుకుంటాయిలే!

నేను మాత్రం
ఒక హాంకీ కత్తి కోసం ఎతుకుతున్నాను
బుర్రల్లోకి ఎక్కుతున్న
ఎదవ ఆలోచనల మూలాలకు
కోసి కారం పెడదామని...! **('రమ్య' కోసం)**

## కవిత

# నిఘా

- పద్మావతి రాంభక్త
99663 07777



**ఆ**మెపై
ఆమె చూపుపై నడకపై
ఒంపులు తిరిగే నదులపై
నిఘానీడ పరుచుకుంటుంది
ఆమె మాట
పెదవి గుమ్మం దాటేలోగా
నిఘా ద్వారబంధం
నుదుటికి తగిలి బొప్పి కట్టిస్తుంది
కన్నీటి కాలువలు కట్టిస్తుంది

ఆమె మృదువైన పువ్వై
వికసించాలనుకుంటుంది
వెంటనే నిఘా కత్తై
పుష్పించే కొమ్మను నరికేస్తుంది
పరిమళమై పరుగులు తీసేలోగా
మురికివాసన వానై కురుస్తుంది

ఆమె కాసేపు
ఆలోచనల గొడుగు కింద
మౌనాన్ని పరచుకుని
సేదదీరుతుంటుంది
నిఘా నిశ్శబ్దపుపొదుగులోంచి
కల్పనలను  కథలను
కడవల కొద్దీ తోడి
తోడు పెడుతుంది

ఆమె ప్రతీ శ్వాసనూ
నిఘా వెంబడిస్తూ
నాలుకలపై నచ్చిన వార్తలను
నానబెడుతుంది
ఆమె నలుగురికీ
ఒక కాలక్షేపపు చిరునామా
వారి అత్యుత్సాహపు
ఊహల ఊసుల ఊయల


ఆమె గుండెగాయాల లోతులు
వారికెందుకు
బతుకు పుస్తకపు
చిరిగిన పుటల సంగతులు
వారికేమవసరం
ఆమె ఆత్మవిశ్వాసం
వారికి కంట్లో రాయి
ఆమె ఆత్మగౌరవం
వారికొక ధూళికణం

ఆమె వృక్షమై నిలబడాలని
వేర్లను విస్తరించేలోగా
గొడ్డళ్ళు కొమ్మలను నరకడానికి
నడుముకడతాయి

ఆమె పక్షై
స్వేచ్ఛను ప్రేమించేలోగా
రెక్కలు కత్తిరింపబడతాయి
అనంతమైన ఆకాశం

అమాంతం వంగి
పుడమి అణువణువునూ
నిశితంగా పరిశీలించినట్టు
ఆమె ప్రతి కదలికనూ
భూతద్దపు చూపులతో గమనించి
పుకారు మేఘాలు
ప్రపంచమంతా కురిసి
పైశాచికానందాన్ని పొందుతూ
పకపకా నవ్వుతాయి
ఆమెలాంటి వారిని
రహస్యంగా హత్య చేసి
గర్వంగా చేతులు
దులుపుకుంటాయి

వారి తనువంతా
విస్తృతంగా పరచుకున్న నిఘా నేత్రాలు
ఆమె మనసంతా
వారు చేసిన లోతైన గాయాల ఆనవాళ్ళు
రక్తమోడుతూ ... ■




# సామాజికాంశాల చుట్ట'కుదురు'

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**వ**చన కవిత్వంతోపాటు నాయకురాలు నాగమ్మ, కన్నెగంటి హనుమంతు వంటి చారిత్రక వ్యక్తుల ఆత్మకథలు ఆవిష్కరించిన రచయితగా కె. హెచ్.కె. మోహన్‌రావు ప్రసిద్ధులు. ఆయన తాజాగా వెలువరించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణాత్మక కథనాల సమాహారం 'కుదురు'. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా విడిపోయాక ఆంధ్రలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రిగా కొత్త రాష్ట్రం బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు అమరావతిని నూతన రాజధానిగా ప్రకటించారు. ప్రపంచస్థాయి రాజధాని నగరం నిర్మించాలన్న తలంపును తెరపైకి తెచ్చి, అందుకోసం భూసేకరణ ప్రారంభించారు. 30 వేల ఎకరాలకుపైగా భూమిని నూతన నగర నిర్మాణం నిమిత్తం సేకరించారు. ఆ భూముల్లో పైర్లు ఆగిపోయాయి. రాత్రికి రాత్రే భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గ్రామగ్రామాన రియల్ ఎస్టేట్ ఆఫీసులు వెలిశాయి. జీవన సరళిలో అనూహ్య మార్పులు సంభవించాయి. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు అత్యంత వేగంగా మార్పు చెందాయి. ఈ పర్యవసానాలకు మూల కారణాలను అన్వేషించే క్రమంలో మోహన్‌రావు పదికి పైగా వ్యాసాలు రాశారు. 'భూమే రైతులకు జననం, జీవనం, మరణం అన్న విషయం విస్మరించదగినది కాదు. కరువు వచ్చినా, కాటకం వచ్చినా, వరదలొచ్చినా, విపత్తులచ్చి సాగిలపడినా వ్యవసాయాన్ని వదలడం రైతుకు చేతకాని పని' అని 'రాజధానికి పేదరైతుల భూములా?' శీర్షికతో రాసిన వ్యాసంలో ప్రశ్నించారు. వాటితో తమ అనుబంధాన్ని తెంచుకోవటం అంత తేలికగాని పరిస్థితుల్లో పాలకులు ప్రయోగించిన చిట్కాల వెనక మతలబులను వివరించే ప్రయత్నం చేశారు. లోటు నిధులతో ప్రయాణం ప్రారంభించిన కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేక హోదా మాత్రమే సంజీవనిలా ఆదుకోగలదని, అందుకోసం పాలక, ప్రతిపక్ష నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఎలాంటివో వివరిస్తూ రాసిన వ్యాసం 'ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాపై పోరు'. కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను 'గోదాలో హోదా – అయోమయంలో అభివృద్ధి' శీర్షికతో రాసిన వ్యాసంలో పరామర్శించారు. ఈ పరిణామాల వెనక దాగి ఉండే ఆర్థిక గణాంకాల రహస్యాలు, అమరావతి శంకుస్థాపనకు వచ్చి మోదీ ఇచ్చిన హామీలు, మోదీతో అప్పటి ముఖ్యమంత్రి ఘర్షణ పడలేని అచేతనత్వం, ఓటుకు కోట్లు కేసు తదితర అంశాలను కూలంకషంగా విశ్లేషించారు.

'హోదాపైగానీ, సాయంపైగానీ మోదీ ప్రభుత్వాన్ని నిలదీయడంలో చంద్రబాబు ఇంకా అశక్తతనే ప్రదర్శిస్తున్నారు' అని 'ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్న పాలకులు'లో విమర్శించారు. అదే సమయంలో 'ప్రశ్నిస్తాను, పోరాడతాను' అనే నినాదాలతో రాజకీయ రంగప్రవేశం చేసిన పవన్ కళ్యాణ్ క్రియాశీల వ్యూహాలతో ముందుకు సాగటం లేదని కుండ బద్దలు కొట్టారు. రాజకీయ మేధావిగా పేరొందిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో ఘోర ఓటమి పొందటానికి దారి తీసిన పరిస్థితులను 'నీ వల్లే గెలిచి... నీ వల్లే ఓడి...'లో సుదీర్ఘంగా అవలోకించారు. పోలీసు మార్కు పాలన, ఆందోళనకారుల్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయటం, అమాయకులపై అక్రమ కేసులు, వాగ్దానాలకు ఆచరణరూపం ఇవ్వలేకపోవటం, మితిమీరిన జన్మభూమి కమిటీల పెత్తనం, సాగునీటి ప్రాజెక్టుల్లో పురోగతి లేకపోవటం, పొంతన లేని సొంత సర్వేలు.. ఇలా

ఎన్నో అంశాలు తెదేపా అధికారానికి కత్తెర వేశాయని తేల్చారు.


వైకాపా అధికారంలోకి వచ్చాక, ఆంధ్ర ప్రయాణం మరికొన్ని మలుపులు తిరిగింది. 'అధికార వికేంద్రీకరణ' నినాదంతో వైఎస్ జగన్ రాజధానిని మూడు ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఒక్కసారిగా అమరావతి అభివృద్ధి పాలపొంగులా చప్పున చల్లారిపోయింది. కట్టిన భవనాలు, వేసిన రోడ్లు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పొలాలు బీళ్లు పడిపోయాయి. ఈ నేపథ్యాన్ని సవివరంగా సమీక్షించిన మోహన్‌రావు 'వికేంద్రీ కరణ వైసీపీ చిత్తశుద్ధిని కూడా ప్రశ్నిస్తుంది. చంద్రబాబు నిర్ణయాన్ని శాసన సభలో స్వాగతించి ఇప్పుడు టర్న్ తీసుకొని వికేంద్రీకరణ చేపట్టడం సమంజసమా?' అంటూ కొన్ని వర్గాలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నిలదీస్తున్న సందర్భాలను 'ఏపీ రాజధాని ఆందోళన ఆర్థిక ఉద్యమమేమో!' అనే వ్యాసంలో ప్రస్తావించారు. 'రాజధాని' కేంద్రంగా తెదేపా, వైకాపాలు క్షేత్రస్థాయిలో తమ బలాబలాల నిరూపణకు పడుతున్న పాట్లు వివరించారు. రాజధానికి ముందూ వెనకా తీవ్రంగా నష్టపోయింది భూమిలేని నిరుపేదలే. రెక్కల కష్టంపై కడుపు నింపుకొనే శ్రమజీవులు దిక్కుతోచని స్థితిలో చిక్కుబడ్డారు. భూములున్న బాబులు మాత్రం కోట్లకు పడగలెత్తారు. గతంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు, వాటికోసం రైతులు ఎన్ని ఎకరాలు కోల్పోయారో, ఎన్ని గ్రామాలు తరలిపోయాయో సందర్భానుసారంగా పేర్కొనటం బాగుంది.

**అసమర్థత, అజ్ఞానాలపై విమర్శనాస్త్రాలు**

రాష్ట్రాలతో నెరపాల్సిన సంబంధ బాంధవ్యాల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోందో కొన్ని వ్యాసాల్లో లోచూపుతో పరిశీలించారు రచయిత. బీజేపీయేతర రాష్ట్రాల అభివృద్ధి పట్ల నిష్పాక్షిక ధోరణి కొరవడిన వైనాన్ని వివరించారు. కక్షపూరిత చర్యల గురించీ నిర్మొహమాటంగా చెప్పారు. 'స్వచ్ఛతలేని మోడీ రాజకీయ ప్రయాణం' అంటూ మొదటి వ్యాసంలోనే తూర్పారబట్టారు. జనధన్ ఖాతాలు, గంగానది ప్రక్షాళన, స్వచ్ఛభారత్, అవినీతి రహిత పాలన వంటి అంశాలు చెప్పుకోదగ్గ ఫలాలను వ్యవస్థకు అందించలేదని ప్రస్తావించారు. 'వాస్తవానికి రాజకీయ రంగంలో మార్పు రాకుండా దేశంలోని ఏ వ్యవస్థలోనూ కాలుష్యాన్ని నివారించడం సాధ్య మయ్యే పని కాదు. శుద్ధ గంగ, స్వచ్ఛభారత్‌లను ముందుగా రాజకీయరంగం నుంచి ప్రారంభించాల్సిన అవసరం ఉంది' అని మూలావసరాన్ని సూచించారు.

బీజేపీ సమస్త శక్తియుక్తులనూ కూడదీసుకుని పోరాడినా ఢిల్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని తప్పించుకోలేకపోయిన సందర్భాన్ని రచయిత 'విలువల విజయమే ఢిల్లీ ఎన్నికల ఫలితం'గా అభివర్ణించారు. 'భారత రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక ప్రధానమంత్రి ఢిల్లీలోని గల్లీ గల్లీ తిరిగి శాసనసభ ఎన్నికల్లో ప్రచారం గావించడం పసికూనలాంటి ఆమ్ ఆద్మీ పార్టీపైనా, ఆ పార్టీ ప్రధాననేత కేజ్రీవాల్‌పైనా సంధించిన విమర్శలు, ఆరోపణలు పరాజయం రూపాన్ని సంతరించుకుని తిరిగి ఆయన పాదిలోకే వచ్చిచేరాయి' అంటూ విశ్లేషించారు. 'గర్భ సంస్కార్' పేరుతో ఆరెస్సెస్ రూపొందించిన సీడీలు, పుస్తకాలు ప్రజల్లో మూఢత్వాన్ని పెంచి పోషించే హానికారకాలనీ, 'వాస్తుదోషం' పేరిట రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కూల్చివేతలు, నిర్మాణాల కోసం కోట్ల రూపాయలు తగలేస్తున్నారనీ ధ్వజమెత్తారు. స్వయంగా పాలకులే అజ్ఞానాన్ని ప్రజల బుర్రల్లోకి బట్వాడా చేస్తున్నారని రచయిత విరుచుకుపడ్డారు. 'ప్రపంచ దేశాలనేకం వైజ్ఞానికంగా పరుగులు పెడుతుంటే, మనం విశ్వాసాల మూకుడులో పేలాల్లా వేగుతున్నాం. రాజ్యాంగం ఒకవైపు డప్పుకొట్టి చెబుతున్నా మన పాలకుల వైఖరిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. విద్య, సామాజిక, రాజకీయ, పాలనా వ్యవస్థల్లో పరిశోధనల దిశవైపు తలతిప్పే యోచనే చేయడం లేదు' అని స్పష్టంగా తన అభిప్రాయాలు వెల్లడించారు.

'భగవద్గీతలో జాతీయభావం ఉన్నదా?', 'వేగుచుక్కల ఉసురు తీస్తున్న మతోన్మాదం' శీర్షికలతో రాసిన వ్యాసాల్లో సున్నితమైన అంశాలను విశ్లేషించటంలో రచయిత ప్రదర్శించిన పరిణతి ప్రశంసనీయం. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ విద్యార్థి వేముల రోహిత్ 'బతికి ఉండటం కంటే చనిపోతున్నందుకు తాను సంతోషంగా ఉన్నా'నంటూ రాసిన ఆఖరి అక్షరాల వెనక నీలినీడల్ని వెలికితీస్తూ రాసిన వ్యాసం 'ఆఖరి అక్షరాలు ఆలంబనగా...' ఆకట్టుకుంటుంది. 'చైనాతో భారత్ యుద్ధం వాంఛనీయం కాదు' అంటూ ప్రధాని మోదీకి చేసిన విన్నపంలో ఆసక్తికరమైన అంశాలను పాఠకుల దృష్టికి తీసుకువచ్చారు. భారతదళం బలాబలాలు, సైనిక పాటవాలు, కాగ్ నివేదించిన ఆయుధ నిల్వలు, రాజకీయ వ్యూహాలు, పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న ప్రమాదాలు, అమెరికా – రష్యాల నుంచి ఎదురు కాబోయే పరిణామాలను కూలంకషంగా విశ్లేషించారు. యాదవులపై చాగంటి కోటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు, వైశ్యులపై రాసిన పుస్తకంలో కంచె ఐలయ్య చేసిన ఆరోపణలు కొందరి మనోభావాలను ఎంతగా గాయపరిచాయో, అలాంటి వ్యాఖ్యల్లో రచనల్లో ఎంతటి సంయమనం అవసరమో వివరిస్తూ రెండు వ్యాసాలు రాశారు. 'మల్లెతీగ ముద్రణలు' ప్రచురించిన ఈ పుస్తకం ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది. మోహన్‌రావు గారి కలం నుంచి మరిన్ని సమగ్ర సామాజిక కథనాలు వెలువడాలని ఆకాంక్ష. **94401 54114** నెంబర్లో రచయతను సంప్రదించవచ్చు. ■




# అమృతకవికి 'రసగంగాధర తిలకం'

- డా॥ తోట వెంకటస్వామి
94926 31323

**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో కృష్ణశాస్త్రి, శ్రీశ్రీల తరువాత యువకవి లోకాన్ని మిక్కిలిగా ప్రభావితం చేసిన అమృత కవి కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ (1921–1966). వీరి శతజయంతి సందర్భంగా వీరి ప్రియశిష్యులైన మద్గురువర్యులు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు... తాము రచించిన ఏడు అద్భుతమైన వ్యాసాలను ఒక అందమైన గ్రంథంగా వెలువరించారు. తిలక్ గారు ఎంత అందంగా ఉండేవారో ఈ పుస్తకం కూడా అంత అందంగా ముద్రితమయింది! తంగిరాల వారు తప్ప ఇతరు లెవ్వరూ రాయలేని ఒక విశిష్టమైన వ్యాసం ('తిలక్ అభిరుచులు– అలవాట్లు')తో ఈ సంపుటి ప్రారంభమవుతుంది. ఇది ఈ గ్రంథంలోని ప్రత్యేకాంశం. 1966 జూన్ 30వ తేదీ రాత్రి (జులై 1వ తేదీ కాదు) తిలక్ గారు హఠాత్తుగా 45 సంవత్సరాల వయస్సులో చనిపోయినప్పుడు శ్రీశ్రీ గారు 'జవాబు రాని ప్రశ్న' అనే స్మృతిగీతం (Elegy) రాశారు. ఆ కవిత ముగింపులో 'కవితా సతి నొసట నిత్య రస గంగాధర తిలకం' అన్నారు. ఆ పాదంలోని 'రసగంగాధర తిలకం' అనే మాటను ఈ వ్యాససంపుటికి శీర్షికగా గ్రహించడం తంగిరాల వారి అభిరుచికి చిహ్నం. వీరు 1955 నుంచి 1961 వరకు ఆరేళ్ల పాటు తిలక్ గారిని అత్యంత భక్తితో సేవించిన ప్రియశిష్యులు. దీనికి తిలక్ రచించిన 'తపాలా బంట్రోతు' కవిత ప్రబల సాక్ష్యంగా నిలుస్తోంది!

1966లో తంగిరాల వెంకట సుబ్బారావు గారు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో UGC Fellowshipతో 'తెలుగు వీరగాథా కవిత్వం' అనే అంశాన్ని గురించి పరిశోధన చేస్తున్నారు. జులై 2వ తేదీ Indian Express దినపత్రికలో తిలక్ మరణవార్త విని దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే, తిలక్ గారితో తనకు గల సాన్నిహిత్యాన్ని పురస్కరించుకొని 'తిలక్ అభిరుచులు – అలవాట్లు' అనే వ్యాసాన్ని ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తిచేశారు. ఇది సుమారు 80 పుటల సుదీర్ఘ వ్యాసం. దీనిలో కొంతభాగం (23 పుటలు) 'తిరుపతి సాహిత్య సమితి వ్యాసావళి– 3'లో 1972లో ముద్రితమయింది. మిగిలింది అలాగే ఉండిపోయింది. ఇప్పుడు మొత్తం వ్యాసాన్ని కాలాను గుణమైన చిన్న చిన్న మార్పులతో ఈ పుస్తకంలో మొదటి వ్యాసంగా ప్రచురించారు. దీనికి మరో ఆరు వ్యాసాలు కూడా చేర్చారు.

మొదటి వ్యాసం 'తిలక్ అభిరుచులు–అలవాట్లు' 1966లో రాస్తే, తక్కిన వ్యాసాలు 40 – 50 ఏళ్ళ తర్వాత రాసినవి. అవి కూడా అన్నీ ఒక్కసారి రాసినవి కావు; అప్పుడప్పుడు రాసినవి. 'తిలక్ వచన కవిత్వం – భాషాశైలి' అనే ఐదవ వ్యాసం 2007లో రాశారు. 'తిలక్ వచన కవితా వైభవం' అనే మూడవ వ్యాసం 2009లో రాశారు. 'తిలక్ సాహిత్య పరిచయం' అనే రెండవ వ్యాసం 2013లో రాశారు. 'తిలక్ లేఖలు – ఒక పరిశీలన' అనే చివరి (ఏడవ) వ్యాసం కూడా 2013 ప్రాంతంలోనే రాశారు. 'తపాలా బంట్రోతు కవిత పుట్టుక' అనే నాల్గవ వ్యాసం 2015లో రాశారు. 'తిలక్ పద్యకవితా వైభవం' అనే ఆరవ వ్యాసం ఇటీవల (2021

మేలో) రాశారు. ఒక వ్యాసానికి మరో వ్యాసానికి రచనా కాలంలో ఎన్నో ఏండ్ల వ్యత్యాసం ఉండటం వల్లా, ఏ వ్యాసాని కావ్యాసాన్ని ప్రత్యేకంగా తీర్చి దిద్దడంవల్లా, అన్నీ కలిపి ఒక పుస్తకంగా ముద్రిస్తానని అనుకోకపోవడంవల్లా – ఒక వ్యాసంలో ముచ్చటించిన అంశాలు మరో వ్యాసంలో పునరుక్త మయ్యాయి. ముఖ్యంగా 'తిలక్‌గారితో నా పరిచయం', 'తిలక్‌గారి తాతముత్తాతలు, సోదర సోదరీమణుల వివరాలు'; 'తిలక్ సాహిత్య దశల విభజన', 'తపాలా బంట్రోతు కవిత పుట్టుక' అనే అంశాలు రెండు మూడు వ్యాసాల్లో వచ్చాయి. 'తపాలా బంట్రోతు' అనేది తంగిరాల వారికి ఆత్మీయమూ గర్వకారణమూ అయిన కవిత. ఆ అభిమానం వల్ల దీనిలోని చరణాలు నాలుగు వ్యాసాల్లో పునరుక్తమవుతూ వచ్చాయి. పాఠకులు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తాను.

తిలక్ గారికి శతజయంతి నివాళిగా తంగిరాల వారు ఈ వ్యాసాలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. కవిగా, రచయితగా తిలక్ అందరికీ తెలుసు. కాని వ్యక్తిగా చిత్ర విచిత్రమైన అభిరుచులు, అలవాట్లు కలిగిన మనవంటి సామాన్య మానవుడే అనే విషయం చాలామందికి తెలియదు. సుదీర్ఘమైన (80 పుటల) మొదటి వ్యాసం ఆయా విషయాలను సమగ్రంగా విశదీకరిస్తుంది. తిలక్ మొత్తం సాహిత్యాన్ని రెండవ వ్యాసం పరిచయం చేస్తుంది. మూడవ వ్యాసంలో తిలక్ వచన కవితా వైభవం, నాల్గవ వ్యాసంలో 'తపాలా బంట్రోతు' కవిత పుట్టుక, ఐదవ వ్యాసంలో తిలక్ వచన కవిత్వంలోని భాషాశైలి, ఆరవ వ్యాసంలో తిలక్ పద్యకవితా వైభవం తెలియజేశారు. చివరిదైన ఏడవ వ్యాసంలో లేఖలనుబట్టి తిలక్ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. తిలక్ అలభ్య పద్యకావ్యం 'మండోదరి'ని గురించి తంగిరాల వారి మిత్రులు డా॥ శ్రీపాద కృష్ణమూర్తి చెప్పిన విశేషాలు, తిలక్ మరణించినపుడు శ్రీశ్రీ రాసిన స్మృతి కవిత (Elegy), ఆచంట జానకిరాం గారికి తిలక్ రాసిన పెద్దలేఖ, తిలక్ కుటుంబ చరిత్ర, తణుకులోని శ్రీ నన్నయ భట్టారక పీఠం వారు ప్రతిఏటా ఇచ్చే 'తిలక్ సాహిత్య పురస్కారాల' పట్టిక (1997 నుంచి 2019 వరకు), తంగిరాల జీవన రేఖలు అనుబంధాలుగా పొందుపరిచారు.

'తిలక్ అభిరుచులు–అలవాట్లు', 'తిలక్ వచన కవిత్వం–భాషాశైలి' వ్యాసాల్లో తంగిరాల గారి మౌలికత (Originality) ఎక్కువగా కనిపిస్తోంది. 'తిలక్ పద్య కవితా వైభవం' వ్యాసం కూడా నూతన విశ్లేషణతో కూడినట్టిదే! ఇది తిలక్ పద్య కవిత్వాన్ని గురించిన సమగ్రమైన వ్యాసంగా భావించ వచ్చు. కానీ 'తిలక్ వచన కవితా వైభవం' వ్యాసంలో మాత్రం వీరు ప్రముఖ విమర్శకులు డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గారు రచించిన 'తిలక్ కవితా తత్త్వం – దృక్పథం' అనే వ్యాసం (చూ. లోపలికి... పుటలు 99–132) మీద ఎక్కువగా ఆధారపడ్డారు. అందువల్ల వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆచార్య తంగిరాల సుబ్బారావు గారు కష్టపడి రచించి, ముద్రించిన ఈ వ్యాస సంపుటిని తిలక్ దంపతులకు, వారి సంతానానికి అప్యాయంగా అంకితం చేశారు. 1967 నుంచి తిలక్ కథలను, 1968 నుంచి తిలక్ కవిత్వం 'అమృతం కురిసిన రాత్రి'ని, ఈనాటి వరకూ కూడా క్రమం తప్పకుండా ముద్రిస్తూ, తిలక్ సాహిత్య ప్రియులకు అందిస్తున్న విశాలాంధ్ర ప్రచురణాలయం వారికి; 2013, 2021 సంవత్సరాల్లో తిలక్ సర్వలభ్య రచనలను బాపు గారి ముఖచిత్రంతో అందంగా పెద్ద బౌండ్ పుస్తకంగా ముద్రించిన 'ఎమెస్కో బుక్స్' వారికి, అలాగే తిలక్ కీర్తిప్రతిష్ఠలను శాశ్వతం చేయడంలో సహకరించిన ఇతరులకు, తిలక్ కవిత్వమంటే చెవికోసుకొనే మిత్రులకు ఈ అంకితంలో భాగస్వామ్యం కల్పించారు. ఇది ప్రత్యేకంగా గుర్తించవలసిన విషయం.

తిలక్ కవిత్వాన్ని ఇష్టపడే వాళ్ళంతా ఈ గ్రంథాన్ని తప్పక చదవాలి. ఈ పుస్తకాన్ని రచిస్తున్న కాలంలో– 28.07.2021 నాడు తంగిరాలవారి అన్న గారు, సంస్కృతాంధ్రాల్లో గొప్ప పండితులు టి.వి.కె. సోమయాజులు గారు (తంగిరాల వెంకట కృష్ణసోమయాజులు గారు) కీర్తిశేషులయ్యారు. అందువల్ల ఆగస్టు 1వ తేదీకి వెలువడవలసిన ఈ వ్యాససంపుటి సెప్టెంబరు 20 నాటికి ముద్రణ పూర్తి చేసుకుంది. తంగిరాల అన్నగారి జ్ఞాపకంగా ఈ గ్రంథం అనుబంధంలో సోమ యాజులు గారు రచించిన 'సాహిత్య సాగరంలో ఏటిన ముత్యాలు', 'జ్ఞానరత్నాలు' అనే పుస్తకాల నుంచి కొన్ని అత్యుత్తమమైన ఉదాహరణాలు ఇచ్చారు. ఇవి పాఠకులకు బోనస్!

**('రసగంగాధర తిలకం', 1/8 డెమి సైజు, పుటలు 318 (40 పుటలు రంగుల ఫొటోలతో సహా) వెల రూ. 300)**

■



# ఆ నలుగురూ లేని నాడు ...

- వేణు మరీదు
98486 22624

**"అ**రేయ్ రాండిరా... ఒరేయ్ పెసాదూ.. రేయ్ రవీ... ధనమ్మా... మల్లేసూ... ఎక్కడికి పోయార్రా మీరంతా... అయ్యో నా తమ్ముడా... నా శోకేసా... 'ఏడుపు'తోనే మమ్ముల్ని బతికించావు గదరా... ఇప్పుడు నీ కోసం ఏడవటానికి వొక్కడైన రాడేరా నాయనా... ర్రేయ్ ... ఎవరూ పలకరేరా? నిన్నటి దాకా వీడి సుట్టే తిరిగారు గదరా... ఆడు సూపిచ్చిన దారిలోనే నడిసి మీ పొట్టలు నింపుకున్నారు కదరా... ఒక్కరైనా రారేందిరోయ్... ఈ మాయదారి ఐరసు నా తమ్ముణ్ణి ఇలా తన్నుకుపోయిందేరో దేముడోయ్" అంటూ గుండెలవిసేలా రోదిస్తుంది నల్లోరిపాలెం కాలనీలో దయమ్మ.

ఆ నడివయసు స్త్రీ ఎంత మొత్తుకుంటున్నా ఏ ఒక్కరూ ఆ ఇంటివైపు రావట్లేదు. నడి ఎండాకాలం. మిట్ట మధ్యాహ్నం బైటికెళితే నిప్పుల వాన ఒంటిపై తూట్లు పెట్టేలా ఉంది. దయమ్మ దీర్ఘ శోకాలు, కీచురాళ్ళ అరుపులు తప్ప ఊరంతా భీకర నిశ్శబ్దం.

శోకేశ్, దయమ్మల ఇంటి వెనుక పెరడుకు అవతల కొద్ది దూరంలో తుమ్మకంచెకు ఆనుకొని వీరన్న ఇల్లు. ఆ ఇంటి వెనుక పెద్ద రోటి బండపై కూర్చొని ఇద్దరు ముసలవ్వలు చీర పైటకొంగులు మూతికి గట్టిగా ఒత్తిపట్టుకొని మాట్లాడుకుంటున్నారు.

"ఊళ్లో అందరి కోసం ఏడ్చినోడు. ఆకరికి ఆడికి ఏడవటానికి ఒక్కడు రావట్లేదు సూడవే కుపమ్మా! పాపం... దయమ్మ బతుకంతా పుల్లిందలేనే. సివరాకరికి దానికింత ముద్దబెట్టే మనిసిబోతే ఆడిని మట్టిలో ఎయ్యడానికి సాయంజేసే మనిసే కరువాయే. ఇంకా ఈ బూమ్మీద ఎంత గోరం సూడాలో గదనే" అంటూ కన్నీటి చెమ్మతో నిట్టూర్చింది ఒక ముసలవ్వ.

"అంతా దేవుడి సిత్తమేలే జ్యానికక్కా" అంటూ మధ్యలో ఆకాశం వైపు తిప్పుతూ జీర గొంతుకతో బదులిచ్చింది కృపమ్మ.

"అం ఏం దేవుల్లో, ఏం సిత్తమో కుపమ్మా ... దేవుళ్ళే బయపడి గుళ్ళలో గోపురాల్లో నక్కినట్టుంది. ఈ ఉప్పాతం పాడుగాను... ఇంకా ఎంత కాలం కాలుసెయ్యి ఆడకుండా ఇట్లా కొంపల్లో బడి సావాలో ఏమోనే" మళ్లీ నిట్టూర్చింది జానికమ్మ.

"అవును జ్యానికక్క... ఈ ఐరసు గత్తర ఇంకెంత కాలం ఉంటాదో ఏమో. మనలాంటోళ్ళకు కొంపల్లో గూకుంటే ఎట్లా ఎల్లది జెప్పు? మా పెద్దోడి పెళ్ళం పెట్టె ఆ రేసను పప్పు కూర తినీ తినీ నా పొట్ట ఎట్టా ఉబ్బిపోతుందో సూడక్క" అని తన వొంటిమీది మాసివున్న ముతక చీరను పక్కకు తీసి తన పొట్టను చూపిస్తూ తన బాధను చెప్పుకుంది కృపమ్మ.

దయమ్మ ఇంకా పెద్దగా మొత్తుకుంటుంది.

"అరె రవీ... ఆదిబాబూ... కుమారీ... ఒక్కళ్ళు రారేందిరా? నా తమ్ముడు ఐరస్ తోబోతే అది మీకూ అంటుగుంటదని నక్కిగూసున్నారేంట్రా? నిన్న రేత్రి దాక – "అక్క నేను పోతే వాడ వాడెల్లి వచ్చి ఏడవాలక్క.. నా 'శోకాల ముటా' మనుసులే నన్ను కాటికి మోయాలక్కా' అని పొద్దాకా అడుగుతూనే ఉన్నాడ్రా నా తమ్ముడు. మనందరి కోసం బతుకంతా ఏడ్చిన మన శోకేస్ కోసం ఒక్క నిమిసమన్నా వచ్చిపొండి రోయ్. నా దేవుడోయ్... ఓ నా బిడ్డో... ఒక్కడికి యిస్వాసం లేకుండా పోయిందేరో...." అంటూ నెత్తిగొట్టుకుంటూ విలపిస్తోంది దయమ్మ.

దయమ్మకు పద్నాలుగోయేటనే పెళ్ళి చేస్తే ముప్పయి నాలుగో యేడు వచ్చే వరకు పిల్లలు పుట్టలేదు. మొగుడొదిలేస్తే వచ్చి కూలీనాలీ చేసుకుంటూ పుట్టింట్లోనే ఉండిపోయింది.

తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత ఉన్న ఒక్క తమ్ముడు శోకేశ్‌ని తనే సాకింది. విద్య నేర్పించలేకపోయినా బుద్ధి మాత్రం నేర్పింది. ఈ మధ్య వయసుపైబడుతున్న ఆమెను కష్టపడనివ్వ కుండా శోకేశ్ ఆమెను పోషిస్తున్నాడు. ఐతే గతరాత్రి శోకేశ్ కరోనాతో చనిపోవడంతో నిన్న మొన్నటి వరకూ 'శోకేసన్న లేకపోతే మాకు బతుకేలేదు' అన్నవాళ్లు ఇప్పుడు ఒక్కరు కూడా ఆ ఇంటివైపుకి కూడా చూడకపోవటం ఆమె దు:ఖాన్ని రెట్టింపు చేస్తుంది. తోటివారి నిర్దయ, అమానవీయత ఆమె గుండెను గుచ్చి గుచ్చి గాయపెడుతుంటే అలా అందర్నీ నిందిస్తూ రోదిస్తోంది.

మనిషి మనిషికీ మధ్యన ఉన్న చిరకాల మానవ బంధాలు తెగిపోతూ 'మీ ఇంటినుంచి మా ఇంటికెంత దూరమో – మా ఇంటినుంచి మీకంతే దూరంలే!' అని అనుకుంటూ ఎవడి బతుకువాడు ఇంటిలో ఒంటిగా బతకటం బాగా అలవాటవు తున్న వేళ ఈ కరోనా మనుషుల మధ్య ఇంకా పెద్ద అంతరిక్ష దూరాలను నిర్మించింది. ఐతే అందరు వేరు – ఆ నల్లోరి పాలెంలోని ఆ వాడలోని జనాలు వేరు. నిన్న మొన్నటి వరకు వాళ్ళంతా ఎంతో ఆత్మీయంగా అతుక్కొనే జీవిస్తున్నారు. కానీ ఆ ఊర్లో కరోనా మొదటి దశలో ఆరుగురు, బీభత్సంగా మృత్యుపాశం విసిరిన రెండో దశలో ఎనిమిది మంది వరకూ చనిపోవటంతో ఆ ప్రాంతంలో ప్రతి గుండెలో చావు గుబులు చిక్కగా గూడుకట్టుకుంది. ఊరి సర్పంచి తల్లి కూడా కరోనాతో చనిపోవటం వల్ల ఆయన ఫోను స్విచ్ఛాప్ పెట్టి క్వారంటైన్లో ఉండటం వల్ల పట్టించుకునే నాథుడు ఎవరూ లేరు ఆ సమయంలో.

ఆ రోజు నల్లోరిపాలెం ఊరి వీధులన్నీ మారుమోగేలా విలపించిన దయమ్మ శోకం పొద్దుగూకే వేళకు లోతైన పాడుబడ్డ దిగుడుబావి చీకట్లో పాము కోరల్లో చిక్కుకొని కీచుమని అరిచే కప్పపిల్ల అరుపులా పేలగా వినిపిస్తుంది .

"అయ్యో నా తమ్ముడా... మాకు 'ఏడుపు'తో బతకటం నేర్పవు గదరా తండ్రీ... నీ పేరే మారిపోయి ఆకరికి శోకేస్ అయ్యావు గదరా ..."

**1**

అవును ... దయమ్మ పదే పదే అనే ఆ మాటల ద్వారా అర్థమయ్యే విషయం – శోకేశ్ అనే యువకుడు వాళ్లకు 'ఏడుపు'తో బతకటం నేర్పాడు. శోకాన్నే ఒక జీవికగా మార్చాడు. నిజానికి అతని అసలు పేరు 'శోకేశ్' కాదు ... సంతోష్! ఆ సంతోష్ ఇప్పటి 'శోకేశ్'గా మారటం వెనుక పెద్ద విషయమే ఉన్నది.

నల్లోరిపాలెం, చుట్టు పక్కల గ్రామాల భూములు మణులు పండే మాగాణులు. ఎంత సారం గల నేలలంటే సాలిరవాలు దున్ని గింజలేసి అటు తిరిగి చూడకపోయినా మూడు నెలలకు మూడు లక్షలు చేతబట్టుకోవచ్చనే పేరుంది ఆ చేలకు. కానీ అక్కడి రైతులు, పెద్ద మోతుబరులు, వాళ్లతో పాటు మిగతా పెద్ద కుటుంబాల వాళ్ళు, వ్యాపారస్తులు విద్య అనో, వైద్యమనో, విలాసాలకోసమనో తమ భూముల్ని కౌలుకు వదిలి సుదూర నగరాలకు వలసెల్లిపోయారు. ఇక వాళ్ళ పిల్లలు, మనవళ్ళు, మనవరాళ్ళు ఇంకా సుదూర దేశాలకు వెళ్ళిపోయారు. ఊరిలో ఉన్న గడీల్లాంటి పెద్ద పెద్ద ఇళ్ళలో వాళ్ళ వయసుడిగిపోయిన తల్లులు, తాతలు మాత్రమే మిగిలిపోయారు. వీళ్ళతో పాటు నగరాలకు వెళ్ళటం ఇష్టం లేక ఉండిపోయిన వాళ్ళు కొద్దిమంది ఉంటున్నారు.

కొన్నేళ్ల క్రితం వరకు అలా నగరవాసం వెళ్ళిపోయిన వాళ్ళ ఇళ్ళలో తమవారు ఎవరైనా ఊళ్లో చనిపోతే బంధువులు, స్నేహితులు అంతా వచ్చి ఆ వ్యక్తికి అంతిమయాత్ర ఘనంగా నిర్వహించేవారు. చిన్నరోజు, పెద్దరోజు తదితర కర్మ క్రతువులు ఇంకా ఘనంగా నిర్వహించే వారు. విదేశాల్లో ఉన్న రక్త సంబంధీకులు కూడా కొందరు హుటాహుటిన బయల్దేరి వచ్చేవారు.

కానీ ఈ మధ్య ఆ ఊరిలో పెద్దవాళ్ల కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే బంధువులు, స్నేహితులు రావటం పూర్తిగా తగ్గిపోయింది. పాతికేళ్ళ పాటు ఊరికి సర్పంచిగా పనిచేసి ఉత్తమ సర్పంచిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు పొందిన లక్ష్మారెడ్డి గారి భార్య చనిపోతే కేవలం ఓ రెండు మూడు కుటుంబాల నుంచే చుట్టాలు వచ్చి కనాకష్టంగా ఓ పూట ఉండి చూసిపోయారు. ఆయన భార్యకు చాలా దొడ్డమనిషి అని పేరుంది. ఆ చుట్టుపక్కల ఆమె చేతుల నుంచి సాయం పొందని చేయి లేనేలేదని చెప్పుకుంటారు. అటువంటి మనిషి చనిపోతే ఓ ఏడెనిమిది మంది రక్త సంబంధీకులు మాత్రమే వచ్చి, ఏదో ఫార్మాలిటీకన్నట్లు నాలుగుబట్లు రాల్చి వెళ్ళిపోయారు. లక్ష్మారెడ్డి పొలాల్లో పనిచేసే కూలోళ్ళు మాత్రమే ఎక్కువమంది కనపడ్డారక్కడ. దీంతో నగరాల్లో, విదేశాల్లో సెటిల్ అయిన తమ చుట్టాలు, స్నేహితుల మీద లక్ష్మారెడ్డికి మహా కోపం వచ్చింది. అసలే మహా రోషగాడైన ఆయనకు కోపం వస్తే అది ఆ ఊళ్లో అంటువ్యాధిలా వ్యాపిస్తుందని అంటుంటారు. ముఖ్యంగా అపుడే ఊరిలోని పెద్ద కుటుంబాలు, ధనిక కుటుంబాల్లోని పెద్ద వయసు వాళ్ళందరికీ రోషం పొడుచుకొచ్చింది. ఒక రోజు అంతా కూర్చొని చాలా సేపు సమావేశమై చాలా సీరియస్‌గా చర్చించుకున్న మీదట ఓ గట్టి తీర్మానం చేసుకున్నారు. దాని ప్రకారం ఆ ఊళ్లో తమ

కుటుంబాల్లో ఎవరు చనిపోయినా నగరాల్లో, విదేశాల్లో ఉన్న తమ బంధువులు, స్నేహితులు చివరికి తమ కొడుకులు, కూతుళ్ళు, మనవళ్లు, మనవరాళ్ళు ఎవరు రాకపోయినా తాము అసలు బాధపడవల్సిన పనే లేదని, చనిపోయిన వారి అంతిమయాత్రకు పెద్ద సంఖ్యలో జనాలు హాజరు కావటానికి చనిపోయిన వ్యక్తి కోసం గట్టిగా రోదించటానికి మనుషుల్ని పెట్టుకోవాలని ధృడంగా నిర్ణయం చేశారు!

అలా ఆ నల్లోరిపాలెంలో పెద్ద కుటుంబాల్లోని వారు తీసుకున్న నిర్ణయం వల్లనే ఈ 'సంతోష్' అనే అబ్బాయి 'శోకేశ్'గా రూపాంతరం చెందాడు. శోకేశ్‌గా మారిన ఈ సంతోష్ తండ్రి మల్లయ్యదాసు మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డికి జీవితాంతం అన్నిట్లో చేదోడువాదోడుగా ఉండేవాడు. ఆటకైనా వేటకైనా ఆ రోజుల్లో ఇద్దరూ కలిసి వెళ్ళాల్సిందే. కులం గోత్రం ఆస్తులు అంతస్తులకు అతీతంగా సాగింది వారిద్దరి దోస్తానా. ఐతే మల్లయ్యదాసు క్షయ బారినపడి అకాల మరణం చెందడంతో లక్ష్మారెడ్డి చాలా కాలం తాను ఏకాకినైనట్లుగా కలత చెందాడు. దీనివల్ల మల్లయ్యదాసు కొడుకైన సంతోష్ అంటే అతనికి ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ఆ కుర్రవాడు కూడా ఆ పెద్దాయని 'రెడ్డి తాతా' అంటూ చనువుగా పిలుస్తూ అవసరమైనప్పుడు వచ్చి కావల్సిన పనులు చేసి పెడుతుండేవాడు. సంతోష్ అసలు పని రామస్వామి బ్యాండుమేళంలో కీబోర్డు వాయించటం. పెళ్ళిళ్ళు వేడుకలు లేని రోజుల్లో కూలిపనులు చేసుకోవటం. మరీ ఏదన్నా ఇబ్బంది పడుతున్నపుడు లక్ష్మారెడ్డి అతనికి సాయం చేస్తుండేవాడు.

ఆ ఊరిలో పెద్ద కుటుంబాల్లోని పెద్ద వయసు వాళ్ళంతా ఆ తీర్మానం చేసుకున్న రోజు సాయంత్రం సంతోష్ తమ రెడ్డి తాతకు ముంజలు కోసివ్వడానికి వచ్చాడు. వాళ్లిద్దరూ అరుగు మీద కూర్చొని కాలక్షేపంగా మాట్లాడుకుంటూ ఉండగా లక్ష్మారెడ్డి మాటల మధ్యలో సంతోష్‌కు తమ వయసు వాళ్ళంతా చేసుకున్న ఆ తీర్మానం గురించి ప్రస్తావించాడు.

అది విన్న సంతోష్‌కు టక్కున ఒక సంఘటన గుర్తొచ్చింది. దానితో పాటే ఓ మెరుపు ఐడియా కూడా తట్టింది. చాలా రోజుల క్రితం తండ్రి మల్లయ్య దాసుని ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిలో చేర్పించి క్షయ వ్యాధికి వైద్యం చేయిస్తున్నపుడు ఒకరోజు పండ్లు బ్రెడ్డులాంటివి కొనుక్కొని రావటానికి బైటకెళితే ఎవరిదో శవయాత్ర సాగుతుంది. ఐతే వెంట నలుగురైదుగురు కూడా లేరు. అప్పుడో పెద్దాయన సంతోష్‌ని రోడ్డు మీద వెళుతున్న కొంతమందిని ఆపి శవయాత్రలో పాల్గొంటే పైసలిస్తామని చెప్పటంతో తనూ వాళ్లతో చేరి శ్మశాన వాటికకు చేరుకున్న తర్వాత ఇచ్చిన పైసలు తీసుకొని ఆస్పత్రికి వచ్చాడు. ఆ డబ్బులతో తండ్రికి రెండు మూడు పాటు కావలసినవి కొనివ్వగలిగాడు. ఈ విషయం గుర్తుకు రాగానే తన ఆలోచనను లక్ష్మారెడ్డి తాతతో పంచుకున్నాడు.

"రెడ్డి తాతా ... మంచి పని చేశారు. మనషులెట్లా మారిపోయారో గదా ఈ రోజుల్లో. ఎక్కడో ఉన్న అయినోళ్ళను నమ్ముకొని శవాలను ఇంటిముందు పెట్టుకుంటే అవి కుళ్ళిపోవటమే గదా! మీరు తీర్మానం చేసినట్లు ఎవరింట్లో ఏడవటానికి మనుషులు అవసరమైనా నేనే పట్టుకొస్తాను! నాకే అవకాశం ఇవ్వాలి మీరు!" అని తన అలోచన చెప్పి ఆయన్ని ఒప్పించాడు.

'చారిత్రక యుగం నుంచి వివక్ష, దాని వల్ల కలిగిన దరిద్రాన్ని అనుభవిస్తూ తమ శోకాన్నే జీవన శ్లోకంగా ఆలపిస్తున్న అభాగ్య జాతుల దు:ఖం వాళ్ళ గుండెల్ని పిండి చేసిందే తప్ప, ఆ దు:ఖం ఏనాడూ వారికీ ఏ దారి చూపలేదు. ఇప్పుడు వాళ్ళకు వందల తరాల నుంచి అలవాటయిన ఆ దుఃఖమే ఓ భుక్తిమార్గమైతే ఎందుకు వదులుకోవాలి అని ఓ బడుగు జీవి అనుకోవటంలో ఏ వింతగాని, తప్పుగానీ లేదు కదా?

**2**

ఆ మరుసటి రోజే సంతోష్ ఊళ్లో పనిచేయలేని ముసలి వాళ్ళను, పని చేద్దామన్న దొరకని అభాగ్యుల్ని, పని చేయటానికి పనికిరాని వాళ్లుగా మిగిలిపోయిన అవిటి వాళ్లను, కొద్దీ గొప్ప చదువుకుని పనీపాటా లేకుండా తిరుగుతున్న రవి, ప్రసాదు లాంటి వాళ్లను, ఇంకా ఒంటరి మహిళల్ని పోగేసి వాళ్లకు విషయం వివరించాడు. వాళ్ళు విన్నవెంటనే ఫక్కుమని నవ్వారు. కానీ సంతోష్ పట్టు వదలేదు. పనిలేక, పని దొరక్క, లేదంటే బద్దకించి ఇళ్ళలో ఊరికినే పడుకునే బదులు ఇంట్లో పదీ పాతిక కోసం దేబిరించే పనిలేకుండా వాళ్ళే ఇంట్లో వాళ్ళకి ఎంతో కొంత సాయం చేయొచ్చని చెపుతూ చాలా అనునయంగా వాళ్ళని ఒప్పించాడు. మొత్తంగా ఆడోళ్ళు మగాళ్ళు కలిపి పాతిక మందితో ఒక శోకాల ట్రూపును సిద్ధం చేసుకున్నాడు.

ఇప్పుడు ఊళ్లో ఎవరన్నా పెద్ద రైతులు, కలిగిన కుటుంబాల వాళ్ళు చనిపోతే సంతోష్ బృందానికి చేతి నిండా పని – జేబులు నిండా మనీ! వీళ్ళంతా నల్ల రంగు యూనిఫాం లాంటిది ధరించి శవం చుట్టూ కూర్చొని చనిపోయిన వ్యక్తి గుణగణాలను ఏకరువు పెడుతూ అసలు బంధువుల కంటే వీళ్ళే గట్టిగా రోదించేవారు. మధ్య మధ్యలో విషాద గీతాలు కూడా పాడేవారు. ఇదంతా ఓ దీర్ఘ కచేరీలా సాగేది. తర్వాత పాడెకు, దాన్ని మోసే వాహనానికీ తీరొక్క పూలతో అలంకరణ, పెద్ద బ్యాండు మేళం, థౌజండ్

వాలా టపాకాయల మారు మోతల్లో 'ఇది శవయాత్ర లేక మైసూరు ఉత్సవాల ఊరేగింపా!' అన్నట్లుగా హడావిడి చేయించే వాడు సంతోష్. ఏడుపు, ఊరేగింపు కలిపి ముందే కూలి మాట్లాడుకునేవారు. కొద్ది రోజుల్లోనే ఆ ప్రాంతం మొత్తం వాళ్ళ శోక బృందం బాగా పాపులర్ అయింది. ఇక చనిపోయిన వాళ్ల బంధువుల్లో చాలామంది తమ ఉద్యోగాలకు సెలవులు పెట్టి తమ పనులు పక్కన బెట్టి పల్లెటూర్లకు పరిగెత్తాల్సిన అవసరం లేకుండా పోయినందుకు చాలా రిలీఫ్ పొందినట్లుగా భావించారు. సంతోష్ తన బతుకు తెరువుతో పాటు తన తోటి వారికీ దారి చూపించగలిగాడు.

ఒక రోజు తద్దినాలు పెట్టే పంతులు గారు సంతోష్ ని ఆట పట్టిస్తూ "అబ్బాయి... నిన్నిక సంతోష్ అని కాకుండా ఈ కొత్తరకం శోకాల టీంకి లీడరువి కాబట్టి నిన్ను 'శోకేశ్' అని పిలుస్తామోయ్!" అని తమాషాకి అనటంతో అందరూ అతడిని అలాగే పిలవటం మొదలుపెట్టి చివరికి అతనికి ఆ పేరే స్థిరపడిపోయింది. ఇక ఊళ్లో ధనిక కుటుంబాల నుంచే గాకుండా ఈ మధ్య కాలంలో ఉద్యోగాలు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ముందుకెళ్ళిన కుటుంబాల వారు కూడా ఈ శోకబృందాన్ని పిలిపించుకుని ఏడిపించుకోవడం మొదలైంది. చుట్టుపక్కల టౌన్లకు కూడా ఈ గ్రూపు గురించి వార్తలు వెళు_న్నాయి.

అలా తనకు తన మనుషులకు తిండికి, బట్టకి ఏ కరువూ లేకుండా ముందుకెళుతూ నాలుగు రూపాయలు సంపాదించుకునే సమయానికి వాళ్ళ కాళ్ళకు కరోనా కట్టెల బంధం వేసింది. ఆ ప్రాంతం మొత్తం కరోనా వైరస్ విలయ తాండవం చేయడంతో చనిపోయిన వాళ్లను నగరాల్లో మున్సిపాలిటీ వాళ్ళే అక్కడికక్కడే ఖనన, దహన కార్యక్రమాలు నిర్వహించటం ఊళ్ళల్లో కూడా పోలీస్ వాళ్ళు శవయాత్రలకు ఎక్కువ మందిని అనుమతించకపోవడం వల్ల శోకేశ్ మనుషులకు నోట్లో మట్టి బడ్డట్టయింది. శోకేశ్ ఎంతో మనోవ్యాకులతకు గురయ్యాడు. తన వాళ్ళంతా ఆ క్లిష్ట కాలంతో ఏ పని దొరకక వాళ్ళంతా పడే ఇక్కట్లను చూసి కుదేలయ్యాడు, దానికి తోడు లాక్‌డౌన్ ఆంక్షలు ఉదయం మూడు గంటలపాటే మినహాయింపు. తన శోకబృందం వాళ్ళకు ఏదైనా పని చూపాలని అనుకుంటున్న సమయంలో లక్ష్మారెడ్డి గారు కరోనాతో చనిపోయాడనే వార్త తెలిసి గుండెపగిలేలా విలపిస్తూ తన బృందాన్ని తీసుకొని ఆయన కడసారి చూపుకోసం బయల్దేరాడు.

ఎంతో కష్టం మీద పోలీసు, వైద్య సిబ్బందికి, ఎమ్మెల్యే గారితో చెప్పించి ప్రత్యేక అనుమతితో లక్ష్మారెడ్డి మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగలిగాడు ఆయన మేనల్లుడు. ఆయన కొడుకు కూతురు అమెరికాలో ఫ్లైట్స్ రాకపోకల నిలిపివేత వల్ల రాలేకపోయారు. శోకేశ్, అతని బృందం పోలీసుల్ని ఎంతో ప్రాధేయపడి ఆయన అంతిమయాత్రలో పాల్గనే అనుమతి పొందారు. వారంతా అయన చివరి యాత్రను పెద్ద ఉత్సవ ఉ రేగింపులా నిర్వహించారు. ఆ రోజు వారంతా తమకు వచ్చిన దైవ కీర్తనలు పాడుతూ ఆయనతో తమ జ్ఞాపకాలను ఎన్నో చరణాలుగా మలచి వాద్యసహితంగా అలాపిస్తూ ఆయనను పాడెపై మరుభూమికి పంపినట్లుగా కాకుండా శ్వేతాశ్వంపై స్వయంవరానికి బయలుదేరిన తమ యువరాజుని సాగనంపినట్లుగా చాలా కోలాహలమే చేశారు. అయితే తన జీవితాంతం ఎటువంటి పెత్తందారీ పోకడలు పోకుండా తన ప్రేమఛత్రం కింద ఎందరికో నీడనిచ్చిన లక్ష్మారెడ్డి తాత అంటే అందరికీ ఎంతో అభిమానం ఉన్నప్పటికీ అయన కరోనాతో చనిపోవటం వల్ల ఆ రోజు అయన శవాన్ని తాకటానికి ఎవరూ సాహసించలేదు. అప్పుడు శోకేశ్ మరో ఇద్దరితో కలిసి బాడి బ్యాగ్‌లోని ఆయన శవాన్ని గుడ్డల్లో చుట్టి పాడెపైకి చేర్చాడు. ఇది జరిగిన వారం తర్వాత శోకేశ్‌కు చాలా సుస్తీ చేసి పరీక్ష చేయించుకుంటే కరోనా పాజిటివ్ అని తేలింది. నిజానికి లక్ష్మారెడ్డి తాత అంతిమ సంస్కారాలప్పుడు దానికని దీనికని అటూ ఇటూ చాలాసార్లు టౌనుకి వెళ్ళి వచ్చే సందర్భంలో అతను ఇన్ఫెక్ట్ అయ్యుంటాడు. కానీ కరోనాతో చనిపోయిన లక్ష్మారెడ్డి మృతదేహాన్ని పట్టుకోవటం వల్లనే అతనికి కరోనా వచ్చిందని ఊరంతా బలంగా నమ్మటం మొదలు పెట్టారు. ప్రైవేటు వేటుకి, కార్పొరేటు కాటుకి తట్టుకొని వైద్యం చేయించుకోలేని పేదవాళ్ళు. నల్లోరిపాలెం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి కూడా ముప్పై కిలోమీటర్లు ఉంటుంది. అక్కడికెళ్తే వాళ్లు మందుల కిట్ యిచ్చి బెడ్స్ ఖాళీ లేవని పంపారు. ఆ మందుల్నే వాడుకుంటూ ఇంట్లోనే ఉండిపోయాడు. దయమ్మ అతన్ని కంటికి రెప్పలా చూసుకుంది. ఐతే రెండు వారాలపాటు కరోనాతో బాధపడిన శోకేశ్ ఒక దశలో కోలుకున్నట్లే కన్పించినా ఒక అర్ధరాత్రి వేళ శ్వాస కష్టమై ఊపిరొదిలాడు. తన తోటివారి కోసం ఎప్పుడూ తపించిన శోకేశ్‌ని కడసారి చూడటానికి, చూసి రెండు కన్నీటి బట్లు రాల్చడానికి గాని ఎవరూ రాలేకపోవటం చూసి అతని అక్క దయమ్మ ఇప్పుడు అతని శవాన్ని ముందు బెట్టుకొని విలపిస్తోంది.

శోకేశ్ ఇంటి వెనుక రోటిబండపై కూర్చొని దయమ్మ ఏడుపు వింటూ చీర కొంగులతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్న ఇద్దరు ముసలవ్వల్లో ఉద్వేగంతో కూడిన ఓ కదలిక మొదలైంది. నేలపై చేతి కర్రను గట్టిగా పోటు వేస్తూ "కుపమ్మా... ఎవదూ రాకపోతే

ఏంటే... లేమ్మా... లే... శోకేసు మన బిడ్డడు... మన బిడ్డలకు కూడు పెట్టించినోడు. మనమే ఆ అయ్యను సెరువొడ్డుకు మోసుకుపోయి మట్టిలో కలిపొద్దం రా.." అంటూ వొణికే మోకాళ్ళ మీదనే పైకి లేచింది జానికమ్మ.

''అవునక్కా.. నిండు బతుకులు బతికినోల్లం... కట్టం సుకం అన్ని చూసినాం. చాలా అనుబగించాం. మనకెందుకంత ప్యానం మీద తీపి... లే... పద.. నేనూ వత్త" అంటూ తనూ లేచింది కృపమ్మ. అరవైయేళ్ళు దాటిన ఆ ముసలవ్వలు ఇంట్లోవాళ్ళు వెనుక నుంచి పోవద్దని అరుస్తున్నా లెక్క చేయకుండా శోకేశ్ ఇంటివైపుకు అడుగులు వేయసాగారు.

## 3

"అరేయ్ ప్రసాద్... ఇదిగో ఈ వీడియో చూడరా.. వాట్సప్‌లో వచ్చింది. ఈ పెద్దాయన ఎవరో సోషల్ వర్కర్ అంట. చూడు కరోనాతో చనిపోయిన మనిషి డెడ్‌బాడీని భయం లేకుండా ఎలా తాకుతున్నడో... ముఖంలో ముఖంపెట్టి రుద్దుతున్నాడు.. పైగా నుదుటిపై ముద్దులు కూడా పెడుతున్నాడు. చూడు చూడు" అంటూ కంచెకు అవతల పక్కింట్లో ఉన్న తన దోస్తుకు చూపించాడు రవి. వాళ్ళిద్దరూ శోకేశ్ బృందంలో సభ్యులే. పైగా అతనికి బంధువులు కూడా. ఇద్దరూ ఇంటర్ వరకు చదివి ఇంటికష్టాలు చూడలేక పనుల్లోకి దిగి ప్రైవేటుగా డిగ్రీ చేస్తున్నారు.

"ఏంట్రా ఆయనకేమన్నా పిచ్చి లేచిందా.. అది చాల డేంజర్ గదరా" అసలే ప్రతి చిన్న దానికి గుడ్లు తేలేసే ప్రసాదు పూర్తిగా విప్పారిన పత్తి పూవులంత కళ్ళను ఉబ్బించి బెరుకుగా చూసాడు.

"ఏమోరా ప్రసాద్... కరోనాతో పోయిన మనుషుల శవాలను ముట్టుకున్నంత మాత్రాన అందరికీ కరోనా వస్తుందనేది పూర్తి నిజం గాదని చెప్పటం కోసమటరా.. మనుషుల శవాల్ని అలా కుక్కల కళేబరాల్లా పారెయ్య వద్దని, గౌరవంగా అంత్యక్రియలు చేయమని చెప్పటం కోసమే ఈయన అలా చేసాడంట" వివరించాడు రవి.

"మరి ఇంతకూ ఆయనకు కరోనా వచ్చిందంటా? లేదా?"

"రాలేదంట! ఇదిగోరా ఆయన తన నెగిటివ్ రిపోర్టులు కూడా పెట్టాడు. ఈ వీడియోతో పాటే అవీ ఉన్నాయి... ఇదిగో చూడు."

ప్రసాద్ మళ్ళీ కళ్ళు తేలేసాడు.

"ఐతే రవీ... ఆయన కరోనా టీకా ఏయించుకునే ఉంటాడ్లేరా! లేదంటే ఒకసారి కరోనా వచ్చిపోయిన తర్వాత మళ్ళీ వచ్చినా అంత సిరియస్ గాదని చెపుతున్నారుగా. ఈ పెద్దాయనకు కూడా అలా జరిగుండోచ్చేమోరా!"

"ఏమో... అయ్యుండొచ్చు. ఆయన మనందరికి విసిరిన ఛాలెంజ్ గురించి పక్కన బెడదాం. కానీ ఆయన ధైర్యం చూడు. మానవత్వం చూడు. మన తోటివాడు, మనందరికీ ఆదరువు చూపించిన మన శోకేశ్ చచ్చిపోతే మనం కనీసం చూడటానికి కూడా పోవటం లేదు. దయమ్మక్క ఏడుపు నా గుండెల్ని కోసేస్తుందిరా. సిగ్గుపడాలిరా మనం" అంటూ రవి ఒక్క పెట్టున బోరుమని ఏడవటం మొదలు పెట్టాడు.

ప్రసాద్ ఒక్క ఉదుటన బారుగా లేచి నిలబడ్డాడు. అతనికి ఆ నిమిషంలో తన ప్రాణం కంటే విలువైంది ఇంకేదో ఉందని అనిపించింది. క్షణంలో ఇంట్లోకెళ్ళి మాస్కులు శ్యానిటైజర్ తెచ్చుకున్నాడు – "రవీ... మనవాళ్ళందరికీ ఫోన్లు చేసి పిలువు. నాకెందుకులే అనుకోవటం కరోనా కన్న ఘోరమైన రోగం రా. ఎవరైనా పోతే నాలుగు కన్నీటి బట్లు రాల్చడానికి నలుగురు మనుషులు లేనప్పుడు మనల్ని ఆ పోయినోళ్ళకు ఆత్మ బంధువుల్లా అనుకోమని వాళ్ళ కోసం మనల్ని ఏడిపించి ఆ ఏడుపుతోనే మనల్ని బతికించిన వాడి కోసం మనం వెళ్ళి ఏడవటం కాదురా... అవసరమైతే చావాలి." అంటూ బయటకు నడిచాడు.

రవి తమ శోకబృందంలోని అందరికీ కబురు చేశాడు. ఫోన్లు చేసి చాలా ధైర్యం చెప్పి బతిమాలినా పదిమంది మాత్రమే వచ్చారు.. ఐతే వాళ్ళలో ముసలివాళ్ళు తమకు బదులుగా ఇంట్లో కుర్రోళ్ళను సాయంగా పంపగా మొత్తం పాతిక మంది పైగా పోగయ్యారు. అంతా మాస్కులు పెట్టుకొని శోకేశ్ ఇంటికి చేరుకునే సరికి అక్కడి దృశ్యం చూసి నోరెళ్ళ బెట్టారు. అప్పటికే ఆ ఇద్దరు ముసలవ్వలు, దయమ్మ శవాన్ని గుడ్డల్లో చుడుతున్నారు. రవి, ప్రసాద్ మిగతా వాళ్ళు పరిగెత్తుకెళ్ళి వాళ్లను వారించి దూరంగా నిలబెట్టారు. వాళ్ళందరినీ చూసిన దయమ్మకు మనసు కాస్త ఊరట చెందింది.

శోకేశ్ బృందంలోని మల్లేష్, మరో ఇద్దరు కలిసి వాళ్ళందరి దగ్గరున్న డబ్బులు పోగుజేసి ఊరి ఏఎన్నెమ్ సాయంతో పీపీఈ కిట్లు ఓ నాలుగు, ఇంకా ఖనన సంస్కారాలకి కావలసినవి తీసుకొచ్చారు. వాళ్ళ బృందంలోని ధనమ్మ ఇంకా మిగతా ఆడవాళ్ళు చుట్టుపక్కల ఇళ్ళలో నుంచి పూలు కోసుకొచ్చి దండలు అల్లారు. రామస్వామి తన బ్యాండు మేళం సిద్ధం చేశాడు. అంతా కలిసి చుట్టుపక్కల గ్రామాల్లో పేరు మోసిన ఓ పెద్దనో లేక ఓ నాయకుడో మరణిస్తే ఎంత ఘనంగా అంతిమయాత్ర నిర్వహిస్తారో అంత ఘనంగా ప్రేమార్ద్ర హృదయాలతో వారు తమ శోకేశ్‌ను మరుస్థలికి సాగనంపారు.

తర్వాతి రోజుల్లో శోకేశ్ చూపినదారే ఓ కొత్త వృత్తిగా మారి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో గూడా అటువంటి శోక బృందాలు




# అమ్మకానికి మీడియా దుర్భరంగా మనుగడ

- తెలకపల్లి రవి

**క**రోనా నేపథ్యంలో సంప్రదాయ మీడియా... మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా వుందని 'వైర్' పత్రిక వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎం.కె.వేణు ఇటీవల పతాక కథనం రాశారు. పత్రికలు, టీవీ ఛానళ్లు కష్టనష్టాలలో మునిగి పాలకులకు సన్నిహితులైన కార్పొరేట్ల గుప్పిట్లోకి పోతున్నాయని ఆయన ఉదాహరణలతో సహా చెప్పారు. లేదంటే పైకి చెప్పని సబ్సిడీదాతలు వాటిని నడిపిస్తున్నారు. దేశంలో మీడియాను మోడియాగా మారుస్తున్నారనే కథనాలు, కల్పిత వార్తల కలవరం, టీఆర్‌పి స్కామ్‌లలో అరెస్టులు, సుప్రీం కోర్టు దాకా వెళ్లగా మీడియా సంస్థలపై దాడులు మరోవైపు సాగుతుండగా ఈ పరిణామ క్రమం ఆందోళనే కలిగిస్తోంది.

ఇదే సమయంలో సోషల్ మీడియా డిజిటల్ మీడియా విస్తరించడం, అందులోనూ అధిక భాగం అధికార పార్టీల స్పాన్సర్డ్ తరహాలో నడుస్తుండగా ప్రత్యామ్నాయ ప్రజాశక్తుల ప్రయత్నాలు కూడా చూస్తున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలోనే సోషల్ మీడియాను తనకు వ్యతిరేకంగా వాడుతున్నారని ట్రంప్ ఆరోపణలు చేయడం, మోడీ సర్కార్ కూడా తమ మంత్రుల ట్వీట్లను తొలగించారని తగాదా పెట్టుకోవడం, పార్లమెంటరీ కమిటీ ముందుకు ఈ సంస్థల ప్రతినిధులు రావడానికి నిరాకరించడం చూశాం. ఎపిలో ఎల్లో మీడియా, బ్లూ మీడియా ఆరోపణలు, తెలంగాణలో మీడియా కెసిఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదనే ఫిర్యాదులు వింటున్నాం. అయితే రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శ చేసే కొన్ని మీడియా శక్తులు బిజెపి విషయంలో గప్‌చుప్‌గా వుండటం, లేదంటే నామకార్థంగా సరిపెట్టడం ఇంకో వాస్తవం. వీరంతా కూడా పాలక పార్టీల మధ్య గిరిటీలు కొట్టడం తప్ప ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామిక లౌకిక విలువల వంటి అంశాలను పక్కకు ఉపేక్షించడమూ జరుగుతోంది. ఈ మధ్యలో పత్రికలు, చానళ్ల సిబ్బంది జీవితాలు తలకిందులు కావడం మరో కఠోర వాస్తవం. వామపక్ష పత్రికలు మాత్రమే సమరశీల ఉద్యమాలను బలపరుస్తూ సమతుల్యంగా వుండే ప్రయత్నం చేస్తున్నా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

### పడిపోయిన ఆదాయాలు, సాంకేతిక మార్పులు

దేశంలో అత్యగ్ర స్థానాన వుండే 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రచురణకర్త బెన్నెట్ కాల్మన్ కంపెనీతో సహా సంక్షోభంలో చిక్కాయి. 'టైమ్స్' సర్క్యులేషన్ 2020లో సగానికి సగం తగ్గి తర్వాత కొద్దిగా కోలుకుంది. ఏడాదికి ఏడు వేల కోట్ల వ్యాపారం జరిగినా గతానికి చేరుకునే అవకాశం ఎక్కడా లేదట. దక్షిణ భారతంలో ప్రతిష్ఠాత్మకమైన 'హిందూ', ఉత్తరాదిన 'హిందూస్తాన్ టైమ్స్' వంటివి కూడా దెబ్బతిన్నాయి. ఇదంతా కేవలం కరోనా కారణంగానే కాదు. కరోనా పత్రికల క్షీణతను వేగిరపర్చిందే గాని ఏకైక కారణం కాదు. మొదట టీవీ ఛానళ్లు తర్వాత డిజిటల్ మీడియా తెచ్చిన సాంకేతిక మార్పులు ఇందుకు ప్రధాన కారణం. ఇప్పుడు యువతలో 40 శాతం మొబైల్ ఫోన్లలో లాప్‌టాప్‌లలో తప్ప పత్రికలు పట్టుకుని చదవడానికి ఇష్టపడటం లేదని రాయటర్స్ సర్వేలో తేలింది. కరోనా వల్ల పంపిణీ నిలిచిపోవడం దీన్ని అలవాటు చేసింది. ఉధఅతి తగ్గాక పంపిణీ పునఃప్రారంభమైనా పాత పరిస్థితి రాలేదు. పశ్చిమ దేశాల్లో పత్రికల వ్యాప్తి తర్వాత కొన్ని దశాబ్దాలకు టీవీలు వచ్చాయి. కాని ఇండియాలో దెబ్బయ్యవ దశకానికి అటూ ఇటుగా పత్రికలు టీవీలు కూడా విస్తరించాయి. 2000 సంవత్సరం మొదటి దశాబ్దంలో కూడా భారీగానే పెట్టుబడులు

పెట్టారు. అంతర్జాతీయంగా అప్పటికే పత్రికలు మూతపడే ప్రక్రియ ప్రారంభమైంది. ఆంధ్ర ప్రదేశ్‌లో విభజన ఉద్యమం మీడియానూ ప్రభావితం చేసింది. 2014 ఎన్నికల తర్వాత ఈ మార్పులన్నీ ఒక కొలిక్కి వచ్చాయి.

**మోడీ సర్కారు దాడులు, ఒత్తిళ్లు**

మోడీ ప్రభుత్వం కొద్ది కాలంలోనే మీడియా స్వేచ్ఛపై దాడులు చేయడం, హేతువాద రచయితలు, సంపాదకులపై ప్రజాపక్ష మేధావులపై దాడులు పెంచడం, అర్ణబ్ గోస్వామి వంటివారిని ఆకాశానికెత్తడం ప్రగతిశీల, మధ్యేవాద మీడియాకు విఘాతంగా పరిణమించింది. వాటిపై నేరుగా కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఇ.డి ని, ఆదాయపు పన్ను శాఖను ఉసిగొల్పి నిబంధనలు మార్చి ఆంక్షలతో వేధించడం పెరిగింది. ఎన్.డి టి.వి, వైర్, న్యూస్ స్కాన్ వంటి వాటిపై దాడులను ఇందుకు ఉదాహరణలుగా చూడొచ్చు. అసలు ప్రధాని ఏడేళ్లలో ఒక్కసారి కూడా పూర్తి స్థాయి మీడియా సమావేశం జరపకపోవడం తూష్ణీభావాన్ని వెల్లడించింది. రాష్ట్రాల్లో పాలకులు చాలామంది అదే ఒరవడిని అమలు చేశారు. ఎడిటర్లుగా యాంకర్లుగా తాము చెప్పినవారిని పెట్టి తమకు అనుకూలంగా కథనాలు ఇవ్వకపోతే ప్రసారాలు, ప్రకటనలు నిలిపివేయడం పరిపాటిగా మారింది. మామూలుగానే పాలక వర్గాల్లో ఎవరో ఒకరికి కొమ్ముకాసే అలవాటు, అవసరం వున్న మీడియాధిపతులు వారి వెనక రాజకీయార్థిక శక్తులు స్వంత ఎజెండాలను మరింత బలంగా రుద్దడమూ పెరిగింది.

**డిజిటల్ మొగ్గుకు వెనక...**

మీడియా సంస్థలకు పాఠకులు లేదా ప్రేక్షకుల ద్వారా వచ్చే ఆదాయం పరిమితం. అడ్వర్టయిజ్‌మెంట్లు అతి కీలక ఆర్థిక వనరు. అందులోనూ ఎఫ్ఎంసిజిలు (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) యాడ్స్, ప్రభుత్వాల ప్రకటనలు ముఖ్యం. దేశంలో రాజకీయ విభజన తీవ్రమైన తర్వాత వ్యాపార ప్రకటనల ఆదాయం దారుణంగా పడిపోయింది. కరోనాలో యాడ్స్ చాలా కాలం నిలిచిపోవడమే గాక నలభై శాతం రేటు తగ్గించారు. చేతికి పట్టనన్ని పేజీలు వేసిన పత్రికలు ఇప్పుడు పలచగా వస్తున్నాయి. వాటిలోని ఉద్యోగులను ఊచకోత కోశాయి. అన్నీ బాగుంటేనే వార్తా ఛానళ్లకు పత్రికలకు యాడ్ ఆదాయంలో 8 శాతం మాత్రమే వస్తుంది. అధిక భాగం వినోదపు ఛానళ్లకు వెళుతుంది. డిజిటల్ మీడియా చౌకగా అందుబాటులోకి రావడమే గాక తమ చెప్పుచేతల్లో వుంటుంది గనక యాడ్స్ అటు మళ్లుతున్నాయి. పత్రికల సర్క్యులేషన్, టీవీల రేటింగుల కన్నా డిజిటల్ మీడియాలో వీక్షకుల సంఖ్య పారదర్శకంగా వుంటుందని అడ్వర్టయిజర్లు అంటున్నారు. అన్ని చానళ్లకూ డిజిటల్ విభాగాలు ఆదాయ వనరుగా మారాయి. వాటి ప్రసారాలు కూడా అందుకు తగినట్టే మలచబడుతున్నాయి. ఈ ఆదాయంపై కమిషన్ గూగుల్, యూ ట్యూబ్, ట్విట్లర్ వంటి వాటికి ఎక్కువగా పోతుంది. వాటిలోనే వార్తలు కథనాలు చూడటం ఒకవైపు, యాడ్స్ కూడా అటు వైపు మరలాయి. సినిమాలు కూడా ఓటిటి పేరిట నెట్ ఫ్లిక్స్ అమెజాన్ వంటి వాటిలో ప్రసారమవుతుండటంతో సినిమా థియేటర్ల ప్రాభవం కొడిగట్టింది.

వీటన్నిటి ఫలితంగా పత్రికలు ఎడిషన్లు మూసివేయడం, ఇతరులకు ఇవ్వడం, వెబ్ లోకి మారడం జరిగిపోతున్నది. జీ నెట్‌వర్క్‌తో సహా అమ్మకానికి పెట్టబడుతున్నాయి. లోలోపల అమ్ముడుపోయిన సంస్థలు మరెన్నో. అందుకు నిరాకరించేవాటి పైనా ఒత్తిళ్లు. ఎన్‌డి టి.విని అదానీ కొన్నట్టు ప్రచారం జరిగి, దాని వాటాల రేట్లు కూడా విపరీతంగా పెరిగాయి. అయితే అదేమీ జరగలేదని ఆ సంస్థ అధినేతలైన ప్రణయ్ రాయ్, రాధికా రాయ్ ప్రకటించారు. న్యూస్‌క్లిక్‌ను లేనిపోని దాడులతో లంగదీసుకోవాలని ప్రయత్నించి సాధ్యం కాకపోవడంతో ఇప్పుడు ఏదో సర్వే నాటకం నడిపిస్తున్నారు. అంబానీకి తెలుగులో అతి పెద్ద మీడియా గ్రూపుతో సహా దేశవ్యాపితంగా చాలా సమాచార సామ్రాజ్యం వుంది. బిర్లాలు అంతకు ముందే రంగంలో వున్నారు. ఇప్పుడు అదానీ గ్రూపు కాలూనడంతో మీడియాలో కార్పొరేట్ పట్టు మరింత బిగుస్తుంది. ట్విటర్ వంటివి కూడా లాభాల కోసం ఆయా దేశాల పాలకవర్గాలతో ఎలాగూ అవగాహనకు వస్తాయి. డీమానిటైజేషన్ నుంచి ఇప్పటి మానిటైజేషన్ వరకూ లోతుపాతులు విప్పి చెప్పకపోగా సానుకూలంగా చిత్రించడం, జాతీయ అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రజాస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా కథనాలు ఈ క్రమంలో మరింత పెరుగుతున్నాయి. కనుకనే మీడియా స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామిక వాణిని వినిపించే కర్తవ్యం ఇంకా కష్టతరమవుతుంది.

**(26.9.2021 ప్రజాశక్తి దినపత్రిక నుంచి)**






# స్త్రీయావిష్కరణలో అవిశ్రాంత అక్షరయానం

- అయిత అనిత
89853 48424

**'స**మాధానం లేని ప్రశ్నలెన్నో వాకిట నిలబడే ఉన్నాయి ఆత్మబంధాల్ని ప్రశ్నిస్తూ.. రెక్కలు తెగిన పక్షిలా అగమ్యగోచరంగా నాలోకి నేను తొంగిచూస్తాను.. నా కోసం పోగేసుకున్న క్షణాలేమైనా ఉన్నాయా అని... నిస్సందేహంగా లేవని, చెప్పలేని మౌనాన్ని దేహం అలుముకుంటుంది"

నిజమే! ఇలాంటి పరిస్థితి స్త్రీజాతికంతటికీ ఎదురవుతున్నదే. కొత్తేమీ లేదు. వింత అసలే కాదు. అనాది నుంచి స్త్రీలు అత్యంత మనోవేదనను అనుభవిస్తూనే ఉన్నారు. నోరువిప్పి చెప్పలేని వ్యథలను మనసులో మోస్తూ పెదవి గడప దాటని మాటతో మౌనపోరాటం చేస్తూనే ఉన్నారు. అందుకనే ఈ మాటలు ప్రతి ఒక్క మహిళ మనసునూ తాకుతాయి.

"మనకంటూ ఒక్కక్షణమైనా ఉందా అసలు? జీవితంలో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే కుటుంబానికై.. భర్తకై.. పిల్లలకై.. ఇలా మనల్ని అల్లుకున్న బంధాలకై చేసిన త్యాగాలే కానీ... మన అస్తిత్వపు ఛాయ ఎక్కడా కానరాదు" బతుకంతా బంధాలకై పాకులాటే గానీ మనకై మనం గడిపిన సందర్భమూ లేదు. మనల్ని మనం మరిచిపోయి కుటుంబమే మనంగా, వారి ఆనందమే మన జీవితంగా సాగుతున్నాం.

ప్రతి పాత్రను అందంగా ధరిస్తూ, క్షణక్షణం అప్రమత్త మవుతూ, అంతరంగంలో బడబాగ్నులు రేగుతున్నా పెదవులపై నవ్వులను పులుముకొని నటిస్తున్న వాళ్లమే మనమంతా. స్త్రీ యొక్క అంతరంగాన్ని నిష్పక్షపాతంగా ఆవిష్కరిస్తూ.. స్త్రీ కోరుకునే స్వేచ్ఛను నిర్భయంగా ప్రకటిస్తూ.. స్త్రీ జీవితానికి సాక్ష్యంగా నిలిచినదే రూపరుక్మిణి కవిత్వం. తను స్త్రీలవైపు వకాల్తా పుచ్చుకుని రాసిన అక్షరాలే 'అనీడ' కవితా సంపుటి. ఇందులోని ప్రతి కవితా ఆలోచింపచేసేదే.

మొదటి కవిత 'రంగుల గాయం'లో.. 'నీ మౌనం చేసిన గాయం సలుపుతోంది.. కత్తి చేసిన గాయం కన్నా', 'కాలర్ ఎగరేసిన చొక్కా రంగుమార్చుకుంటుంది.. మౌనం మాటైన క్షణం' అంటూ స్త్రీ మనసులోని అంతర్లీన స్థితులను కాచివడ బోస్తుంది. లోన గాయాల రూపాలను తట్టిలేపుతుంది. చిత్రవధ అవుతున్న మనసును దర్శింపజేస్తుంది.

'ఎన్నో సంశయాల మధ్య.. తామర తరకలాంటి మాటలతో చేరి యుద్ధం చేయాల్సి వస్తే .. కొన్ని నవ్వులను గుప్పిట పట్టి నవ్వాలని చూస్తూ ఉంటా" అంటూ ప్రతికూల పరిస్థితులపై యుద్ధం అనివార్యమని తనలోని మనోధైర్యాన్ని చాటిచెప్తారు. ఆపద వచ్చిందని బాధపడుతూ కూచోక పరిస్థితులతో సమరం సాగించాలని ప్రబోధిస్తారు... 'నేనొక' కవితలో.

'అగ్ని శిఖ'లో... 'నువ్వు ఏమి ఇవ్వాలో అది ఇవ్వనే లేదు.. తనకేం కావాలో తాను ఎప్పుడూ చెప్పనేలేదు' అంటూ స్త్రీమనసులోని ఆవేదనను, చెప్పక ఆగిపోయే ఊసులను, ఒంటరితనపు వేదనను, ప్రేమలోటును, కరిగిన స్వేచ్ఛను వివరిస్తారు. ఇది ప్రతి స్త్రీలోని నిగూఢ భావమే. దీన్ని కవయిత్రి చాలా సున్నితంగా, నర్మగర్భంగా చెప్పడం విశేషం. వీరి కవితలను చదువుతున్నంత సేపు చదువరులు పరకాయప్రవేశం చేయక తప్పదు.

'ఒక్క క్షణం' కవితలో.. 'ఏమని చెప్పాలి? స్త్రీనే దూషించే వాక్యంగా మలిచే పురుష అహంకారాలను' అంటూ.. స్త్రీ మోస్తున్న నిందలను, చేయని తప్పునకు భరిస్తున్న చీత్కారాలను

ఆవిష్కరిస్తారు. ముగింపులో 'మార్పు మనలోనే' అంటూ స్త్రీజాతిని మేల్కొల్పుతారు. అవును నిజమే కదా! ఏ సమస్యకు పరిష్కారమైనా మనలోనే ఉంటుంది. వెదుక్కోవాలి అంతే. పరిష్కారం లేని సమస్యంటూ ఉండదు కదా.

'నాన్నే ధైర్యం' కవితలో నాన్నకు తనపై ఉన్న అపారమైన ప్రేమను చక్కని పదాల్లో వర్ణిస్తారు. నాన్నతో తనకున్న అను బంధాన్ని వివరించారు. 'కనుమరుగవుతున్న బంధాలు' కవితలో... ఊరొదిలి పట్నం వెళ్లిన వారు కోల్పోయిన ఉమ్మడి కుటుంబ అనురాగాలను, చదువు పేరిట బంధిస్తున్న పిల్లల స్వేచ్ఛను, అనాథలుగా మారుతున్న వృద్ధుల వెతలను ఉటంకిస్తూ ఎద ఉప్పు సంద్రమౌతోంది అంటారు. 'సాయం లేని వ్యవ సాయంలో' 'నెర్రలు పడిన నేల వానచినుకుల కోసం ఆవు లిస్తుంటే.. వచ్చిన వానతో పెరిగిన పైరు వరదల్లో కొట్టుకు పోయి మిగిల్చిన విషాదాల్ని' అన్నదాతల బాధలను అభివ్యక్తీ కరిస్తారు. అన్నదాతల బతుకు చిత్రాలను పాఠకుల మనసులో ముద్రిస్తారు.

'ఆమె'ను కూడికలో తీసివేతను.. వేన్నీళ్లకు చన్నీటిని కాలమెరుగని చక్రాన్ని, అలుపెరుగని అవిశ్రాంతిని, అన్నీ తెలిసిన మౌనాన్ని అంటూ ధృవీకరిస్తారు. రూపా రుక్మిణి కవితలన్నీ భూమి చుట్టూ చంద్రుడు తిరిగినట్టుగా.. ఆమె చుట్టే తిరుగుతాయి. ఆమె అస్తిత్వానికై పోరాడుతూ, ఆమె పోరాటానికి ఊతమిస్తూ, ఆమె గురించే నిరంతరం తపిస్తుంటాయి. 'పత్తిమీద సాము' లో పత్తిరైతుల కష్టాలను, కన్నీళ్లను వర్ణిస్తారు. దళారీల చేతుల్లో మోసపోయి వలసకెళ్లిన రీతులను అక్షరీకరిస్తారు. 'అర్ధనగ్న సత్యం' 'శిశిరవేళ గ్రీష్మం', 'అస్థిత్వం', 'నిశ్శబ్ద నవ్వు' కవితల్లో స్త్రీ కోల్పోతున్న ఆనందాన్ని, భరిస్తున్న ఆవేదనను, ఇగిరిపోతున్న స్వాతంత్ర్యాన్ని ఆవిష్కరిస్తారు.

'చెలిమి' కవితలో.. 'ఓ..చల్లని సాయంత్రం వేళ/ నిదా నించిన నడకతో అక్కడకు చేరింది తాను.../ ఎన్ని వసంతాలు దాటినా/ ప్రతి సాయంత్రం ఆ ప్రదేశం వెన్నెల వేదికైంది' అంటూ సాయంత్రపు నడకలో చెంతచేరిన తన చెలి సాంగత్యాన్ని వెన్నెలతో పోల్చి చెబుతారు. వారి స్నేహానికి గొప్పగా అనుభూతి చెందుతారు. ఎన్నాళ్ళైనా వీడని వారి అనుబంధానికి సంధ్యాసమయాన్ని సాక్షిగా మలుచుతారు. 'లైఫ్ ఆఫ్టర్ కరోనా' కవితలో.. స్వేచ్ఛను కోల్పోయిన పక్షి జీవితాన్ని, పట్టెడు మెతుకుల కోసం ఎదురుచూస్తున్న ఆకలి కడుపులను, రోజువారీ కూలీల ఇక్కట్లను, ఎండిన ఆకుల్లా మారిన చేతి వృత్తులను, అన్నార్థుల ఆకలికేకల ఆనవాళ్లను కళ్లముందు సాక్షత్కరింపజేస్తారు. ముగింపులో 'కుదేలైన ఆర్థిక వ్యవస్థలో/ ఒకతరం కనుమరుగైపోతుందేమో' అన్న ఆవేదనను వ్యక్తం చేస్తారు. కరోనా కబళించిన కాలంలో మనుషుల వ్యథలు వర్ణనాతీతం కదా!

'బతుకుదారి' కవితలో .. ప్రైవేటు ఉపాధ్యాయుని దయనీయ స్థితిని వెల్లడిస్తారు. 'గర్వంగా ఎందరిలోనైనా తల ఎత్తుకు బతికే గురువు/ ఇప్పుడు... నేలకేసి చూస్తున్నాడని, అక్షరదానం చేసి జ్ఞానబాంధాగారం ఇప్పుడు బతకలేని స్థితిలో ఉన్నాడని, అగమ్య గోచరమైన ప్రైవేటు ఉపాధ్యాయుల జీవితాలను, కరోనా చేసిన గాయాల తాలుకూ ఆరని మంటను ఆవేదనాపూర్వకంగా అభివ్యక్తీకరిస్తారు. 'పూరేకులు రాలి ఒడిన ప్రతిసారీ చూస్తూ ఉంటాను', 'నాలో చెక్కు చెదరని భావాలు ఏమైనా జారి/ కాలగర్భంలో కలిసిపోయాయేమోనని తడుముకుంటాను' అంటారు 'అస్తిత్వం' కవితలో.

ఈ కవితలో స్త్రీలు కోల్పోతున్న అస్తిత్వంపై కమ్మిన మాయా మబ్బులను, వారి చింతను, గాయమైన గుండెల కన్నీటి గాథలను పదాలుగా పరిచారు. 'నీది కాని ప్రపంచం నీ చుట్టూ అలుముకుంటుంది/ మేఘాల దుప్పట్లు పరుచుకుంటాయి/ మెరుపుల వెలుతురు చూసి భ్రమిస్తుంటావు/ అక్కడకూడా నీవు ఆట వస్తువువే' అన్న సంగతి తెలిసి రోదిస్తుంటావు అంటారు. తనది కాని ప్రపంచంలో స్త్రీ స్థితిని చూసి విచారిస్తారు. ముగింపులో... 'అప్పుడు నువ్వో గడ్డిపువ్వై కాక గులాబీ ముళ్ళై వికసించాలి' అని స్త్రీజాతిలో స్ఫూర్తి నింపుతారు. చీకటి జగతిలో వెలుగుకై ప్రయత్నం చేయమని మేల్కొల్పుతారు.

స్త్రీ యొక్క ఆలోచన, ఆర్తి, ఆశ, ఆశయం, ఆనందం, దుఃఖం అన్నీ రూపరుక్మిణి కవితల్లో ప్రస్ఫుటమవుతాయి. మాటలతో చెప్పలేని భావాలను మౌనాక్షరాల్లో ప్రతిబింబిస్తాయి. ఒక స్త్రీ తనను తాను ఆవిష్కరించుకునే క్రమంలో చేసిన అక్షరయానంలా ఈ కవితా సంపుటి మనకు దర్శనమిస్తుంది. ఈ కవితలు నిగూఢమైన సత్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తాయి. శీర్షికలన్నీ వైవిధ్యంగా ఆమె అంతరంగాన్ని దర్శింపజేస్తాయి. దీనిలో మొత్తం 134 కవితలు ఉన్నాయి. రుక్మిణి కలం నుంచి మున్ముందు మరింత గొప్ప కవిత్వం వస్తుందని ఈ సంపుటి గట్టి హామీ ఇస్తోంది. 94411 33071 మొబైల్ నెంబర్లో సంప్రదించి ఈ పుస్తక ప్రతులు పొందొచ్చు.

■

## కవిత

# పెట్టుబడి

- గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201

చెరువు మట్టి తోలి
కుండలు చేసుకుంటున్న వాడి నోట్లో మట్టి కొట్టటానికి
కుండొద్దు రాతెండి ముద్దన్న పెట్టుబడి
అలవాటు పడ్డ జనం
క్యాన్సర్ బారిన పడి పోతుంటే
మళ్ళీ కుండనో ఉక్కు వైపో దృష్టి పెట్టిన జనం

ఉప్పో బూడిదో ఏ పుల్లో యేసి
పళ్ళు తోముతుంటే
తెల్ల తెల్లని పొడంటూ పేస్టంటూ
వైద్యుల ప్రకటనల హోరుతో వెర్రెత్తించి
కాల క్రమేణా ఉప్పుందా ఉసిరుందా యాపుందా అంటూ
ఉసురు పోసుకుంటున్న పెట్టుబడి!

ఇనుప పెంకలో మాడుతుందని
ఊదర గొట్టి నాన్‌స్టిక్ అంటూ
టెఫ్లాన్‌ని కడుపులోకి పంపి
మళ్లీ క్యాస్ట్ ఐరన్ అని విపణిలోకి పెట్టుబడి



పొయ్యిలో బూడిద
నిమ్మకాయతో జిడ్డు వదిలించుకున్న గిన్నెలు
అంట్ల సబ్బుతో తళుక్కు
పేరుకున్న రసాయనాలు వంటలో కలిసి అనారోగ్యం
కట్టెల పొయ్యి కాలుష్యం అంటూ
మరిపించి మురిపించి గ్యాస్ బండ అంటగట్టి
గుదిబండ చేసి సంపుతున్న పెట్టుబడి

రాట్నంతో వడికి మగ్గంతో నేసి
సిగ్గుని కప్పిన గుడ్డ
యంత్రాల ఒరవడిలో గుటుక్కుమంది
పోగు పోగు పొల్లు పొల్లున ఏడుస్తుంది

ఆకాశాన్ని అంటిన తాడెక్కి వడిసి వంచిన కల్లు
మద్యం సిండికేట్‌ల పందేరంలో
మండువలో నురుగులు కక్కుతూ సస్తుంది
మండుతున్న కొలిమి ఎర్రబారిన ఇనుము
డాకలిపై దెబ్బలతో పనిముట్టు
ట్రాక్టర్ వచ్చింది కొలిమి ఆరిపోయింది

బండి ఇరుసులు నాగళ్ళు చక్రాల నేర్పరితనం
బహుళ అంతస్థుల్లో తలుపుగూళ్ళయ్యింది

ఊరి మధ్య చకచకా గొరిగిన కత్తి
కార్పొరేట్ సెలూన్ అడకత్తెరలో నలిగి పోతుంది
బట్టలుతికే బండ పాచి బట్టి పోయింది
చౌడు మట్టితో మల్లెల్లా మెరిసిన గుడ్డ
డిటర్జెంట్‌తో మన్నిక కోల్పోయింది
ఇంటి ముందు పెళ్ళిళ్ళు ఫంక్షన్ హాళ్ళకి పరిగిడితే
పుస్తె మెట్టెలు బ్రదర్స్ కొట్లల్లో
బోసిపోయిన స్వర్ణకారుల ఇళ్ళు
నీళ్ళ క్యాన్ల రాకతో బిందెలు కాగులటకెక్కి
కంచరితనాన్ని కంచానికి దూరం చేసింది!

పెట్టుబడి విషమైనా అమ్ముతుంది
మనల్ని కొనేట్లు చేస్తుంది
ఏది అవసరమో మనకెరుకనంత కాలం
పెట్టుబడి చిమ్మేది విషమే
మానవ సంహారం మానవునికి తెలీకుండానే...!

కథ



# ఫేస్‌బుక్ - వాట్స్ ఆప్

- యక్కలూరి శ్రీరాములు
99856 88922

**నా**కు ఈ మధ్య అమెరికా నుంచి ఒకామె (అమెరికన్), బ్రిటన్ నుంచి ఒకావె (బ్రిటని) ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యారు. అమెరికా ఆమె ఫ్యాషన్ డిజైనర్, వ్యాపారవేత్తనీ; బ్రిటన్‌లో వున్న ఆవిడ రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాననీ చెప్పారు. ఫేస్‌బుక్‌లో నేను పోస్ట్ చేసిన 'షేడ్స్ ఆఫ్ మూన్ లైట్', 'ఎలగ్సిర్ ఆన్ ఎర్త్' కవితలు బాగున్నాయని చెప్పారు.

అలా పరిచయంతో ...

అక్కడి విశేషాలు నాతో, ఇక్కడి విషయాలు వారితో అప్పుడప్పుడు చాట్ చేస్తూ పంచుకోవడం, వాట్స్ ఆప్ ద్వారా మాటాడుకోవడం అలవాటయింది. బ్రిటన్‌లో వున్న ఆమె చాలా బిజీ అని తెలిసిపోయింది. ఆమెతో ఎప్పుడో గానీ మాట్లాడడం జరిగేది కాదు. అమెరికాలో ఉంటున్నామె తన విషయాలు ఎక్కువగా నాతో పంచుకునేది. తను ఇంకా పెళ్ళి చేసుకోలేదని ఓసారి మాటల మధ్యలో చెప్పింది. తన పేరు రోసీ.

ఓ రెండు నీలి సముద్రాలని గోలీలు చేసి కళ్ళుగా ఉంచుకుని, చందనం గులాబీ పూల మిశ్రమంతో శరీర చర్మాన్ని దిద్దుకుని, కెంపులు రాశిగా పోసినట్టు మెరుస్తున్న నిలువెత్తు విగ్రహం అనిపిస్తుంది... రోసీ సౌందర్యం. ప్రతి ఫొటోలోనూ, ప్రతి ఫ్రేములోనూ తన అందం నిబిడీకృతమై ఉంటుందనడంలోనే కాదు. ఆపాదమస్తకం తేనెధారతో ద్విగుణీకృతం అవుతుంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఓ రోజు మామూలు కన్నా కొంచెం ముందుగానే సాయంత్రం పూట ఫోన్ రింగ్ అయింది. వారికి ఉదయం...

"హలో గుడ్ మార్నింగ్" అన్నాను.

"గుడ్ ఈవినింగ్" అవతలి నుంచి రోసీ.

"ఈరోజు కొంచెం అర్లీగా ఫోన్ చేశారు. ఏమిటో విశేషం" అడిగాను.

"ఎస్... నేను మీకు చెప్పాను కదా! నా బిజినెస్ గురించి. ఇప్పుడు అమెరికాలోనే గాక ఆసియా దేశాల్లోనూ చేయాలని అనుకుంటున్నాను. ఇండియాలో నాకు తెలిసిన స్నేహితులు మీరే కదా! అందుకని మీనుంచి కొన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను" అంది రోసీ.

"అడగండి... నాకు తెలిసింది చెబుతాను" అన్నాను.

"ఇండియాలో ఏ సిటీల్లో ఫ్యాషన్ ఎక్కువగా ఉంటుంది" రోసీ

"నాకు తెలిసి నార్త్ ఇండియాలో అయితే మొట్టమొదట ముంబయి, పూణే, పిదప ఢిల్లీ. సౌత్‌లో హైదరాబాద్.. ఇంకా కొన్ని ప్రధాన నగరాల్లో" చెప్పాను.

"మీరుంటున్నది ఏ సిటీ" రోసీ

"నేను సిటీలో లేను"

"పోనీ ఏ సిటీకి దగ్గరలో ఉంటారు?"

"హైదరాబాద్‌కి 365 కిలోమీటర్ల దూరంలో వుంటున్నాను"

"దగ్గరే! మరి ముంబాయికి..." రోసీ

"చాలా దూరం... దగ్గర దగ్గర వెయ్యి కిలోమీటర్లు"

"దగ్గరే....కదా!" రోసీ

"బహుశా మీరు విమానాల్లో తిరిగి తిరిగి వెయ్యి కిలోమీటర్లు మీకు వంద కిలోమీటర్లతో సమానమని పిస్తుంటుంది"

చిన్నగా నవ్వింది.

"సరే! హైదరాబాద్లో ఒక వారం రోజులు డ్రెస్‌ల ప్రదర్శన, అమ్మకం చేయడానికి ఏదైనా ఎక్స్‌బిట్ కం సేల్స్‌కి హాల్ లభిస్తుందా!" రోసీ.

"ప్రయత్నిస్తే లభిస్తాయి. డ్రెస్ ఎగ్సిబిషన్‌లు హాల్స్‌లోనే కాదు స్టార్ హోటళ్లలో కూడా పెడుతుంటారు." చెప్పాను.

"గుడ్... నాకదే కావలసింది. మొదట ముంబయ్... పూణే... హైదరాబాద్... చివర రిటర్న్‌ప్పుడు ఢిల్లీ ప్లాన్ చేసుకుంటాను. ఓ నెలరోజులు సరిపోతుంది" రోసీ.

"సరిపోదు. నాలుగు వారాలు ఎగ్జిబిషన్ అనుకున్నా అటు ఇటు తిరగడానికి అదనంగా ఓ పది రోజుల సమయం పడుతుంది" అన్నాను.

"పోనీ.. నలభై లేదా యాభై రోజులు... సరిపోతుంది కదా!"

"సరిపోతుంది"

''సో! నేను ఫిక్స్... ఇంకో విషయం మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను" రోసీ.

"అడగండి..."

"ఇండియాలో వున్నన్నినాళ్లు నాతో మీరు స్పెండ్ చేస్తారా, ఇఫ్ యు డోంట్ మైన్" రోసీ

కాసేపు ఆలోచించాను.

"హైదరాబాద్‌లో మీకు కంపెనీ ఇస్తాను. మిగతా ప్లేసెస్ అంటే కొంచం కష్టమే" అన్నాను

''హెూ... మీకు పనులెక్కువేమో! ఆవైపు నేను ఆలోచించనేలేదు" రోసీ.

"నిజం చెప్పాలంటే... పనులేమీ నాకు లేవు. నేను ఏ పనీ చేయడం లేదు"

"వాట్ డూయూ మీన్... యు ఆర్ ఏ పొయట్, స్టోరీ రైటర్. మీకు చాలా పనులుంటాయి కదా!" రోసీ.

"హహహ... అమెరికాలో అయితే కవులు, రచయితలకి సమయం... పనులు... వారు ప్రొఫెషనల్స్ కానీ మాకు అటువంటిదేమీ ఉండదు" చెప్పాను.

"మరి మీ ప్రొఫెషన్ అదే కదా! సంపాదన అదే కదా!"

"ఇండియాలో రచనలకు, కవితలకు సంపాదనలుండవ్" నవ్వుతూ చెప్పాను.

"ఓ ఐసీ... సరే... హైదరాబాద్‌లో మీరు నాకు కంపెనీ ఇస్తారు కదా!" రోసీ.

"తప్పకుండా... మీరు హైదరాబాద్‌లో ఉన్నన్ని రోజులు ఇస్తాను"

"థాంక్యూ... గుడ్ నైట్ ఫర్ యు...." రోసీ.

"గుడ్ డే ఫర్ యు" ఫోన్ కట్టేసాను.

♦ ♦ ♦

రెండు నెలలు గడిచాయ్. రోసి నుంచి ఫోన్ లేదు.

సాధారణంగా రోసి నుంచి కాల్ వస్తేనే మాటాడుతాను గానీ నాకు నేనై కాల్ చేసింది లేనే లేదు. కారణం... వారికి పని ఎక్కువుంటుందని, తీరిక దొరికినప్పుడు చేస్తారని.

ఎపుడో ఓసారి గుర్తుకొచ్చినా రోసి గురించి పెద్దగా ఆలోచించలేదు. కొన్ని పరిచయాలు కొన్ని కాలాల వరకు, మరికొన్ని సమయ సందర్భాల వరకు మాత్రమే ఉంటాయని నా జీవితానుభవం చెప్పింది.

మూడునెలలు గడిచింది. రోసీ దాదాపు పూర్తిగా మరుగునపడి పోయింది.

♦ ♦ ♦

ఒకరోజు ఎవరి నుంచో నాకు కాల్ వచ్చింది. కొత్త నంబరు.

విమానాల శబ్దాలు, మనుషుల రణగొణ ధ్వనులు వినిపిస్తున్నాయ్.

"మేము ఢిల్లీ ఎర్ పోర్ట్ నుంచి మాటాడుతున్నాము. మీరు శ్రీరాములు గారు కదా" అవతలి నుంచి ఆంగ్లంలో స్వచ్ఛంగా మాటాడింది, ఓ స్త్రీ గొంతుక.

"ఎస్....నేనే"

"ఒకే సర్, సిక్స్ లాక్స్ పే చెస్తే గూడ్స్ రిలీజ్ చేస్తాము" అందామె.

"ఏమి గూడ్స్... ఎందుకు?" అనడిగాను.

"మీ ఫ్రెండ్ రోసి అమెరికా నుంచి డ్రెసెస్ బండల్స్ తెచ్చింది. వాటికి టాక్స్, ఎక్స్‌ట్రా లగేజ్ చార్జెస్ కట్టాలి. మీరు పే చేస్తారని ఆమె తెలిపితే మీకు ఫోన్ చేసాము"

ఒక్క క్షణం నాకేమీ పాలుపోలేదు.

కొంచెం ఆలోచించి "ఆమె ఎక్కడున్నారు" అనడిగాను.

"ఇక్కడే వున్నారు" అంటే ఆమెకు ఫోన్ ఇమ్మన్నాను. ఇచ్చారు.

"హాల్లో! ఐయామ్ రోసి"

"చెప్పండి. ఏమిటి విషయం" నేను.

"అదే... డ్రెస్ ఎక్సిబిషన్స్‌కి డ్రెస్‌లు తీసుకొచ్చాను" రోసీ.

"ఆహా...సరే! అసలు విషయం సూటిగా అడుగుతున్నాను. ఎందుకు నేను అమౌంట్ చెల్లించాలో తెలుపగలరా" అడిగాను.

"చెప్పాను కదా!ఎక్సిబిషన్‌లో సేల్స్ కోసం డ్రెస్‌లు తెచ్చాను"

"అయితే"

"అవి అమ్మగానే లాభంతో సహా పంచుకుందాం. మీరు నా బిసినెస్ పార్టనర్‌గా తీసుకుంటున్నాను." గడగడా చెప్పేసింది.

"నన్ను సంప్రదించకుండా నేను మీ బిసినెస్ పార్టనర్ అని మీరనుకుంటే ఎలా మేడం?" అన్నాను.

"ఇండియాలో ఎక్సిబిషన్ గురించి మిమ్మల్ని అడిగినప్పుడే నేను డిసైడ్ అయ్యాను" అంది రోసీ.

"మీరు డిసైడ్ అయ్యారు సరే! నన్ను అడగలేదు. మీరు ముందే ఈ విషయం తెలిపి ఉంటే, నేను అంత అమౌంట్ ఇన్వెస్ట్ చేయలేనని తెలిపేవాన్ని. అయినా నన్ను సంప్రదించకుండా మీరెలా నన్ను బిజినెస్ పార్టనర్ అనుకున్నారు. అదీగాక వ్యాపారం చేసేంత పెట్టుబడి నా దగ్గర లేదు" అన్నాను

"ఓకే... ఓకే... ఇప్పుడు చెబుతున్నాను కదా! మీరు ఇన్వెస్టు చేయాల్సిన అవసరం లేదు. ఇండియాలో మీరు నా బిజినెస్ పార్టనర్. మీరు ఇండియాలో నాతో కో ఆపరేట్ చేస్తే చాలు. ప్రాఫిట్‌లో నేను ట్వెంటిఫైవ్ పర్సెంట్ ఇస్తాను" రోసి.

"అయినా నాకిష్టం లేదు" చెప్పాను.

"ఇప్పుడెలా? బండల్స్‌ని ఎలా విడిపించాలి?" అడిగింది.

"నాకు చెప్పకుండా తెచ్చి ఇప్పుడెలా అంటే నేనేం చేయను? నా దగ్గర అంత మొత్తం లేదు. అయినా పొయిట్రీ బాగుందనడం, ఫ్రెండ్షిప్ చేయడం, చివరికి మీరు ఇలా ట్రీట్ చెయ్యడం సరైంది కాదని చెబుతున్నాను. మీ దేశం నుంచో మీకు తెలిసిన వారినుంచో అమౌంట్ తెప్పించుకుని వ్యాపారం చేసుకోండి. ఇంతకంటే నేనేం చేయలేను..."

"ఎలాగైనా అడ్జస్ట్ చేయండి... మిమ్మల్ని నమ్ముకునే వచ్చాను"

"మీరు ఏ విషయాన్నీ నాకు తెలియపరచకనే వచ్చారు. మునుపే తెలిపి వుంటే నేను మీకు స్పష్టంగా బిజినెస్ పాట్నర్‌గా ఉండలేనని నా నుంచి ఫైనాన్షియల్ సపోర్ట్ ఎట్టి పరిస్థితుల్లో జరగదని చెప్పేవాణ్ణి. సో... నేనేమీ సహాయం చేయలేను."

రోసీ మౌనం.

ఎయిర్ పోర్ట్ వారికి ఫోన్ ఇచ్చినట్టుంది

"సర్... అమౌంట్ పే చేస్తున్నారా?" అడిగారు.

"నో... అని ఆమెకి చెప్పాను. మీరు అడిగారు కాబట్టి మీకు చెబుతున్నాను" అన్నాను.

"ఒకే సర్" ఎయిర్ పోర్ట్ వారు. ఫోన్ కట్ అయ్యింది.

ఈ విషయం గురించి మెదడులో ఆలోచనలు చకచక జరిగిపోయి నిముషాల్లో.. క్షణంలో ముగింపు కొచ్చాయ్. ఎక్కువ సేపు ఇక ఈ విషయంలో ఆలోచించాల్సిన అవసరమే లేదనిపించింది. మనుషుల్ని చీట్ చేయడానికి ఎన్నో మార్గాలనిపించింది. రోసీ మాటల్లోనే తానేమిటో, తను వేసిన ప్లాన్ ఏమిటో చెప్పకనే, తను మాటాడిన ఒక్కో మాటలో చెప్పింది. చెప్పాపెట్టకుండా రావడమన్నది... ఆరు లక్షలు కట్టడమన్నది...ఇదొక్కసారి అమౌంట్ ఇవ్వండి... అనడంలోనే రోసీ మర్మం పూర్తిగా మోసపూరితమని అర్థమైంది.

అమెరికానుంచి వచ్చింది. నన్ను పార్టనర్‌గా తీసుకుంది అని ఎగిరి గంతేస్తే ... కేవలం ఫేస్‌బుక్ పరిచయం, వాట్స్ ఆప్ సంభాషణ.. అంతే కదా! మోహంలో పడి మోసపోయే వాళ్ళూ ఉంటారనిపించింది. మోసగించడానికి ఎన్నెన్నో ఎత్తులు వేసి, జిత్తులు చేసి, మనుషుల్ని చిత్తు చేసే లోకంలో అన్ని విధాలా మనిషిని వంచించడం చాలా సులభం... చాలా చాలా తేలికనిపించింది. గదిలో కూర్చొని ఎయిర్ పోర్ట్‌లో విమాన శబ్దాల మోత, మనుషుల రణగొణధ్వనులు సృష్టించడం పెద్ద విషయమేం కాదనిపించింది. ■

## అదృశ్య దుఃఖం

**ఆ**కాశంలోని రెండు తారలు
భూమిమీద సడివిన పాదాలకు
వెలుగును అద్దాలని ఆరాట పడుతున్నవి
కుదరక కన్నీరు కార్చుతున్నవి

గతం పరాయి పెత్తనంపై
జరిపిన సమరం ఓ కన్నీటి చరిత్ర ..
పుటల్లో సదవనికే.. కదా...!
ఆచరణ ఆకాశాన్ని అంటింది..

ఉన్నాదే తిని లేనప్పుడు ఆశయాల్ని మింగి
గుండె నిబ్బరంతో అడుగు ముడుపడ్డ
వర్ణ వివక్ష విశృంఖల విహారం చేసిన
కులం వర్గంలో ఆలోచనని మ్రింగచూసిన కపట శక్తులను
అడ్డంకులను ఆకాటితో అధిగమించి సాధించిన పత్రం..
నిరుద్యోగ దుఃఖాన్ని ఆపలేకుండా
ఏకాంతంలో అంతర్యుద్ధం చేస్తుంది...

ఎన్నికల 'బంధు' బంధాలన్నీ ఓట్లు రాల్చనికి
పడే పాట్లు ఒక్కపారి రైలుపట్టాలతో మొరపెట్టుకున్న
మాంసం ముద్దని అడగండి..
రాష్ట్ర సాధనకై ఆ నెత్తురు ఎన్ని మార్లు
లాఠీ దెబ్బల గుర్తులు ఎన్ని ధరించిందో!
అవును లే..
బతికున్నోడే అనుభవించాలనే
త్యాగాల చరిత అక్కరలేని గొర్రెలు
ఉన్నినిచ్చినప్పుడు రగ్గులవ్వడం ఏమంత పని...

ఇప్పుడు నిరుద్యోగం అదృశ్య దుఃఖం
ఎంతకీ తీరని అరణ్యరోదన!

**- నాగరాజు మద్దెల**
**63019 93211**

# వర్చువల్ వాగులో ఒంటరి పక్షి



- కంచరాన భుజంగరావు
94415 89602

**డి**జిటల్ వానలో వర్చువల్ వాగులో
గంటలకొద్దీ స్నానమాడి గుండెలారబెట్టుకునే
ఏకాంతం దక్కని ఒంటరితనం నేను...
నీలి తెరల్లో నవ్వుల్ని వెతుక్కుని
ఎమోజీలా స్పందించే
తడి లేని భావోద్వేగం నేను...
అపరిచిత ప్రపంచంలో
మిత్రబృందాన్ని వెతుక్కునీ
ముఖపుస్తకాలకు అతుక్కునీ
చెలిమి చిగురించని ముఖచిత్రం నేను...
చదువే బతుకైన కాలంలో
పోటీని ప్రాణవాయువులా శ్వాసించి
బాల్యాన్ని కోల్పోయిన బాల్యావరణం నేను...
అనురాగం కుంటుతున్న గదుల్లో
వృద్ధాప్యం, ఏమీ తోచనితనంతో చేసే
ఎడతెగని సహవాసం నేను...
కుటుంబమనుకుని కలిసున్న వాళ్లంతా
'సర్వేంద్రియానాం సెల్ఫోన్ ప్రధానం' అనుకుని
తలో దిక్కు తపనల్లో మునిగిపోయాక
మెలిసుండలేని గాచ్చారం నేను...

నాలో నేనే ఈ ఒంటరితనాన్ని
ఒక్కోసారి తేలికగా తలపై మోస్తాను
ఒక్కోసారి భారంగా భుజాన ఈడుస్తాను
నాలో నేనే తర్కాన్ని ఆశ్రయిస్తూ
కారణాలను వెతుక్కుంటూ
కునుకు పట్టిన బొంగరమై తిరుగుతాను...
ఏది కోల్పోయానో తెలియక
ఏది పొందాలో అర్థం కాక
ఒకే దారిలో పదే పదే తికమక పడతాను...
ఏదీ అక్కరలేనట్లు
దేనిపైనా మక్కువ లేనట్లు
మనసులో ఒక సుడి తిరుగుల తుపాను కన్ను!
అందరిచేతా తిరస్కరించబడినట్లు
జీవితానికి అర్థం చెరిగిపోయినట్లు
గుండెల్లో ఒక శ్వాసాడనివ్వని నీటి తిన్నెల వేదన!
గతం సృష్టించిన సమస్యల గూటిలోనే
గూడు కట్టుకుని అణుకు కూర్చుంటాను...
కానీ ఈ ఒంటరితనం గోతి నుంచి
మెడను సాచి పైకి లేస్తే
భవిష్యత్తు చింతనతో చూపు సారిస్తే
చేతులారా ఆలింగనం చేసుకొమ్మని పిలుస్తూ
ఒక సజీవ సమూహం కళ్లెదుట...!
నిత్యమూ కొత్తగా కోలాహలంగా –
నింగీ నేలా ఒళ్ళు కప్పుకున్న నీలి నయగారాల చీర
పచ్చంచు పైట కొంగుతో
నా బహిరాంతర్లోకాల్ని
సాంత్వన పరచడానికి సదా సిద్ధమై కళ్లెదుటే! ■

## కవిత

# మన మధ్యన మనిషి



చీకటి తెర సగం కూడా తెరవకనే
కీచురాళ్ళ చప్పుళ్ల సుప్రభాతంతో
పల్లె వేకువలో ఉషోదయ సంగీతం వింటూ
కిర్రుమనే చెప్పుల వేగంతో...
ప్రకృతి భూమితో స్నేహ హస్తం కలుపుతాడు!

కాలంతో పాటు నడిచే దావలో...
రోజూ ఎదురుపడతాడు!
కాలంతో పోటీ పడే దావలో...
ఆకలినే తింటూ బతికేస్తున్నాడు!
పగలు రాత్రి మధ్యన
సమయం సరిపోక ఉపక్రమిస్తున్నాడు!

బంధాలను ఇంటిచూలం ఉట్టిలో పెట్టి
సంపాదన రెక్కలు కట్టుకొని
ఊరిలోని వీధుల మీద పడతాడు!
తిరిగి తిరిగి రెక్కలు అలసి
నిస్సత్తువు నిండిన మనసుతో
నింగిని నిజంగానే నిందిస్తాడు!

పట్నం పట్టాల వేగాన్ని అందుకోలేని
పల్లె నివాసి పాలకేంద్రమవుతూ...
చల్లని మజ్జిగవుతుంటాడు!

పరదాల పట్టీల అందాల జీవనం కోసం
పగలు ప్రతీకారాల వేటుకు బలౌతాడు!

బొందిలో ప్రాణం ఉన్నంతవరకే
'మన మధ్యన మనిషి'
ఉసురే లేని మనిషికి
ఊరవుతుల గోతిలో నిద్రే గతి!
మూన్నాళ్ల కూడుతో మర్చిపోతారు! ■


- కుంచెశ్రీ
99088 30477


# 'పాలపిట్ట' దీపావళి కథల పోటీ

పాలపిట్ట- డాక్టర్ అమృతలత సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి కథల పోటీని నిర్వహించాలని పాలపిట్ట సంపాదకవర్గం నిర్ణయించింది. మంచి కథలని ప్రోత్సహించే లక్ష్యంతో తలపెట్టిన ఈ పోటీలో పాల్గనవలసిందిగా కథకులని ఆహ్వానిస్తున్నాం. మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండో బహుమతి రూ. 6 వేలు, మూడో బహుమతి రూ.4 వేలు, పది ప్రత్యేక బహుమతులు ఒక్కొక్క కథకి రూ.1000 చొప్పున ఉంటాయి. ఇతివృత్తం ఆయా రచయితల, రచయిత్రుల ఇష్టం. తీసుకున్న వస్తువును కథగా మలచడంలో చూపిన ప్రతిభకే ప్రాధాన్యం. కథలకు ఎలాంటి పేజీల పరిమితి లేదు. తాము చెప్పదలచుకున్న కథని ఒక పేజీలో చెబుతారా ఇంకా ఎక్కువ పేజీల్లో చెబుతారా అనేది కథకుల సృజనాత్మక స్వేచ్ఛకు సంబంధించిన అంశం. పోటీకి పంపించే కథలు సొంత కథలయి ఉండాలి. ఇదివరలో ఎక్కడా ప్రచురితం, ప్రసారితం కాకూడదు. కథలు చేరడానికి చివరితేదీ : 15 అక్టోబర్ 2021. మీ కథలని పోస్టు చేయవచ్చు లేదా మెయిల్‌లోనూ పంపవచ్చు.

చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఎఫ్-2, బ్లాక్ -6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044. ఫోను : 94900 99327. Email: palapittamag@gmail.com

- గుడిపాటి



మాట్లాడుతున్న జి రవీంద్రనాథ్; వేదికపై కెంగార మోహన్, రవికుమార్, శేషయ్య, రఘుబాబు తదితరులు

# సమాజంలోని వ్యక్తులే అద్దంలో బొమ్మలు

**చ**దివే అలవాటు తగ్గిపోతున ఈ తరుణంలో పుస్తకాలు తేవడం సాహిత్యానికి మంచిదని ప్రముఖ కథా రచయిత, యునైటెడ్ ఇండియా హైదరాబాద్ ప్రాంతీయ డిజిఎం గుమ్మడి రవీంద్రనాథ్ అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు కథా సంపుటి 'అద్దంలో బొమ్మలు' పుస్తకాన్ని 14.9.2021న కర్నూలులోని లలితకళా సమితిలో ఆయన ఆవిష్కరించారు. సమాజంలో కనిపించే పాత్రలే అద్దంలో బొమ్మలుగా మనకు రచయిత చూపారని, ప్రస్తుత తరుణంలో సమాజానికి ఇలాంటి కథలవల్ల ఎంతో ప్రయోజనముంటుందని రచయితను అభినందించారు. పుస్తకాన్ని సమీక్ష చేస్తూ వాస్తవ జీవితాలకు ప్రతిబింబాలుగా ఈ కథలున్నాయని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. హృదయానికి హత్తుకునే కథా వస్తువులను ఎంచుకోవడంలో రచయిత రఘుబాబు సిద్ధహస్తుడని, అన్ని కథల్లోనూ భాష వైవిధ్యంగా సాగి కథా గమనానికి ఉపయోగపడిందని చెప్పారు. రచయిత జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదేళ్ళు దాటినా ఇంకా అంటరానితనం, వివక్ష లాంటి సమస్యలు సమాజంలో చూస్తున్నామని అవి పూర్తిగా పోయేవరకు వివిధ రూపాల్లో కవులు తమ గళాన్ని వినిపించాలన్నారు. లలితకళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఇండియా అధికారులు కె.రవికుమార్, జె.భానుమూర్తి పాల్గన్నారు. ప్రగతి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ జె.ఎన్.శేషయ్య, రచయితలు జి.వెంకటకృష్ణ, వియోగి, వెంకటేష్, జహీర్ అహ్మద్, ప్రమోద్ చక్రవర్తి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయుడు సురేంద్ర రొడ్డ రచించిన 'భావతరంగాలు' కవితాసంపుటిని ఆగష్టు 20న తిరుపతి యంజియం ఉన్నత పాఠశాల ఐఎఎస్ అధికారి ముక్తేశ్వరావు ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డా వి.ఆర్ రాసాని అధ్యక్షత వహించారు. సప్తగిరి మాసపత్రిక పూర్వ సంపాదకులు డా సి.శైలకుమార్ పుస్తక సమీక్ష చేశారు. కంపల్లె రవిచంద్రన్, కలగుంట రామూర్తి, హరిసర్వోత్తమ నాయుడు, ఆకుల మల్లీశ్వరరావు, సాకం నాగరాజు, క్రిష్ణస్వామి రాజు, జిళ్ళేళ్ల బాలాజి, మూని వెంకటాచలపతి, దార్ల విజయకుమారి, విమల తదితరులు పాల్గొన్నారు.**

# పెద్దాపురం సాహితీ మూర్తులు పరిచయ సభ



ఆవిష్కరణ సభలో రెంటాల వెంకటేశ్వరరావు, గనారా, మధునాపంతుల, జానకిరామ చౌదరి, గౌరినాయుడు, కృష్ణబాబు

**కా**కినాడ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో డా.జోస్యుల కృష్ణబాబు రచించిన ''పెద్దాపురం సాహితీమూర్తులు' గ్రంథావిష్కరణ, పరిచయసభ సెప్టెంబరు 19వ తేదీ ఆదివారం ఉదయం కాకినాడ యుటిఎఫ్ సెమినార్ హాల్లో జరిగింది. సభాధ్యక్షులుగా సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా వ్యవహరించగా, నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి గ్రంథావిష్కరణ చేశారు. ప్రసిద్ధ సాహితీవేత్త డా.రెంటాల శ్రీవేంకటేశ్వరరావు గ్రంథాన్ని విశ్లేషిస్తూ... ఒక ఊరికి లేదా పట్టణానికి సంబంధించిన మొత్తం సాహిత్య చరిత్రకు అక్షరరూపం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. డా.జోస్యుల కృష్ణబాబు పెద్దాపురంలో ఇంతమంది కవులు, సాహితీవేత్తలు ఉన్నారన్న అంశాన్ని మిగతా సాహితీ ప్రపంచానికి తెలియజేసి తన పుర ఋణం తీర్చుకొన్నారని అన్నారు.

పల్లిపాలెం ఆంధ్రీకుటీరానికి చెందిన మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ఆస్వాదన సాహితికి చెందిన కొరుప్రోలు గౌరినాయుడు మాట్లాడుతూ 'ఈ పుస్తకం స్ఫూర్తితో ఆయా ప్రాంతాలకు సంబంధించిన సాహితీకారుల విశేషాలను గ్రంథస్తం చేయటానికి స్థానిక కవులకు ప్రేరణ కలుగుతుందన్నారు. ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్రకార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షులు చక్రవర్తి, జిల్లా సహాధ్యక్షురాలు జి.విజయగౌరి, తెలుగు పండిట్ అజయ్ కుమార్ మాట్లాడారు. అనంతరం సాహితీస్రవంతి కాకినాడ శాఖతో పాటు పలువురు సాహితీప్రియులు, కవులు, మిత్రులు గ్రంథరచయిత కృష్ణబాబును సన్మానించారు.

---

# వీక్షణం .. నవమ వార్షికోత్సవం



**కా**లిఫోర్నియాలో బే ఏరియాలోని వీక్షణం సాహితీ గవాక్షం 9వ వార్షిక సాహితీ సమావేశం సెప్టెంబరు 11, 2021న ఆన్లైనులో జరిగింది. ముందుగా వీక్షణం వ్యవస్థాపక అధ్యక్షులు డా.కె.గీత మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం ఒక చిన్న సమావేశంగా మొదలయ్యి ఇంతలోనే 9 సంవత్సరాలు అయ్యిందంటే ఆశ్చర్యంగా ఉందని అన్నారు. తమలో సాహితీ స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ, ఉచిత, స్వచ్ఛంద వేదికగా సమావేశాల్ని జరుపుకుంటూ వస్తున్న వీక్షణం సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తర్వాత కిరణ్ ప్రభ మాట్లాడుతూ వీక్షణం ఎప్పటికీ ఇలాగే ఒక ఆత్మీయ వేదికగా కొనసాగుతుందని, నిరంతర విజయానికి తోడ్పడుతున్న మిత్రులందరికీ పేరుపేరునా అభివందనాలు తెలియజేసారు. ఆ తరవాత వీక్షణం ప్రత్యేక సంచికల ఆవిష్కరణ కిరణ్ ప్రభ, కాంతి కిరణ్ గార్ల చేతుల మీదుగా జరిగింది. ఆ సంచికల పరిచయం వేణు ఆసూరి చేశారు. తర్వాత సుభాష్ పెద్దు "ఆమె ఎవరు?" అంటూ రవివర్మ చిత్రాలకు ప్రేరణగా నిలిచిన యువతుల గురించి ప్రసంగించగా, శ్రీచరణ్ పాలడుగు "కిరాతార్జునీయం" గురించి సోదాహరణంగా వివరించారు. మంజుల జన్నలగడ్డ "తెలుగు కళాత్మక సినిమా కథలు" గురించి, వేమూరి వేంకటేశ్వరరావు "అమెరికా ఆంధ్రులు తెలుగు తల్లికి చేసిన సేవ" గురించి, మధు ప్రఖ్యా యండమూరి నవలలు కలిగించిన స్ఫూర్తి గురించి మాట్లాడారు.


## ప్రస్థానం

**చందాదారులుగా చేరండి...**

**చేర్పించండి..**

**వివరాలకు 94900 99157 నెంబర్లో సంప్రదించండి.**

# డైరీ

## ఘనంగా గుర్రం జాషువా 126వ జయంతి సభలు

**క**ర్నూల్లో సాహితీ స్రవంతి, ప్రజానాట్య మండలి, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రగతి విజ్ఞానకేంద్రం సంయుక్త నిర్వహణలో నగరంలోని లలిత కళాసమితి సాహిత్య సమావేశమందిరంలో మహాకవి గుర్రం జాషువా 126 జయంతి సభను సెప్టెంబర్ 26న ఘనంగా నిర్వహించారు. సభను నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్య అతిధి మల్లికార్జున మాట్లాడుతూ జాషువా సాహిత్యం సామాజిక చైతన్యానికి ప్రతీకగా అన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ జాషువా అంతరాలు లేని సమాజాన్ని కోరుకున్నాడని, ఆ సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ.. ఆధునిక తెలుగు సాహిత్యంలో కలమనే ఆయుధంతో యుద్ధం చేసిన విశ్వనరుడు జాషువా అన్నారు. ఏపి నాటక అకాడమీ మాజీ డైరెక్టర్ యర్రమ పాండురంగయ్య మాట్లాడుతూ జాషువా పద్య పరిమళం తెలుగుపద్య సాహిత్యంలోనే వైవిధ్యభరితంగా సాగాయన్నారు. ఇంకా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ గంగాధర్‌రెడ్డి, ప్రగతి విజ్ఞానకేంద్రం కన్వీనర్ జెయన్ శేషయ్య మాట్లాడారు. నంది అవార్డు గ్రహీతలు మహమ్మద్ మియా, బాల వెంకటేశ్వర్లు, పీయన్ఎం సీనియర్ నాయకులు యంపి బసవరాజు జాషువా పద్యాలను పాడి వినిపించారు. సభలో సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, సహాయ కార్యదర్శి పులిచేరి మహేష్, పీయన్ఎం జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.






**ఆదోనిలో ...** కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో సాహితీ స్రవంతి, యూటీఎఫ్ డివిజన్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి జోహర్లర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ జాషువా సాహిత్యంపై మాట్లాడారు. డివిజన్ గౌరవాధ్యక్షులు ఎన్.నాగమణి, ఉపాధ్యక్షులు యూ.సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి డా.సక్కిరి భాస్కర్, కోశాధికారి కరేపాకుల రఘు, యూటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు గాదిలింగప్ప రంగన్న, ఆవుల బసప్ప, సీనియర్ నాయకులు పాపయ్య, కృష్ణమూర్తి నాయకులు రాజాహుసేన్, పెద్దయ్య లింగన్న నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురంలో ...**

**స్థానిక ఎన్జీవో హెూం లో** జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆచార్య జి. బాలసుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రాచపాలెం చంద్రశేఖర రెడ్డి ప్రసంగించారు. జాషువా కాలం చెల్లని కవి అని, ఆధిపత్య వాదానికి వ్యతిరేకంగా రచనలు చేశాడని అన్నారు. ఆచార్య జి బాలసుబ్రమణ్యం ప్రసంగిస్తూ... జాషువా రచనలు చదివితే ప్రతిఘటించే శక్తి, ప్రశ్నించే తత్వం వస్తాయని అన్నారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. జాషువా సాహిత్యాన్ని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డాక్టర్ శాంతి నారాయణ, డాక్టర్ ఎం ప్రగతి మాట్లాడారు.






**అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో** జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జాషువా జయంతి కార్యక్రమం జరిగింది. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీ తలారి రంగయ్య, ఆంధ్రప్రదేశ్ నాటకరంగ అకాడమీ చైర్ పర్సన్ చామలూరు హరిత రాజగోపాల్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఆశావాది ప్రకాశరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రంగస్వామి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చామలూరి రాజగోపాల్, జిరసం జిల్లా గౌరవాధ్యక్షులు డా.ఉద్దండం చంద్రశేఖర్ పాల్గొన్నారు. ■



## సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులుగా కెంగార మోహన్

**అ**భ్యుదయ సాహిత్య సంస్థ సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులుగా కెంగార మోహన్ ఎన్నికయ్యారు. సెప్టెంబరు 2వ తేదీన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు మార్పు జరిగింది. సాహితీస్రవంతి ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా ఆయన కర్నూలు జిల్లాలో తెలుగు ఉపాధ్యాయుడు. భాషా సాహిత్యరంగాల్లో చేస్తున్న మోహన్ కృషికి గానూ ఇటీవల ఏపి తెలుగు అకాడమీ నుంచి గిడుగు రామ్మూర్తి భాషా సేవాపురస్కారం పొందారు. సంస్థ ప్రధాన కార్యదర్శిగా కె సత్యరంజన్ కొనసాగుతారు. రాష్ట్ర కార్యవర్గంలోకి సత్యాజీ, శాంతిశ్రీ, పిల్లా కుమారస్వామిలను తీసుకున్నారు. సాహితీ ప్రస్థానం సంపాదకవర్గాన్ని ఇప్పుడు ఉన్నవారితో పాటు చీకటి దివాకర్, గనారా, డా.శమంతకమణి, పిల్లా కుమారస్వామిలతో విస్తరించారు.



**తూ**ర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో సాహితీస్రవంతి, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జాషువా జయంతి సభ జరిగింది. ప్రజానాట్యమండలి తూర్పు గోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు ద్రారపురెడ్డి సత్యనారాయణ, సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కఅష్ణబాబు, చల్లావిశ్వనాథం, కొత్త శివ ప్రసంగించారు. పూడి శ్రీనివాస్, దారపురెడ్డి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు కృష్ణ, రొంగల వీర్రాజు, అమృత, నమ్రత అభ్యుదయగీతాలను ఆలపించారు.



## 'రవికిరణాలు' పుస్తకావిష్కరణ

**సా**హితీ స్రవంతి, పెద్దాపురం సభ్యుడు ఉప్పిటి రవికుమార్ రచించిన కవితా సంకలనం 'రవికిరణాలు' పుస్తకాన్ని పెద్దాపురం ఆర్డీవో ఎస్.మల్లిబాబు 5-9-2021న యాసలపు సూర్యారావు భవనంలో ఆవిష్కరించారు. ఈ సభకు సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించారు. మల్లిబాబు మాట్లాడుతూ కవిత్వం ఎంతో ఉన్నతమైనదని, కవికి విషయాన్ని చూసి స్పందించే గుణం ఉండాలని, దానిని సరైన విషయ పరిజ్ఞానంతో వ్యక్తీకకరించాలని అన్నారు. సాహితీస్రవంతి అధ్యక్షులు కృష్ణబాబు మాట్లాడుతూ ఇందులోని కవితలు వివిధ సామాజిక అంశాలను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ఈ పుస్తకాన్ని వంగలపూడి శివకృష్ణ, కొత్త శివ, ఐజయ్ కుమార్ పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం కె.నవజీవన్ రాజు, చల్లా విశ్వనాథం మాట్లాడారు.

## విద్యార్థులకు కవితల పోటీ

**భా**రత స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల పాఠశాలల విద్యార్థుల నుంచి అక్షర సేద్యం ఫౌండేషన్ కవితలను ఆహ్వానిస్తోంది. విద్యార్థులు తమకు నచ్చిన అంశంపై 20 వరుసలకు మించకుండా రాసి పంపాలి. 75 ఉత్తమ కవితలను ఎంపిక చేసి, ప్రతి విజేతకు రూ.100 విలువ గల సాహిత్య పుస్తకాలు, ప్రశంస పత్రం బహుకరిస్తామని, 75 కవితలతో సంకలనం ప్రచురిస్తామని అక్షర సేద్యం ఫౌండేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భైతి దుర్గయ్య, వేల్పుల రాజు చెప్పారు. కవితలను కన్వీనర్, వజ్రోత్సవ కవితల పోటీ, అక్షర సేద్యం ఫౌండేషన్ గ్రా. రామునిపట్ల, సిద్దిపేట జిల్లా -502267 చిరునామాకు నేరుగా, లేదా 9701933704 నెంబరుకు వాట్సాప్ ద్వారా అక్టోబరు 20లోగా పంపాలి. ■

# ఎంవి రమణారెడ్డి కన్నుమూత



ఎం.వి.రమణారెడ్డిగా, ఎంవిఆర్‌గా ప్రసిద్ధి పొందిన మల్లెల వెంకట రమణారెడ్డి సెప్టెంబరు 29వ తేదీ ఉదయం కన్నుమూశారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఒక వ్యాపార కుటుంబంలో 1944లో ఆయన జన్మించారు. ఆయన జీవితం ఒకవైపు రాజకీయాలు, మరోవైపు సాహిత్యం, జైలు జీవితం, వైద్యసేవ ... ఇలా సాగింది. ఆయన గుంటూరు వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ చదివి, ప్రొద్దుటూరులో ప్రాక్టీసు ప్రారంభించారు. పేదలకు ఉచితంగా వైద్యం చేశారు. చదువుకునే రోజుల్లో వామపక్ష భావజాలానికి ఆకర్షితుడయ్యారు. తన వద్ద వైద్యం కోసం వచ్చిన కార్మికుల స్థితిగతులను చూసి, వారిలో చైతన్యం కోసం ఒక కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నో రచనలు, అనువాదాలూ చేసి సాహితీవేత్తగా ప్రసిద్ధి పొందారు. ఎన్టీ రామారావు ఆహ్వానంతో ఎంవిఆర్ 1983లో తెలుగుదేశం పార్టీలో చేరాడు. ఎమ్మెల్యేగా గెలిచి అనేక సమస్యల మీద పనిచేశారు. రాయలసీమ సాగు నీటి సమస్యలపై నిరాహార దీక్ష చేశారు. 1985లో టిడిపికి రాజీనామా చేసి రాయలసీమ విమోచన సమితిని ఏర్పాటు చేశాడు. ఆ పార్టీ తరుపున ఆయన స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి, 20–25 వేల ఓట్లు వరకూ సాధించేవారు.

1970లో విరసం ఏర్పాటులో ఎంవిఆర్ ఉన్నారు. తరువాత అందులో ఇమడలేక బయటికి వచ్చేశారు. ప్రజల భాషలో ఎన్నో కరపత్రాలు రాశాడు. కవిగా, నవలా రచయితగా, అనువాదకుడిగా, వ్యాకరణ రచయితగా, సంపాదకుడిగా ఆయన సాహిత్య ప్రస్థానం సాగింది. ఎంవిఆర్ మొదట్లో కవిత్వం రాసినా తర్వాత దానిని పక్కకు పెట్టి పూర్తిగా వ్యాసాలకు పరిమిత మయ్యారు. 'ప్రభంజనం' పత్రికను నడిపి అనేక సాహిత్య రాజకీయ అంశాలను రాశారు. దానికోసం ప్రగతి ప్రింటర్స్‌ను ప్రొద్దుటూరు లో స్థాపించారు. తెలుగు వ్యాకరణం గ్రంథాన్ని రాశారు. వ్యాసాలను ఎలా రాయాలి, ఎలా అనువాదం చేయాలి మొదలైన అంశాలను ఇందులో వివరించారు. ఆయన కథలు 'పరిష్కారం' పేరిట సంపుటిగా వెలువడ్డాయి. వ్యాసాలు 'శంఖారావం' పేరుతో ప్రచురించారు. అనేక ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. హెచ్ జి వెల్స్ రాసిన వరల్డ్ హిస్టరీని ప్రపంచ చరిత్రగా అనువదించారు. మరికొంత వివరణ ఇవ్వడం కోసం టూకీగా ప్రపంచ చరిత్ర కూడా రాశారు. బ్రిటిష్ రచయిత జాషువా హర్న్ రాసిన పుస్తకం అవే ఫ్రమ్ పేస్ట్‌ను పురోగమనం పేరుతో అనువదించారు. హెన్రీ పేషాయర్ రాసిన పాపియాన్ నవలను 'రెక్కలు చాచిన పంజరం' పేరుతో అనువదించారు. ఇందులో స్వేచ్ఛ కోసం పరితపించే మనిషి మానసిక స్థితి గురించి చక్కగా వివరించారు. ఇది ఆయన వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటుందని చాలామంది అంటారు.

ఆయుధం పట్టని వీరుడు పేరుతో అమెరికా పౌరహక్కుల నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ జీవిత చరిత్రను కూడా రాశారు. చదువు ద్వారా బడుగు జీవులు బాగుపడతారని నెల్సన్ మండేలా భావిస్తే పేదరికం పోతేనే సమాజంలో వీరంతా గౌరవంగా బతుకుతారని మార్టిన్ లూథర్ భావించారని ఆయన ఇందులో పేర్కొన్నారు. ఆర్ కె నారాయన్ రాసిన ఎ టైగర్ ఫ్రం మాల్గుడి గ్రంథాన్ని పెద్దపులి ఆత్మకథగా అనువదించాడు. మార్గరెట్ మిషన్ రాసిన గాన్ విత్ ది విండ్ నవలను చివరకు మిగిలేది పేరుతో అనువదించారు. టాకేటివ్ మాన్‌ను మాటకారిగా అనువదించారు. మాక్సిం గోర్కీ రాసిన అమ్మ నవలను తన ఆఖరి సృజనగా కడుపుతీపి పేరుతో అనువాదం చేశారు. నాలుగేళ్ల క్రితం ఆయనకు ఓపిసిడి (క్రానికల్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్) వ్యాధి సోకింది. దాంతో ఆయన ఊపిరితిత్తులు క్షీణించాయి. వైద్యులు బైపాస్ మిషన్, కాన్సన్ట్రేటర్ మాస్కులు అమర్చారు. ఆయన చేసిన రచనలు, అనువాదాలు ఆయన వ్యక్తిత్వానికి, సాహితీ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తాయి.

**సాహితీ స్రవంతి సంతాపం**

ప్రముఖ రచయిత, అనేక ప్రామాణిక గ్రంథాల అనువాదకులు డా.ఎంవి.రమణారెడ్డి మఅతిపట్ల సాహితీ స్రవంతి ప్రగాఢ సంతాపం తెలిపింది. కమ్యూనిస్టు భావజాలంతో విరసంలో కలిషి ప్రారంభించిన రమణరెడ్డి మలిదశలో శాసనసభ్యుడుగానూ సేవలందించారు. తెలుగు భాషపై రాయలసీమ సమస్యలపై, మానవ సమాజ పరిణామంపై సినిమాలపై విస్తఅతంగా అధ్యయనం రచనలు చేశారు. సాహితీ స్రవంతి శ్రేయోభిలాషిగా సహకరించడమే గాక కొత్త రచయిత లను ప్రోత్సహిస్తూ వచ్చారు. తీవ్ర అనారోగ్యంతో పెనుగులాడుతూనే అమ్మ నవలను సరికొత్తగా ఆఖరి రచనగా అందించారు. డా.రమణారెడ్డికి జోహార్లర్పిస్తూ కుటుంబానికి సన్నిహితులకు హఅదయపూర్వక సానుభూతిని తెల్పుతున్నామని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, కె.సత్యరంజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**- పిల్లా కుమార స్వామి**

**94901 22229**

# కొడవటిగంటి కుటుంబరావు

జననం : 28.10.1909 మరణం : 17.08.1980



మొట్టమొదటి కథ 'ప్రాణాధికం' గృహలక్ష్మి
మాసపత్రిక ఏప్రిల్ 1931 సంచికలో అచ్చయింది.
ఆనాటి నుంచి వందలకొలదీ కథలు, కల్పికలు,
పదిపన్నెండు నవలలు, నాటికలు, వేలకొలదీ వ్యాసాలు రాశారు.
కన్ను మూసేవరకు కలం కింద పెట్టలేదు.

SAHITYA PRASTHANAM • SAMPUTI - 3 • SANCHIKA - 1 • KRISHNA • October 2021
RNI NO.APTEL/2004/18396 • Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month • Date of Publication : 27.7.2021

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533